ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 4 జనవరి 2023 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



# పురస్కార ప్రదానం

## డాక్టర్ ప్రత్తిపాక మోహన్‌కు బాలసాహిత్య పురస్కారం



ప్రముఖ బాల సాహితీవేత్త, కవి, అనువాదకులు, విమర్శకులు డాక్టర్ పత్తిపాక మోహన్ నవంబరు 14, 2022న కేంద్ర సాహిత్య అకాడెమీ బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు న్యూఢిల్లీలోని ప్రసిద్ధ త్రివేణి కళాసంఘం ఆడిటోరియంలో సాహిత్య అకాడమీ నిర్వహించిన బాల సాహిత్యోత్సవంలో పురస్కార ప్రదానం జరిగింది. అకాడమీ అధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య చంద్రశేఖర కంబార్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మోహన్ రచించిన **'బాలల తాత బాపూజీ'** గేయసంపుటికి ఈ పురస్కారం లభించింది. పురస్కారం కింద అకాడమీ తామ్ర ఫలకం, మెమంటో, రూ. 50 వేలతో పాటు సత్కారం అందజేశారు. ప్రముఖ హిందీ బాల సాహితీవేత్త ప్రకాష్ మను, అకాదెమి ఉపాధ్యక్షులు డా॥ మాధవ్ కౌశిక్ మాట్లాడుతూ... బాల సాహిత్య విశిష్టతను వివరించారు. అకాడమీ కార్యదర్శి డా॥ కృత్తివెంటి శ్రీనివాసరావు పురస్కార గ్రహీతలను, పురస్కారం పొందిన వారి గ్రంథాలను పరిచయం చేశారు.

## పల్లిపట్టుకు యువ సాహిత్య పురస్కారం

**కే**ంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని కవి పల్లిపట్టు నాగరాజుకు 27.12.2022వ తేదీ మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. అకాడమీ ఉపాధ్యక్షుడు మాధవ్ కౌశిక్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. నాగరాజు రాసిన 'యాలై పూడ్చింది' కవితా సంపుటిగానూ కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైంది. ఈ పురస్కారం కింద తామ్ర. ఫలకం, రూ. 50 వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. తిరుపతి జిల్లా సత్యవేదు మండలం రాజగోపాలపురం గ్రామానికి చెందిన నాగరాజు తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. గతంలో పలు సాహిత్య సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు.




కవర్ పేజి ఫోటో : కె. రాజేష్, విశాఖపట్నం

సాహిత్య ప్రస్థానం

జనవరి 2023
సంపుటి : 4 సంచిక : 4

# ప్రజల కోసం .. సృజన కోసం 2023

'మరోసారి పెరుగుతున్న కోవిడ్ పునరాగమన భయాల మధ్య 2023 ప్రవేశిస్తున్నది. ఇది దేశమంతటా కీలకమైన ఎన్నికల కాలం కాబోతున్నది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల అప్పుల మోత, ధరల వాత, ఉద్యోగాల కోత వంటివి ప్రజలను భయపెడుతున్నాయి, కామధేనువులా గోచరించిన ఐటి రంగం కూడా కదలిపోతున్నది. సుప్రీం కోర్టునే ఒత్తిడి పెట్టే అప్రజాస్వామిక ధోరణి దేశంలో తాండవిస్తున్నది. మతాల మంటలు, కులాల కుటిల వ్యూహాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ప్రజావరణం, ప్రభుత్వ రంగం కుదించుకుపోతుండగా... ప్రైవేటుమయమైన వ్యవస్థ విశృంఖలంగా విస్తరిస్తున్నదని విశాఖ ఉక్కు హెచ్చరిస్తోంది. విద్యారంగంలో విశృంఖల శాసనాలు చాప కింద నీరులా రేపటి తరం బుర్రను కూడా అయోమయానికి గురి చేస్తున్నాయి. మిడిమేళపు మీడియా కథనాలు ఏది సత్యం ఏదసత్యం అన్న మహాకవి ప్రశ్నను నిజం చేస్తున్నాయి. వ్యవస్థలు అధికారం గుప్పిట్లో బందీలవుతున్నాయి. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ప్రాథమిక హక్కులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. అందరికంటే ఎక్కువగా వీటిని ఆకాంక్షించే ప్రజాపక్ష కవులూ, రచయితలూ, కళాకారులూ, బుద్ధిజీవుల పరిస్థితి అడగడుగు గండంగా మారిపోతున్నది. అధినేతల ఘనత మోత మోగుతున్నా అసలు పరిస్థితి అన్ని విధాలా అధ్వానమవుతున్నది. ఆందోళన కలిగిస్తున్నది. దళిత బలహీన వర్గాలు, మహిళల భద్రత దినగండమవుతున్నది. ఆధిపత్యం ఛాందసం, మతతత్వం బుసలు కొడుతున్నది. ఇందులో ప్రతిదానికి బోలెడుఉదాహరణలు, సంఘటనలు చెప్పొచ్చు గాని 24/7 చూస్తున్నాం గనక ఆ అవసరం లేదు. ఆ విస్తృత పరిశీలన లోపల వున్నది.

ఇవన్నీ చూసి వచ్చే రోజులు కూడా ఇలాగే ఉంటాయని పాఠాలు చెప్పేవారికి లోటు లేదు. ఈ సమయంలోనే అనేక ఉద్యమాటు పోరాటాలు ప్రతిఘటనలనూ చూస్తే ఆ విధమైన నిస్పృహకు అవకాశం వుండదు. దిగజారుతున్న పరిస్థితుల్లో వీటిని ఇవి మరింత ప్రజ్వలిల్లాల్సిందే తప్ప చల్లారే ప్రసక్తి వుండదు. ప్రగతి ప్రజాశ్రేయస్సు ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం కోరే కలాలకూ గళాలకూ విరామం వుండదు. ఇన్ని సవాళ్ల మధ్యనా సాహిత్యకారులు గడచిన ఏడాది ఆ పాత్ర నిర్వహించడంలో ముందున్నారు. రాబోయే కాలంలోనూ అదే బాటలో ముందుకు నడుస్తారనే విశ్వసిస్తున్నాం. సృజన పంచడంతో ప్రజలకు మరింత చేరువై చైతన్యపర్చగలరనిఆశిస్తున్నాం.

సాహితీ స్రవంతి వివిధ కోణాల్లో వివిధ ప్రాంతాల్లో విస్తారమైన కృషి చేసింది. మంచిని ప్రోత్సహిస్తూ తిరోగమనాన్ని ప్రశ్నించింది. విశాల ప్రగతిశీల సాహితీ వేదికగా తన బాధ్యత నెరవేర్చింది. ప్రస్థానం ఇందుకు వేదికగా నిలిచింది. రాబోయే కాలంలో దీన్ని మరింత విస్తృత పర్చుకోవడానికి లోపాలోపాలు సరిచేసుకుని శక్తివంతంగా ముందుకు సాగడానికి సిద్ధంగా వుంటామని, చేయవలసింది ఇంకా ఎంతో వుందని భావిస్తున్నాం. ఇందుకు సాహిత్య మిత్రులు శ్రేయోభిలాషుల అండదండలు కోరుతున్నాం. *మీకందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.* ■

ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్ • కెంగార మోహన్ • వొరప్రసాద్**
**• చీకటి దివాకర్ • గనారా • కుమార స్వామి**
*మేనేజర్ :* **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


కొత్త ప్రశ్న : సుబ్రమణ్యం ............... 5
అక్రమ రవాణా : నల్లపాటి సురేంద్ర .......18
పాల'వెల్లి : రాజేంద్ర ప్రసాద్ చేలిక .. 32
నిర్ణయం : భమిడిపాటి గౌరీశంకర్ ... 43


## కవితలు


వర్ణాలు లేని వాక్యాలు : సరికొండ నరసింహరాజు .. 8
కొంత వెలుగు కొన్ని చినుకులు : డా.సుంకర గోపాలయ్య ... 9
దుబై : కోట చంద్రశేఖర్ ............ 9
అక్షరం కవిత్వంగా ... : మానాపురం రాజా చంద్రశేఖర్ 13
ఉల్కలు : ఈతకోట సుబ్బారావు ..... 14
తీరిగ్గా ... : 'సడ్లపల్లె చిదంబర రెడ్డి 14
ప్రేమించు : కర్లపాలెం హనుమంతరావు 16
చలనశీలతే వరం : కమలేశ్ .................. 17
కలల దారిలో కాలంతో .. : హెచ్. మేఘన ................ 17
అక్షరాల భయం : రూపా దూపాటి ........... 20
ఇంకా బతికే ఉన్నాం! : డా.పొదిలి నాగరాజు ....... 21
కన్నీటి ధార : కుడికాల వంశీధర్......... 24
చెరసాల : ఈదర శ్రీనివాసరెడ్డి ......... 24
నా పోస్టుమార్టం రిపోర్టు నాకివ్వండి : సాంబమూర్తి లండ ...... 28
స్వాగతం : ములుగు లక్ష్మీ మైథిలి ..... 30
మనిషి - చెట్టు : డా.పాతూరి అన్నపూర్ణ ... 31
దాహం దాహం : చిన్ని నారాయణ రావు .... 31
సీకటి ఆకాశం : కంచరాన భుజంగరావు ... 35
కైతా .. శత్రువే! : అవ్వారు శ్రీధర్ బాబు ...... 42
ఎత్తుకుపోయారా?! : పద్మావతి రాంభక్త ......... 45
మరో ప్రపంచానికీ అమ్మ ఆమె : అడిగోపుల వెంకటరత్నం ... 51
అంట్లు తోమే చేతులు : మెట్టా నాగేశ్వరరావు ...... 54
భక్తి : బండి అనూరాధ ........... 62


## వ్యాసాలు


ఎప్పటికీ నిలబడే 'ఇక ఇప్పుడు ...'
– శృంగవరపు రచన ............... 10
జీవితమే కవిత్వమైన కలల కార్ఖానా
– డా. బద్దిపూడి జయరావు ........ 15
సుతిమెత్తగా .. చురకత్తిలా ...
– కెంగార మోహన్ ................. 22
ఆదర్శ అధ్యాపకుడు ఆచార్య తుమ్మపూడి
– రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ...... 25
మానవీయ స్పర్శ ఉన్న కథలు
– అలజంగి మురళీ మోహనరావు 29
సాహితీ ప్రజ్ఞ ................................................. 36
కవితావేశానికి ప్రతీక 'కాలం ఒడిలో ...'
– విఎంకె లక్ష్మణరావు .............. 37
చదవాల్సిన కథలు 'షేమ్ .. షేమ్ – పి సత్యవతి..... 39
ముఖాముఖి : సాహిత్యం అనేది చాలా సీరియస్ మ్యాటర్!
– డా. అంపశయ్య నవీన్ .......... 40
భిన్న అస్తిత్వ వేదనల అవస్థ – పుష్యమీ సాగర్ ............46
వర్తమానం : సవాళ్లకు సిద్ధం చేసిన 2022
– తెలకపల్లి రవి ...................... 49
పల్లెపదాల కవితా పరిమళం చింతల తొవ్వ
– డాక్టర్ అహ్మద్ హసన్ .......... 52
కాలమే మళ్లీ అక్షరాభ్యాసం చేయిస్తోంది!
– డాక్టర్ మాడభూషి శ్రీధర్ ...... 55
బరంపురంలో వికాసం స్వర్ణోత్సవాలు – విజయచంద్ర 58
నాణ్యమైన పరిశోధన .. 'భావ కవిత్వ వాఙ్మయ విచారం'
– డా. రెంటాల శ్రీవెంకటేశ్వరరావు 60
వికటిత జీవితాల హృదయ పరిమళం – రఘుబాబు... 63
డైరీ ........................................................ 64



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# కొత్త ప్రశ్న

- సుబ్రమణ్యం
93465 55174

**'ఆడది కోరుకునే వరాలూ రెండే రెండూ**

**చల్లని సంసారం, చక్కని సంతానం'** అని పాడుకుంటోంది సునంద. ఎప్పుడో చిన్నప్పటి పాత సినిమాలోని ఆ పాట తనకు చాలా ఇష్టం. సునంద తండ్రి విజయనగరంలో టెలికాం ఉద్యోగి. అతగాడికి ఒక కొడుకు, ఒక కూతురు సంతానం. సంతానమే కాదు, అతగాడి బతుకూ, ఆలోచనలూ అన్నీ పరిమితమే. సగటు మధ్య తరగతి జీవి సంతృప్తిగా బతికేయాలంటే అతగాడు ఎటువంటి తాత్వికతను అలవర్చు కోవాలో అదంతా ఒంటబట్టించుకున్న వాడు. దానినే తన సంతానానికీ ఎక్కించేడు. వాళ్ళూ దానినే స్వీకరించేరు. తండ్రి కోరుకున్నట్లే కొడుకు ఇంజనీరింగ్ చేసి, ఆ తర్వాత ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో 'ఏడాదికి 9 లక్షల ప్యాకేజీ' ఉద్యోగం సంపాదిం చేడు. సునంద కూడా తండ్రి కోరినట్టే హెూం సైన్స్ డిగ్రీ చేసింది. అమ్మ దగ్గర వంటల కళను కూడా నేర్చుకుంది. 'సునందకేం? చక్కగా ఉంటుంది. బుద్ధిగా చదువుకుంది. పిచ్చి పిచ్చి ఫాషన్ల జోలికి అస్సలు పోదు. ఇల్లు పొందికగా అమర్చుకోగలదు. ఎవరైనా కళ్ళకద్దుకుని చేసుకుంటారు. ఇంతకీ ఆ చేసుకునేవాడికి ఎంతో అదృష్టం ఉండాలి మరి". ఇది సునందకి దగ్గర బంధువులనుండి వచ్చిన సర్టిఫికెట్.

మరి ఆ బుద్ధిమంతురాలికి ఓ బుద్ధిమంతుడు భర్తగా రావాలి కదా? సునంద అన్నకి స్నేహితుడు సోమయాజులు అలాంటి బుద్ధిమంతుడే. ఆ విషయాన్ని సునంద అన్న మాత్రమే కాక, సోమయాజుల్ని ఎరిగినవాళ్ళెవరిని అడిగినా చెప్తారు. "వేలల్లో ఎన్నదగ్గ మనిషి. ఎటువంటి దురలవాట్లూ లేవు. ఆఫీసులో మంచి పనిమంతుడన్న పేరుంది. అనవసర ఖర్చులు చేయడు. రాజకీయాల జోలికి పోడు. తనేమిటో, తన పనేమిటో అన్నట్టుంటాడు తప్ప అనవసర తగాదాలలో తల దూర్చడు."

... ఇదీ అతగాడికి ఉన్న సర్టిఫికెట్.

"ఇంతకన్నా మంచివాడిని తేలేం మనం" అని సునంద తండ్రి, తల్లి, అన్న ఏకాభిప్రాయాన్ని ప్రకటించేరు. సునంద సోమయాజులు ఫొటో చూసింది. బాగానే ఉన్నట్టు అనిపించింది. పెళ్ళిచూపులు పద్ధతి ప్రకారం జరిగాయి. ఇరువైపులవారికీ అన్ని విధాలుగా ఈ సంబంధం నచ్చింది.

పెళ్ళి పద్ధతిగా, సాంప్రదాయాలకు అనుగుణంగా జరిగింది. బంధువులందరూ మెచ్చుకున్నారు. "చూడ చక్కని జంట" అని అందరూ అన్నారు. దాంతో ఒకటికి రెండు సార్లు సునంద అమ్మ, అత్తయ్య కొత్త జంటకి దిష్టి కూడా తీసేసేరు.

◆◆◆

కొత్త కాపురానికి పయనం అయింది సునంద. సాంప్ర దాయం ప్రకారమే పెట్టుపోతలన్నీ 'మాట రాకుండా' జరిపించేడు సునంద తండ్రి. భేష్ అని మెచ్చుకున్నాడు సునంద మావఁగారు.

హైదరాబాద్ మాదాపూర్‌లో ఓ రెండు గదుల అపార్టుమెంట్ అద్దెకు తీసుకున్నాడు సోమయాజులు. కొత్త ఇంట్లోకి అడుగు పెట్టగానే తానెంతటి అదృష్టవంతురాలినో కదా అని అను కుంది సునంద. ఆ ఇంట్లో అన్నీ శ్రద్ధగా అమర్చిపెట్టాడు సోమయాజులు. "పని మనిషిని మాత్రం నువ్వే సెలెక్ట్ చేయాలి సుమా. పని చేయించుకునేది నువ్వే కదా" అన్నాడు సునందతో. తనకి గౌరవం ఇచ్చేవాడే ఈ మనిషి. ఫరవాలేదు" అని మరింత ధైర్యం తెచ్చుకుంది సునంద. కొద్ది రోజుల్లోనే 'వాళ్ళిద్దరిదీ అన్యోన్య దాంపత్యం. ఎన్నడూ గొడవలు పడినట్టు ఎరగం సుమా' అని తోటి అపార్టుమెంటు వాసులందరూ ఏకాభిప్రాయానికి వచ్చేశారు కూడా.

మూడేళ్ళు గడిచాయి. ఇప్పుడు ఆ దంపతులకి ఓ ఏడాది వయస్సున్న మగబిడ్డ. ఆ బాబుని వారిద్దరూ అపురూపంగా పెంచుకుంటున్నారు. మరో బుద్ధిమంతుడిని సమాజానికి అందించేందుకు వీలుగా బుద్ధులు మప్పుతున్నారు కూడా.

♦ ♦ ♦

ఇంతలో వచ్చి పడింది కరోనా కష్టం. కరోనా అంటే ఏమిటో, ఏ జాగ్రత్తలు తీసుకోవాలో అన్నీ బుద్ధిగా టీవీలో, ఇంటర్నెట్‌లో చూసి దంపతులిద్దరూ నేర్చుకున్నారు. కరోనా వాళ్ళ అపార్టుమెంటు దరిదాపులకు రాకుండా కాపు కాసుకున్నారు. దానికి తోడు సోమయాజులు ఇప్పుడు వర్క్ ఫ్రం హోంలో ఉన్నాడు. ఇంకేం? ఇరవై నాలుగ్గంటలూ భర్త, బిడ్డ సమక్షంలోనే గడపగలగడం ఎంత అదృష్టం? అంత కరోనా కాలంలోనూ సునంద 'ఆడది కోరుకునే వరాలూ రెండే రెండూ ...' అంటూ మనస్ఫూర్తిగా పాడుకోగలిగింది. ఆ వరాలు తనకు దక్కినందుకు ఆ భగవంతుడికి మనసులో వేల నమస్కారాలు చేసుకుంది.

కరోనా ఉధృతి తగ్గింది. కాని సోమయాజులు వర్క్ ఫ్రం హోం కొనసాగుతూనే వుంది. ఇదేదో బాగానే వుంది అని అనుకున్నారందరూ.

♦ ♦ ♦

ఓ రోజు సోమయాజులు 'మనం ఓ కొత్త ఫ్లాట్ సొంతంగా కొనుక్కోబోతున్నాం' అని ప్రకటించేడు. ఇప్పుడుంటున్న ఇంటికన్నా పెద్దది అవసరం అని తన అభిప్రాయం తెలియ జేసేడు. ఇంటికొచ్చే, పోయే వాళ్ళు (అంటే బంధువులే సుమా) సౌకర్యంగా ఫీల్ అవాలన్నా, వర్క్ ఫ్రం హోం నిరాటంకంగా సాగిపోవాలన్నా (ఆ సౌకర్యం ఉండడమే గొప్ప విషయం కదా) కనీసం త్రీ బిహెచ్‌కె ఫ్లాట్ ఉండాల్సిందేనన్నాడు. కారు పార్కింగ్ సౌకర్యం తప్పనిసరి. (మరి వాళ్ళకి ఇప్పుడు కారు ఉంది కదా) దగ్గర్లోనే మార్కెట్టూ, పిల్లవాడి నర్సరీ స్కూలూ కూడా ఉండాలి. అప్పుడు సునంద 'దగ్గర్లో మెటర్నిటీ హోం కూడా ఉంటే బాగుంటుంది' అని కనీ కనిపించని చిరునవ్వుతో తన సవరణను జోడించింది. వెంటనే సోమయాజులు భార్య భావాన్ని గ్రహించినవాడై (మరి అన్యోన్య దాంపత్యం కదా) 'ఏమిటీ! నిజమా! ఎప్పుడు?' అనడిగాడు, సంతోషాన్ని ప్రకటిస్తూ.

"ఈ రోజే వీధి చివరి లేడీ డాక్టర్ కన్ఫర్మ్ చేసేరు" అంది సునంద. "ఈసారి నాకు ఆడపిల్ల కావాలి" అన్నాడు సోమ యాజులు. అలాగే అంది ఆమె.

ఓ నెల్లాళ్ళ వేట తర్వాత ఓ గేటెడ్ కమ్యూనిటీలో అపార్టు మెంట్‌ని ఖాయం చేసేశారు. బ్యాంక్ లోన్ సౌకర్యం కూడా ఉంది. ఆ పైన అవసరానికి దాచుకున్న సొమ్ము ఉండనే వుంది. కొత్త ఫ్లాట్‌లో ఎక్కడ ఏ విధంగా కప్‌బోర్డులు వగైరా ఉండాలో వివరంగా చర్చించుకున్నారిద్దరూ.

"అంతా కలిపి 1.75 సి అయింది' అన్నాడు సోమ యాజులు. "అవుతుంది మరి" అన్నారందరూ. కొత్త సొంత ఫ్లాట్ చాలా బాగుందన్నారు కూడా.

"మరి ఇఎంఐ ముప్ఫై ఏళ్ల పాటు ప్రతి నెలా 80 వేలు కట్టాలి" అన్నాడు సోమయాజులు సునందతో.

"జాగ్రత్తగా ఇల్లు నడుపుకుని సర్దుకుందాం." అంది తను.

కొత్త ఇంట్లో సోమయాజులుకి వర్క్ ఫ్రం హోం చాలా సౌకర్యంగా ఉంది. ఆ రూమ్‌కి ఏసి పెట్టించేడు. బైట శబ్దాలు వినిపించవు. ఏకాగ్రతతో పని చేసుకోవచ్చు. సమయానికి కాఫీ, టిఫిన్, స్నాక్స్ అన్నీ అమర్చడానికి సునంద ఎటూ సిద్ధంగానే ఉంది కదా.

"పని మనిషిని మానిపించేస్తే నెలకి ఆరు వేలు తగ్గుతాయి కదా " అంది సునంద. " "మరి అసలే ఉట్టి మనిషివి కూడా కావు కదా? ఇంటి పనులెలా?" అన్నట్టు చూసేడు సోమ యాజులు. చెల్లి అవసరాలు కనిపెట్టుకునే అన్న తనకి ఉ న్నందున సునంద ఇంటికి ఆ నెలలోనే డిష్ వాషర్, బట్టలు ఇస్త్రీ చేసుకునే టేబుల్, వాషింగ్ మెషిన్ వచ్చేశాయి. సోమయాజులు తన బాధ్యత కూడా ఉంది సుమా అన్నట్టు వాక్యూం క్లీనర్ కూడా తెచ్చేశాడు. మరోసారి 'ఆడది కోరుకునే వరాలూ...' పాడుకుంది సునంద.

♦ ♦ ♦

ఇదంతా జరిగిన నాలుగు నెలలకే సునంద ప్రసవించింది. సుఖ ప్రసవం. ఈ సారి పురిటికి పుట్టింటికి వెళ్ళలేదు. తల్లినే తనవద్దకు రప్పించుకుంది. ఆవిడ దగ్గరుండి అన్నీ చూసుకోవడంతో ఏ ఇబ్బందీ లేకుండా గడిచిపోయింది. పుట్టిన ఆడపిల్లకి మూడో నెల వచ్చాక తల్లి వెళ్ళిపోయింది. "ఏం

ఫర్వాలేదు అత్తగారూ! నేను వర్క్ ఫ్రం హోంలోనే కదా ఉ న్నాను. అన్నీ చూసుకుంటాను" అని సోమయాజులు ఇచ్చిన హామీని భద్రంగా మూటగట్టుకుని ఆ తల్లి ప్రయాణం కట్టింది.

ఆ తర్వాత వాతావరణ మార్పులు క్రమంగా చోటు చేసకోవడం మొదలైంది. వర్క్ ఫ్రం హోం వేళల నిడివి పెరిగింది. ఇంటిదగ్గరనుంచి పని అంటే ఏ వేళలో కంపెనీ నుండి కాల్ వచ్చినా, కస్టమర్ నుండి ఎంక్వైరీ వచ్చినా అటెండ్ అవాల్సిందే అన్నారు యజమానులు. దానిదేముంది? పని దగ్గర నేను ఎప్పుడూ వెనక్కి తగ్గేది లేదు కదా అనుకున్నాడు సోమయాజులు. ఇటువంటి సమయంలోనే తన అంకిత భావాన్ని కంపెనీకి తెలిసేలా చేసి మంచిమార్కులతోబాటు కుదిరితే ప్రమోషన్ కూడా కొట్టేయొచ్చు అనుకున్నాడు.

"ఏవండీ! చంటిదానికి పాల డబ్బా అయిపోయింది. కిందకెళ్ళి తెస్తాను. దాన్ని చంకలో వేసుకెళ్తాను కాని, వీడిని మాత్రం ఓ ఐదు నిముషాలు మీరు కనిపెట్టుకుని వుండండి" అని అప్పజెప్పింది సునంద. అలాగేనన్నాడు సోమయాజులు. "ఈ మారు కాస్తంత ముందే చెప్తే ఆన్ లైన్ బుక్ చేసేద్దాం" అన్నాడు. సునంద పాలడబ్బా తీసుకొచ్చేసరికి ఇంట్లో సీన్ మారిపోయింది. పిల్లాడు వంటగదిలో పోపుల డబ్బాని తిరగేసేశాడు. వంటిల్లంతా ఆవాలు, మెంతులు, మినపప్పు ఎక్స్ట్రా చెదిరిపోయివున్నాయి. "కస్టమర్ నుండి కాల్ వస్తేనూ అటెండ్ చేస్తున్నాను, ఈ లోపే..." అని సోమయాజులు సంజాయిషీ ఇచ్చేడు. "ఫర్వాలేదు లెండి" అని సునంద చంటిదానిని మంచంమీద పడుక్కోబెట్టి, పాలు కలిపి పట్టించింది. సోమయాజులు వాక్యూమ్ క్లీనర్‌తో వంటగదిని క్లీన్ చేయడం మొదలెట్టాడు. అది తన చేతికిచ్చేయ్యమని పిల్లవాడు ఏడవడం ప్రారంభించేడు. 'ఇదిగో ! వీడిని కాస్సేపు పట్టుకో' అని భార్యను ఆదేశించి తన పనిలో పడ్డాడు సోమ యాజులు. చంటిదానికి పడుతున్న పాల సీసాను పక్కనపెట్టి సునంద బైటకొచ్చింది. ఇటు పిల్లవాడు, అటు చంటిది – ఇద్దరూ ఏడుపులు లంకించుకున్నారు. ఈ లోపు సోమయా జులుకి కస్టమర్ నుంచి మరో కాల్. ఆ వంటిల్లుని అలానే వదిలేసి గదిలోకి పరిగెత్తాడు సోమయాజులు. సునందకి ఒక్కసారి చుక్కలు కనిపించాయి.

రెండు రోజుల తర్వాత "సునందా! మన డిష్ వాషర్ సరిగా పని చేయడం లేదా ?" అంటూ వచ్చేడు సోమయాజులు వంటగదిలోకి. అప్పటికి చంక దిగని చంటిదానితో వంట పనిలో ఉంది సునంద. "బాగానే పని చేస్తోందే" అన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది సునంద భర్త వైపు. "మరేం లేదు, ఈ కాఫీ కప్పుకి మరకలు వొదలట్లేదు. అందుకని.. ఫరవాలేదులే' అనేసి మళ్ళీ గదిలోకి పోయేడు సోమయాజులు.

ఇంకో నాలుగు రోజుల తర్వాత "మన వాషింగ్ మెషిన్ అంత ఎఫిషియంట్ కాదనుకుంటాను. షర్ట్ కాలర్ మరకలు సరిగ్గా వొదలడం లేదు" అని, "వాక్యూమ్ క్లీనర్‌తో నేలమీద మూలల్లో దుమ్ము అంతా క్లీన్ అవడం కష్టం" అని ఇంకోసారి ... ఇటువంటి వ్యాఖ్యానాలు మొదలయ్యాయి.

పక్క ఫ్లాట్‌లోంచి 'ఆడది కోరుకునే వరాలూ..' పాట వినిపించింది సునందకి. లోలోపల ఎక్కడో తెలియని కోపం పుట్టుకొచ్చింది. అయినప్పటికీ బుద్ధిమంతురాలు గనుక తమా యించుకుంది.

◆ ◆ ◆

కంపెనీ మార్కెట్ బాగులేదని చెప్పి ఆ ఏడాది ఇన్సెంటివ్ నిలుపు చేసింది. మీడియా వార్తలు చూస్తూంటే, పెద్ద పెద్ద కంపెనీలు సైతం ఉద్యోగులని తగ్గిస్తున్నట్టు వస్తున్న సమాచారం ఒక్కొక్కటిగా తెలుస్తూవుంటే ఆ దంపతులిద్దరికీ కళ్ళముందు కొత్త ప్రపంచం కనిపిస్తోంది. మునుపటి ఆనందం, ఉత్సాహం స్థానంలో తెలియని ఆందోళన, భయం చోటు చేసుకున్నాయి. ఈ పిల్లల్ని ఎలా పెంచి పెద్ద చేయాలి? హౌసింగ్ లోన్ వాయిదాలు ఎలా కట్టాలి? – ఈ ప్రశ్నలు తెల్లవారిన దగ్గరనుంచీ వేధిస్తున్నాయి. సోమయాజులు ఆందోళన మరింత ఎక్కువైపోయింది. బీపీ, షుగర్ ఉ న్నాయేమోనన్న సందేహం వచ్చింది. దానికి తోడు నడుం నొప్పి కూడా తోడైంది. గతంలో ఉన్నంత ఓపికగా లేదు. సునందకైతే ఇంటి చాకిరీ, పిల్లలిద్దరినీ సాకడం, వాటికి తోడు వర్క్ ఫ్రం హోం భర్తకి వేళకి అమర్చిపెట్టడం, భరించ లేనంతగా భారం అయిపోతోంది.

ఇంట్లో వాతావరణం ఇంతగా మారిపోయిందేమిటి? ఎక్కడుంది లోపం? సర్దుకుపోయి బతకడం అనేదానికి ఓ పరిమితి అంటూ ఉంటుందా? లేదా? ... ఇలాంటి ప్రశ్నలు వాళ్ళిద్దరిలో పుట్టుకొస్తున్నాయి.

◆ ◆ ◆

ఉన్నట్టుండి ఓ రోజు సునందకి ఓ రోజున బుర్రలో ఏదో ఫ్లాష్ వెలిగినట్టు అయింది. "ఏవండీ! మనం ఇంతకు ముందు రెండు గదుల ఇంట్లో ఉన్నప్పుడు ఆ ఇల్లు మనకి సరిపోయింది కదా? ఈ త్రీబిహెచ్‌కె కి ఎందుకు మారేం? ఎందుకు అంత అప్పు చేసేం? ఎందుకు పనిమనిషిని మానిపించీసేం?" అని సోమయాజుల్ని అడిగింది.

"అదేంటోయ్? అన్నింటికీ సౌకర్యంగా ఉంటుందనే కదా ఇదంతా ..." అని అతగాడు అనబోతూంటే సునంద ఆపింది.

. "ఎవరికి సౌకర్యంగా ఉంటుందని? మరి నాకైతే సౌకర్యంగా

లేదు, మీకైనా ఉందా?" అని రెట్టించింది.

"ఆఫీసుకి పోతేనే బెటర్ అనిపిస్తోంది నాకు" అన్నాడు సోమయాజులు.

"అదే నేనూ అనేది. మీకూ గాక, నాకూ గాక ఇంత ఖర్చు మనం చేసింది మీ కంపెనీవాళ్ళకి సౌకర్యంగా ఉండడం కోసమే కదా? అప్పులూ, చాకిరీ మనకి మిగిలింది. కంపెనీకి ఆఫీసుని నడిపే ఖర్చు బాగా మిగిలింది. పైగా ఇరవై నాలుగ్గంటలూ చాకిరీ చేయించుకుంటున్నారు." అంది సునంద.

కాస్సేపు మౌనంగా ఉండిపోయిన సోమయాజులు "నిజమే ననుకో. కానీ ఈ ఇల్లు మనకి మిగులుతుంది కదా? అది మన ఆస్తే కదా?" అని సర్ది చెప్పబోయాడు.

భర్త కళ్ళలోకి సూటిగా చూసి సునంద "ఈ ఇల్లు మనకి గ్యారంటీగా మిగులుతుందా? దానిమీద అప్పు అంతా తీరిపోయేవరకూ మీ ఉద్యోగం గ్యారంటీగా ఉంటుందా? అంతా సవ్యంగా జరిగి ముప్ఫయ్ ఏళ్ళ తర్వాత పూర్తిగా ఇల్లు మన సొంతం అయిపోయిందే అనుకుందాం. అప్పటికి దాని జీవితకాలమూ అయిపోతుంది. మళ్ళీ కట్టాలి కదా? అప్పుడెలా?" అనడిగింది.

కొంతసేపటి మౌనం తర్వాత మళ్ళీ "మా నాన్న, మీ నాన్న వాళ్ళ ఆఫీసువాళ్ళు కట్టించిన క్వార్టర్లలో గడిపేశారు. మా చదువులు ఎయిడెడ్ కాలేజీలో అయిపోయాయి. వైద్యానికి గవర్నమెంట్ హెల్త్ స్కీం ఉండేది. మరి మనకో? మన ఇల్లూ మనమే కొనుక్కోవాలి. పిల్లల చదువులూ కొనుక్కోవాలి, వైద్యం సంగతీ సరేసరి! రిటైరయ్యాక సవ్యంగా బతుకు గడవాలంటే ఇప్పటినుంచీ పెన్షన్ కూడా మనమే కొనుక్కోవాలి. మా నాన్న ఎప్పుడు రిటైర్ అవుతానా అన్నట్లు ఎదురు చూసేవాడు. మరి మనమో? ఎప్పుడు ఉద్యోగంలోంచి సాగనంపుతారో తెలియక నిద్ర పట్టని రాత్రుళ్ళు గడుపుతున్నాం." అంది.

సోమయాజులు కరెక్టేనని ఒప్పుకున్నాడు.

రాత్రి నిద్ర పట్టక పక్క మీద అటూ ఇటూ దొర్లుతున్న సోమయాజుల్ని తట్టి లేపి అడిగింది సునంద : "ఏమండీ. మా నాన్న వాళ్ళకి ఓ యూనియన్ ఉండేది. ఏదొచ్చినా మా యూనియన్ చూసుకుంటుందిలే అని అంటూండేవారు. మరి మీకు ఏ యూనియనూ లేదెందుకు?"

సునంద ప్రశ్నలో ఓ సమాధానం కనిపించింది సోమయాజులుకి. ఆ సమాధానాన్ని ఆచరణలో పెట్టే ధైర్యం తనకి ఉందా అన్న కొత్త ప్రశ్న ఇంతలోనే తలెత్తింది.

'ఆడది కోరుకునే వరాలూ..' పాట ఇప్పుడెందుకో సునందకి అంతగా గుర్తుకి రావడం లేదు. ■



## వర్ణాలు లేని వాక్యాలు

రైతు నాగలి ఒక వాక్యమే
సైనికుని తుపాకీ ఒక వాక్యమే
పారిశుధ్య కార్మికుని
చీపురు ఒక వాక్యమే
చెప్పులు కుట్టే తాత
చేతి ఆరె ఒక వాక్యమే
శ్రామికుని చెమట చుక్క
ఒక వాక్యమే
బిచ్చగాడి ఆకలి సత్తుపళ్ళెం
ఒక వాక్యమే
వెలయాలి రంపపుకోత బాధ
ఒక వాక్యమే
వెలివాడల గుడిసెలపై ఎగిరే
నీలి హరివిల్లు జెండా ఒక వాక్యమే
బడుగుజీవుల
బతుకు యాతన ఒక వాక్యమే

అమ్మ పాచిన చేతులు
శ్రమపూలు పూచిన వాక్యాలై
నాన్న మట్టి పాదాలు
నా కవితా పాదాలై
వర్ణాలు లేని
వాక్యాల సౌందర్యమే కవిత్వం!

**- సరికొండ నరసింహ రాజు**
**93982 54545**



## కొంత వెలుగు .. కొన్ని చినుకులు

అతను యుద్ధానికేం వెళ్ళలేదు
కొన్ని కలల్ని కన్నాడు
సకల సౌకర్యాలతో ఇల్లు కట్టాలనుకున్నాడు

బ్యాంకు ఖాతా బరువుగా ఉండాలని
రెండు ఫ్లాట్లు వెనకేయ్యాలని బాగా కోరిక

అతని పిల్లల దగ్గర అతను లేడు
వాళ్ళు ఎదిగే క్షణాల్ని కోల్పోయాడు
కొమ్మకు అంటిపెట్టుకున్న పువ్వుల్లా
వాళ్ళిప్పుడు నాన్న గుండెకు ఆని
కొన్ని కథల్ని వినాలనుకుంటున్నారు
అలా వేలు పెట్టుకుని, వీధి వెంట
గర్వంగా నాలుగడుగులు వేయాలనుకుంటున్నారు

వాళ్ళ కోసం ఆన్లైన్‌లో బోలెడు ఆట వస్తువులు పంపాడు
ఎక్కి నడుపుతున్న బాటరీ కారు హఠాత్తుగా ఆగినప్పుడు
వెనుక నుండి ముందుకు నెట్టే నాన్న చేతుల్లేని దిగులు
వాళ్ళని కుంగ దీస్తోంది
వీడియో కాల్‌లో నాన్నకు ముద్దుపెట్టినా
అది స్క్రీన్ దాటిపోదని తెలిశాక

ఆ పసిపెదవులు రెండు
నెర్రెలిచ్చిన నేలను తలపిస్తున్నాయ్!
అన్ని హంగులతో, ఇల్లు కట్టించినా
నాన్న లేని ఇల్లు
చీకటి నిండిన
పురాతన కట్టడంలా ఉంది!
ఏ మొక్కా మొలవని బీడులా ఉంది

నాన్నా నాన్నా
నువ్వు నీడలా వెంట ఉంటే చాలు
మా భుజం మీద నీ చెయ్యి ఉంటే చాలు
నీ కంట్లో నుండి ప్రేమ
చినుకులు చినుకులుగా
మా గుండెల్లోకి కురిస్తే చాలు అంటూ
పిల్లలిద్దరూ చేసే ప్రార్థన
చుట్టూ మార్మోగుతుంది!

- డాక్టర్ సుంకర గోపాలయ్య
94926 38547

## దుబై

దుబై పోతుండు
కడుపు నిండా పిల్లలు గలోడు
దుబై పోతుండు
ఇష్టముంది లేంది వేరే ముచ్చట
సత్తువ వుంది లేంది కూడా మరో సంగతి!
కానీ దుబై పోతుండు దుబై
బొంబై పోయి దుబై
తల్లి తల్లడిల్లుతున్నా
భార్య భారీగా ఏడుస్తున్నా
పువ్వుల్లాంటి పిల్లలు మొహాలు వాడ్చినా
గుదిబండగా మారే కన్నా
గుండుసున్నగా మిగిలే కన్నా
కూటికి భరోసాయై
గూటికి ఆదెరువై
ఆగని పయనం ఆరని జ్వలనం!

- కోట చంద్రశేఖర్
94920 43348






# ఎప్పటికీ నిలబడే 'ఇక ఇప్పుడు'

- శృంగవరపు రచన

87907 39123

**క**విత్వంలో కవి పుడతాడా? కవి నుంచి కవిత్వం జన్మిస్తుందా? ఆలోచనల విస్ఫోటనం ఆలోచించే మెదడును అతలాకుతలం చేస్తుంటే కవిత్వమనే స్థితి మనిషిలో కవి జన్మించేలా చేస్తుంది అనుకుంటా. అలా ఉండిపోవడం, తన అక్షరాల్లో తన భావోద్వేగాలను ఒంపుకుంటూ, కవి జన్మను నింపుకోవడం ఎంత కష్టమో వివిధ భావ భారాన్ని కవిగా కవిత్వపు వాడిలో నింపే ఆ మొదటి మనిషిలోని రెండో మనిషిగా మారిన కవికే తెలుసేమో! భావానికి, ఘటనకు స్పందన కవిత్వం కాదు! కానీ ఆ భావానికి, ఘటనకు ఉన్న పరిణామ, నాగరిక, చరిత్ర దశలను గమనిస్తూ, ఈ భావం–ఘటన రూపొందిన క్రమాన్ని అర్థం చేసుకున్న లోతులతో స్పందనను సమన్వయం చేసేదే కవిత్వం కావచ్చు! కటుకోఝ్వల ఆనందాచారి గారి 'ఇక ఇప్పుడు...' కవిత్వంలో ఆ లోతుగా స్పందించే తీరు ఉంది. భావోద్వేగాలకు సరిపోయే పదాల కూర్పు ఉంది. బాధను, దుఃఖాన్ని, నిరీక్షణను, అసహనాన్ని, ఆవేశాన్ని, శూన్యతను, ప్రతిఘటనను స్పష్టం చేయగల భావ స్పష్టతను దృఢం చేసే సందర్భ సమన్వయం, భాషపై పట్టు ఉన్నాయి. భాషా సౌందర్యం కవిత్వానికి అవసరం లేదన్న వాదన ఉన్నా, 'నినదిస్తున్న మరణం' కవితలో ఆ సౌందర్యంలో ఆవేదనా భరితంగా మారే క్రమంలో కవిత్వంలో ఎక్కడ ఆ సౌందర్యం భావ ప్రకంపనను సృష్టించగలదో నిర్ణయించుకునే స్వేచ్ఛ కవిదే అనే భావన కలుగుతుంది. ఈ కవిత్వంలో భావుకత్వం ఉన్నది, కొన్నిచోట్ల మనసు దేని కోసమో నిరీక్షిస్తూ, అలాగే వేచి చూడటమూ ఉంది. సామాజికంగా తలెత్తే హింస పట్ల నిరసన ఉంది. ఏం చేయకుండా ఉండిపోవొద్దు, ఏదో ఒక ఆసక్తిని పెంచే తీరు గురించి ఆలోచించుకో, నిర్లిప్తత కన్నా ఏదో ఒక మత్తు జీవితాన్ని ఆవరించి ఉండాలన్న విషయాన్ని శూన్యత ఆవరించిన మనిషి ఆలోచనలను స్పష్టం చేస్తూ చెప్పడమూ ఉంది. మనిషి లోపలి మనిషికి ఉండే అవలక్షణాలను గుర్తించడం, వాటిని ఒప్పుకునే ధైర్యం కూడా పెంపొందించు కోవాలని చెప్పడమూ ఉంది. ప్రేమ కోసం వేచి చూసే ప్రేమికుడి మనసు కూడా ఉంది. కవిత్వ స్థితిలో కవి ఉద్వేగం ఎంత గొప్ప భావప్రకటనగా మారుతుంది అన్నదే కవిత్వ ప్రమాణం అయితే ఆనందాచారి తప్పకుండా గొప్ప కవే! మనసులో భారమయ్యే అలజడులను అక్షరాలుగా మార్చడంలో తాను పొందే అనుభూతి గురించి కూడా ఈ కవిత్వంలోని కొన్ని కవితల్లో స్పష్టం చేశారు.

కవిత్వంలో తనలో కవి ఉండే స్థితిని గురించి రాసిన కవితలు 'దొరకని వాక్యం', 'నడచి వెళ్ళేటప్పుడు', 'నేను నీ తావిని', 'కవనం', 'ఒక ఆనంద దృశ్యం', 'పదగ్రస్తం.' ఎన్నో ఆలోచనలు సంఘర్షిస్తూ ఉండగానే, ఆ విస్ఫోటంలో భావాలు ఎన్నో అక్షరాలుగా రూపొందుతున్నా, ఆ ఆలోచనలకు ఓ ముగింపు రాక ముందే, ఏది ముగింపో తెలుసుకోలేనితనం కవిలో జ్వలిస్తూ, మనసును చీలుస్తూ, దానిని కనుక్కోమని ప్రేరేపిస్తుంటే, అనేక అనుభవాల మిశ్రమంలో పడి కొట్టుకు పోతూ అందకుండా ఉండే 'భావగర్భిత భావోద్వేగాన్ని' పట్టుకోలేనితనాన్ని గురించి హృద్యంగా చెప్పే కవితే 'దొరకని వాక్యం.' 'కవిత్వం ఓ వృత్తి కాదు, మానసిక స్థితి' అంటాడు రాబర్ట్ గ్రేవ్స్. ఆ దశలో ఉండటం ఎంత కష్టమో స్పష్టం చేసే కవిత ఇది.

'వాక్యం మిగిలిపోయేవుంది/ ఎక్కడో అరల్లో లోపల
నేనో వాక్యం అందించాల్సి ఉంది
పోగొట్టుకున్నది కాదు / పట్టుకోలేకపోయింది
తరలిపోయింది కాదు తడారిపోనిది

ఒక వాక్యం మిగిలిపోయే ఉంది' అంటారు ఈ కవితలో. ఆలోచనకు అందని వాక్యం కాదని, తన ఆలోచనల ఆవరణ లోనే ఉన్నా తనకు అందని వాక్యం అని, కవి తన ఆలోచనా మథనంలో కొన్నిసార్లు ఉద్భవించే అసంతృప్తిని ఈ కవిత ద్వారా ప్రకటితం చేశారు.

'నా అంతరంగ వాకిళ్ళలోకి
భావాల బండ్లపై పయనించటమే
కవిత్వమైనా జీవన సాఫల్యమైనా' అంటారు 'నేను నీ తావిని' కవితలో.

'నడకకు నడతకూ మధ్య ఖాళీలేమయినా
కనబడినప్పుడు ఇంత కవిత్వాన్ని నిలబెట్టి పో ..' అంటారు 'నడచి వెళ్ళేటప్పుడు' లో.

'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అంటాడు మార్క్స్. అది పరోక్షంగా గుర్తింపబడని అంశంగా ఉన్నంతకాలం ఏదో ఉన్నత జీవిత ప్రమాణాలతో బతుకుతున్నామన్న భ్రమ ఉండేది. డబ్బుకు విలువ ఉందని తెలుసుకోవడం సత్యాన్ని గుర్తించడమే. కానీ డబ్బు కన్నా దేనికి విలువ లేని జీవన విధానాన్ని బలపరచడానికి వచ్చిన అనేక పరిణామాల గురించి స్పష్టం చేసే కవితే 'అర్థ విపరిణామం.'

'మనిషంటే ఇపుడు / మహాయోధుడిలా నిలబడటం కాదు
మహా వినియోగదారుడిలా రూపెత్తటం!
మానవీయ సుగంధాలు పరిమళించటం కాదు
'మనీ'లోకి మౌనంగా ప్రవహించడం' అంటారు ఈ కవితలో కవి. కవిత్వం కవిని ఎలా కదిలిస్తుందో, ఏ దుఃఖ భారాన్ని, ఏ ఆశయ శక్తిని మోస్తుందో కూడా కవికే తెలుసు. తన కవిత్వంలో ఉన్న సౌందర్యం, దుఃఖం, ఆక్రోశం, ఆశయాల స్పృహ గురించి రాసిన కవితే 'కవనం.' ఎంత కవిత్వంలో తనను తాను కలబోసుకున్నా, ఇంకా వెలితి ఉందని కూడా అంటారు.

మనిషి మరణించి జ్ఞాపకంగా మారిపోయినప్పుడే మనం గుర్తిస్తామని, అందుకు ఉదాహరణగా తన ఇంటి ముందు ఉండే బూబమ్మ మరణించిన సందర్భంలో రాసిన కవితే 'బూబమ్మ.'

'మనిషి పోయింతర్వాతనే కదా
వాళ్ళను నిజంగా చూస్తాం మనం
మాట ఆగిపోయింతర్వాతనే మాట్లాడతాం మనం
మన అవసరాల రీత్యానే / సంభాషిస్తాం ఎవ్వరితోనయినా
కులమో మతమో, ఆడోమగో
లేమితనమో కలిమిబలమో/ రంగూ రంగం ఏదో ఒకటి
మన చూపు కొలతను నిర్ధారిస్తూనే ఉంటుంది!' అంటారు ఈ కవితలో. మరణం మనలో బతికున్నప్పుడు చేయలేనితనం పట్ల గిల్టీ ఫీలింగ్ ను కలుగజేస్తుంది. అందుకే మరణానికి ప్రాధాన్యత ఉంది.

సామాజిక స్పృహ గురించి అనేక కవితలు కూడా ఉన్నాయి. 'స్వాత్ నగరం' కవితా శీర్షిక కూడా ఆకర్షణీయమైనది. మలాలా పుట్టిన ప్రాంతపు పేరే ఈ శీర్షిక. అక్షరం కలిగించిన ధైర్యం, మలాల ఆ అక్షర శక్తితో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వైనాన్ని స్పష్టం చేస్తుంది ఈ కవిత. మూడోసారి ఆడపిల్లపుట్ట బోతుందని స్కానింగ్ ద్వారా తెలుసుకున్న భర్త భార్యను కొట్టి చంపిన ఘటనకు స్పందించి రాసిన కవితే 'లీవింగ్ నోట్.'

'నినదిస్తున్న మరణం'లో రోహిత్ మరణం సృష్టించిన ప్రకంపనాలను అక్షర ఫిరంగులుగా మార్చి రాశారు. సమాజాన్ని మండించిన విధానాన్ని ఈ కవితలో మనం చూడవచ్చు. 'నామవాచకం' పేరుకు మాత్రమే ప్రత్యేకతను ఆపాదిస్తుంది. నామవాచకంగా మిగలకుండా 'క్రియా పదం'గా మారి, క్రియా విశేషి, శబ్దాలంకారిగా రోహిత్ మరణ మంటతో శుద్ధ బుద్ధుడయ్యాడని రాయడం కవికున్న పదప్రజ్ఞను స్పష్టం చేస్తుంది. 'అంటని లోకంపై మంటలు లేచి' అని రాయడం కవిత్వం సామాజిక స్పృహను ఎలా రగిలించగలదో స్పష్టం చేస్తుంది. 'గతం కాదు అతని మరణం/ వర్తమాన రణం' అని రాయడం కవికున్న శబ్ద సౌందర్యాన్ని కాకే ఆ సౌందర్యానికి స్పృహను కల్పించడం పట్ల ఉన్న శ్రద్ధను కూడా స్పష్టం చేస్తుంది.

అసిఫా అత్యాచార ఘటనకు స్పందించి రాసిన కవిత 'అనివార్యం.' గుడులు ఎందుకు కట్టబడ్డాయో కానీ ఆ గుడే మనిషి దేవుడిని దర్శించేలా చేయలేక, మనిషి తనలో మృగాన్ని మేలుకునేందుకు సాక్షి అయితే అటువంటి గుడి అక్కర్లేదని, దేవుని ప్రార్ధనలు కట్టడాల్లో అవసరం లేదని, ఆ కట్టడం పాపానికి, అత్యాచారానికి రక్షణ అయితే ఆ ప్రదేశానికి పవిత్రత ఉందనుకోవడంలో అర్థం లేదని ఈ కవితలో అంటారు.

దళితుడు గుర్రమెక్కినందుకు కొట్టి చంపిన ఘటనపై స్పందించి రాసిన కవితే 'ఎవడ్రా...నువ్వు!'. 2017 లో గుజరాత్ లో ఒక దళిత యువకుడుపై మీసాలు ఉన్నాయన్న నెపంతో దాడి జరిగింది. ఈ మధ్యే ఆగస్ట్ 2022 లో తొమ్మిదేళ్ల బాలుడు కుండలో నీరు తాగినందుకు ఉపాధ్యాయుడు తీవ్రంగా కొట్టడంతో 23 రోజుల తర్వాత చికిత్స పొందుతూనే మరణించాడు. ఇది రాజస్థాన్‌లో జరిగింది. ఈ నేపథ్యంలో ఇటువంటి ఘటనలపై ప్రతిస్పందన అనివార్యం.

త్రిపురలో లెనిన్ విగ్రహం పడగొట్టిన ఘటనకు స్పందించి రాసిన కవితే 'వాడంతే!' ప్రేమించలేదని సంధ్య అనే అమ్మాయిని పెట్రోల్ పోసి నిప్పంటించి చంపిన సంఘటనకు స్పందించి రాసిన కవితే 'పిచ్చి కుక్కలున్నాయి జాగ్రత్త.'

'నేను రాలుస్తున్న అక్షరాల సిరా పెట్రోలు వాసనేస్తుంది
వాణ్ణిలా మృగాణ్ణి చేసిన వాడి ముఖం మీదే
ఇంత పెట్రోలైన అక్షరాల్ని పోసిపోతా
నేనే అగ్గిపుల్లనయి కాలిపోతా' అంటారు ఈ కవితలో. అక్షరాలు అగ్నిగా మారే కాలం వస్తే బావుండు అనిపిస్తుంది ఇది చదువుతుంటే! నాలుగు మామిడి కాయలు తెంపాడని కొట్టి చంపిన ఘటనకు స్పందించి రాసిన కవితే 'నాలుక్కాయల ప్రాణం'. ఉద్యోగం రాలేదని ఆత్మహత్య చేసుకున్న ఘటనకు స్పందనే 'పోటీ' కవిత. మీడియా దేనిని అయినా నమ్మింపజేసే సాధనం అని, సత్యాలే అందులో ఉంటాయని అనుకోవడం భ్రమ అని ఈ దృక్పథంతో రాసిన కవితే 'నీ పాటా నా నోట.'

అనుభూతి ప్రధానమైన కవితలు కూడా ఎన్నో ఉన్నాయి. మట్టి తన మనసులో కలిగించే భావాలను, తనలో మట్టి వల్ల మొలకెత్తే కొత్త ఆశల చిగుర్లను గురించి రాసిన కవితే 'మట్టి మహత్తు.' మనసులోని ఆలోచనల ఘర్షణలో అక్కడ తలెత్తే బాధల భారం గురించి రాసిన కవితే 'గాయాల అనుభవం.'

Evolution and Civilization కాలంతో పాటు మనిషి జీవితాన్ని అనేక అంశాల్లో ప్రభావితం చేస్తున్నా, మనిషి లోపలి మనిషిని కదిలించలేకపోయాయన్న ఆవేదన 'నగ్నం' కవితలో కనిపిస్తుంది. నాగరికత మనిషిని మనిషిలా ఎదిగేలా చేయలేకపోయిందని, శారీరక నగ్నతను చూసే కళ్ళు, మానసికంగా మనిషితనాన్ని కప్పుకోలేనితనాన్ని, రాయిలా ఏ ఆచ్ఛాదన లేకుండా కఠినమైన మనసును చూసే ధైర్యం చేయలేవని వ్యంగ్యంగా క్రోధధ్వనితో రాసిన కవిత ఇది.

'పరిణామపు ఉలి నిను/ నాగరిక శిల్పంలా తోలుస్తున్నా
నీలో రాయితనం తొలిగిందెప్పుడు!
బట్టలిప్పితే పోయేదేమిటి/ తుప్పు పట్టిన మనిషితనానికి అద్దం పట్టటం తప్ప' అంటారు ఈ కవితలో. ప్రతి మనిషికి తన లోపలి తుప్పు పట్టిన మనిషి గురించి తెలుసు అని, అది బయటకు తెలిస్తే మాత్రం పోయేది ఏముందని అదే సహజంగా మారిన క్రమంలో ఆ నగ్నత్వం ప్రాధాన్యత దక్కే అంశం కాదని ఈ కవిత ద్వారా సూచించారు.

మనసు కేంద్రంగా రాసిన కవితలు ఎన్నో ఉన్నాయి. 'జీవితంపై ప్రేమను పెంచే మత్తు ఏదో కావాలి. లేకపోతే జీవితం ఖాళీ సంచిలా కొట్టుకుపోతుందని, కలల మత్తులో బతుకుతూ ఉన్నా, ఆ కలలు ఉదయానికి భగ్నమై, మనసులో గుంతలుగా మిగిలిపోతున్నాయని' అంటారు 'మత్తు' కవితలో. 'మనసు మత్తెక్కపోతే మనిషిలా బతకలేను' అంటారు ఈ కవితలో. ఏదో ఓ మత్తుతో జీవితాన్ని నింపుకోవాలని లేకపోతే జీవితం పట్ల ఆసక్తి సన్నగిల్లుతుందని ఈ కవిత స్పష్టం చేస్తుంది.

'ఇప్పుడు ఈ మనసులకొక డ్రైనేజీ నిర్మించాలి
ఈ బుద్ధులకొక శుద్ధి కేంద్రం తెరవాలి
పొగలు చిమ్మే కాలుష్యమున్నది
ఆవరణంలో కాదు మనోచలనంలో
దులపాల్సింది పైపై చెత్తనే కాదు
చిత్తడి నిండిన మన చిత్తాన్ని!' అంటారు 'డ్రైనేజీ కావాలి' కవితలో.

ఈ కవిత్వంలో సమకాలీన సమాజంలో జరుగుతున్న దురాగతాలపై ప్రతిస్పందన ఉంది. మనిషి మనిషిగా ఉండలేని పరిస్థితులు సమాజంలో నెలకొని ఉండటం పట్ల క్రోధం ఉంది. మనిషి తన ఆశలను తానే సృష్టించుకోవాలని, ఆశ లేని జీవితం మోడుబారిపోతుందని చెప్పడం ఉంది. మనసులో శూన్యత, వెలితి, బాధ, భయం వంటి ఎన్నో భావాలు తిరుగాడుతూ ఓ ఊపిరాడనితనాన్ని సృష్టిస్తుంటే మనిషి ఎలా తల్లడిల్లిపోతాడో చెప్పే క్రమం ఉంది. ప్రేమకు రూపంగా ఆమెను చిత్రిస్తూ, అక్షరాల ఆభరణాలతో అలంకరిస్తూ, భావాలతో పూజిస్తూ, పదాల పల్లకిలో ఆమె రాకకై వేచి చూడటమూ ఉంది.

Poetry is a political act because it involves telling the truth అంటారు జూన్ జోర్డాన్. Poetry comes from the highest happiness or deepest sorrow అంటారు అబ్దుల్ కలాం. You can find poetry in everyday life, your memory, in what people say on the bus, in the news, or just what is in your heart అంటారు కారోల్ అన్ డఫీ.

ఈ మూడు సత్యాలు ఈ కవిత్వంలో ఉన్నాయి. ఈ కవిత్వం ఓ రాజకీయ ప్రక్రియే! ఎందుకంటే కొన్ని నిజాలను నిర్మొహమాటంగా చెప్పడం వల్ల కవికి సమాజపు దృష్టే కాకుండా లోదృష్టి కూడా ఉంటుంది కనుక సంతోషమో దుఃఖమో కూడా కవిత్వంగా మారుతుంది. అలాగే కవిత్వ స్థితిలో జీవితంలోని సామాన్య ఘటనలు సైతం కవిత్వానికి ఊపిరి పోస్తాయి. ఈ మూడు కవిత్వ నిర్వచనాలకు నిలబడే కవిత్వం ఆనందాచారి గారిది అనడంలో సందేహం లేదు.

■

# అక్షరం కవిత్వంగా వెలిగినంతసేపూ ...



కదలకు
మనసులో కవిత్వం తొణికిసలాడి
కాగితం మీదకు ఒలుకుతుంది!
గుండెలో గూడుకట్టుకున్న దృశ్యాలన్నీ
పొరలు పొరలుగా వీడి
అక్షరనేత్రాలతో బహిరంతర లోకాల్ని దర్శిస్తుంది!
చలన స్పృహ అంటే తెలియని కళ్ళకి
జ్వలనస్పర్శను రాజేసి
కొత్త గూడు కడుతుంది!

ఎప్పుడో ఒక స్వేద బిందువుతో
మొదలైన అక్షర ప్రయాణం
అలలు అలలుగా విస్తరించి
అంతర్లోకాల నుంచి
ఆధునిక కవిత్వ పరవళ్ళను తొడుక్కొని
కొత్త బీజాలను నాటుతోంది!
చూపు దీనికి కేంద్రబిందువు!

ఆదికవి నన్నయ్య మొదలుకొని
వర్తమాన తరందాకా అనేకానేక ఆటుపోట్లు!
రాటుదేలిన భావ సంఘర్షణల రాపిళ్ళు!
కీట్స్ అంధత్వంలోని
సృజనాత్మక శక్తి పరవళ్ళలోంచి
సానెట్స్ పదాల పరవళ్ళ దాకా..
ప్లాబ్లో నెరుడా పదాల మోహరింపు నుంచి..
నల్ల జాతీయుల అస్తిత్వవేదన ప్రతిబింబం
ఏడో తరందాకా
అలెక్స్ హెలీ గొంతు వినపడుతూనే ఉంటుంది!

బూర్జువా వ్యవస్థ పుట్టుకలోంచి
పెట్టుబడీదారి సమాజం దోపిడీదాకా
మార్క్సిజం పరిచిన దారుల్లోంచి
శ్రమ నెత్తుటితో తడిసిన శ్రామిక సౌందర్యం దాకా..

వర్గ పోరాటంతో
శ్రామిక నియంతృత్వాన్ని ఆవిష్కరిస్తూ
మిగుల విలువకి పట్టంకట్టే
చరిత్ర పునరావృతమవుతోంది!
ఫ్రెంచి విప్లవం ఛాయలు నుంచి
బోల్షివిక్ రాజకీయ కదలికల దాకా
నెర్రెలిచ్చిన పగుళ్ళ నెగళ్ళు!
చేగువేరా గుండెచప్పుళ్ళ వేగంలోంచి
ఫిడేల్ కాస్ట్రో వారసత్వం దాకా
ఎన్నెన్ని మలుపులో... మరెన్ని కుదుపులో..!

ప్రపంచ శాంతికి పట్టంకట్టిన చేతులతో
విస్తరించిన సామ్రాజ్యవాదపు వేళ్ళు
పారిశ్రామిక విప్లవంతో జడలు విప్పి
ప్రపంచీకరణ విస్తరణలో
బహుళజాతి కంపెనీల లోచూపు ఆనవాళ్ళు..
బహుముఖాలుగా అనేక రూపాలుగా
నవ నాగరిక సమాజంలోంచి విచ్చుకొని
పలు సందర్భాల్లోంచి
జీవన్మరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది!

నేరం చేతులు కట్టుకొని
నలుదిశలా నడిచే చరిత్ర మనది!
ఉత్పత్తి శక్తుల రెక్కల కష్టంతో చిగురుతొడిగిన
ఆర్థిక వ్యవస్థ మూలాల బతుకు జాడ ఇది!

శ్రీశ్రీ శేషేంద్ర శివసాగర్ చెరబండరాజు శివారెడ్డి
ఎర్రబావుటాల కవితాక్షేత్రంలో
పురివిప్పి మొలకెత్తి గూడుకట్టిన జిజ్ఞాశువులు ఎన్నెన్నో!

మాట గొంతు విప్పితే
తూటాల చప్పుళ్ళతో తెల్లారే
గూడెం తండాల్లోని విధ్వంసం
అనాది ముఖచిత్రంగా కవిత్వం కళ్ళకి కడుతుంది!
ఒక్క సిరాచుక్క మరక చాలు
అదృశ్యమైపోయిన బతుకుల పీడకలల్లో
ఆరనిజ్యోతిగా అక్షరం వెలుగుతుంది!

- మానాపురం రాజా చంద్రశేఖర్
77940 39813

## ఉల్కలు

- ఈతకోట సుబ్బారావు
94405 29785

**లోగిలి వాదం ...**

మొన్నటి ముత్తాత తాతల
నిన్నటి మా కన్న తండ్రి
జ్ఞాపకాల బరువు మోసి మోసి
తన వయసు బరువు పెరగటంతో
కుప్పకూలిపోయింది పాత గోడ
గోడ ఆడదో మగదో తెలీదు కాని
గోడ మీద మగాళ్ళ ఫొటోలే
ఎందుకుంటాయని యేనాడూ అడగ లేదు!

**లోగిలి ...**

నీ మాట మీద నమ్మకం
నీ చిరునవ్వంటే యిష్టం
నీ కళ్ళలో కనిపించిన
తన పిల్లల భవిష్యత్తు
నీ గుండె గుమ్మం ముందు
అలికి ముగ్గులేసిన ప్రేమ
అన్నింటికీ మించి
నువ్వందరి మగాళ్ళ మాదిరి కాదన్న
వొక యవ్వనపు భ్రమ
ఇప్పటికీ ఆ భ్రమలోనే
నీ భార్యగా ఆమె!

**నిరీక్షణ ...**

ప్రతి రాత్రి ఆమె
గుమ్మం గూట్లో దీపాలు వెలిగించినట్టే
ఆకాశం తోటలో
చుక్కల పూలు పూయించి
చంద్రదీపం పెట్టి
వెళ్తుంది రాత్రి!

**త్రయి ...**

సాయంత్రం సంగతి తెలీదుకానీ
ప్రతి ఉదయం సూర్యుడు
సముద్రంలో స్నానం చేస్తాడు
వేదాల సంగతియేమో కానీ
వొకటో తరగతి పుస్తకంలో మాత్రం
వేమన పద్యం రాసి ఉంది.
అమ్మమ్మల వైనం చెప్పలేను కాని
మా అమ్మల కాలంలో నైతే
మేమంతా సిజెరియన్లమే !

■

## తీరిగ్గా ...!

మనం...మానవులమైనందుకు
హృదయాల్లో కన్నీటి మడుగులు
ఇంకా ఇంకి పోనందుకు తీరిగ్గా...
గతాల్ని గుర్తుకు తెచ్చుకొని
తనివి తీరా దు:ఖిద్దాం రండి... ఇలా ...
కర్రలకు వేలాడతీసిన రంగుల జండాల్లాగానో
శిక్షణ కోసం గ్రౌండుకు చేర్చిన జవాన్ల లాగానో
వరుసలుగానో వలయాలుగానో
అవసరమైన రీతిలో కూర్చొండి!

■■■

ఆ రోజుల్లో ఏ రోజు కారోజు
మనం బతికిన స్థితి నుంచి
'అదనపు' ఆర్జితాల కాపలా కోసమని
మోయడానికని దించడానికని
ప్రయాణాన్ని ఏ వైపుకు సాగించాలో
తెలియని అజ్ఞానపు భయంతో
మత కతనాలను చప్పరిస్తూ శాంతి ప్రవచనాలతో
భద్రత చాలక బలగాలను బంటులనూ
అంచెలంచెలుగా పెంచుకొన్నాం కదా!

ఆ మందల పెంపకాలకు మరింత రాబడిని
వేరెక్కడో పిండుకొన్నాం కదా!
సిబ్బందుల మొదటి కర్తవ్యం
మనం వేసే ముక్కలు మేస్తూ
'విశ్వాసం ప్రకటించడం' అనే
జ్ఞానాన్ని నాణ్యంగా నేర్పినాం కదా!

అలా రుచిమరిగిన సోమరితనం
రాబందులూ రక్త పెంజేర్లయి
మనల్ని పీల్చి పిప్పి చేసే స్థాయికి!
వాటిని పోషించడమే
ఒక జీవన విధానంగా మనం!?

పరిణామ క్రమాన్ని
ఒక్కొక్కటే గుర్తుకు తెచ్చుకొని
తీరిగ్గా దు:ఖిద్దాం రండి
అంతా అయ్యాక...
కర్మ సిద్ధాంతాలకు కట్టుబడాలో
కార్యాచరణకు పూనుకోవాలో
కొంత చర్చకు పెడదాం రండి!

- సడ్లపల్లె చిదంబర రెడ్డి
94400 73636






# జీవితమే కవిత్వమైన కలల కార్ఖానా

- డా. బద్ధిపూడి జయరావు
99490 65296

"ఒక కొత్త దేహ భాష కోసం దగ్ధమవుతున్నాను
ఆత్మ ముక్కలు ముక్కలుగా ఛిద్రమైనప్పుడు
రక్తసిక్తమైన పరిష్కారం కోసం
అదృశ్య జ్వాలనై సంచరిస్తుంటాను"

ఏటూరి నాగేంద్రరావు మనవతా వాదాన్ని ఆవిష్కరించిన సామాజిక బాధ్యత కలిగిన కవి. మనిషికి జీవితానికి మధ్య జరిగే పెనుగులాటలో ఆదర్శాలను అందించిన కవి. రచయితకి నిర్దిష్టమైన బాధ్యత, భావుకత, ఆశయం, లక్ష్యం, ప్రణాళిక అవసరం అన్నీ పుష్కలంగా ఉన్న రచయిత ఏటూరి వారు అభినందనీయుడు.

రచయిత జీవన పోరాటంలో అనుభవం నేర్పిన పాఠాలు, ఎదుర్కొన్న కష్టాలు, చూసిన దృశ్యాలు, హృదయం ద్రవించి భవిష్యత్ స్వప్నాల్ని అక్షరీకరించిన తీరు ఓ సాహసం, ప్రశంసనీయం. ఒక శిల్పికి, చిత్రకారుడికి, రచయితకు మిళితమై ఉన్న గుణాలు ఈయన కవిత్వం అణువణువు మనల్ని జ్వలింప జేసి, చలింప జేసి మనల్ని కట్టి పడేస్తాయి. ప్రతి కవితలో ఏదో ఒక కొత్త పద ప్రయోగం మనల్ని నవీనత వైపు నడిపిస్తుంది.

"నా జీవిత శిధిలాలయంలో/ అనంత స్వప్నాలన్నీ
ఏ మూల నిద్రిస్తున్నాయో!
గడచిన అనుభవాల క్షణాలన్నీ/ జీవితాన్ని ప్రశ్నిస్తున్నాయి"

కవిత్వమే జీవితమై నడిచే వాళ్ళకు, సమాజాన్ని, మనిషిని,జీవితాన్ని అక్షరీకరించే కవులకు, రచయితకు సమ సమాజాన్ని ప్రేమించే వాళ్ళకు అరుదైన ఆహారం ఏటూరి వారి 'కలల కార్ఖానా'.

ఇవి కలలు కావు. ఎవరైనా కలలని అభిప్రాయపడితే అది పొరపాటే అవుతుంది. ప్రపంచీకరణలో మానవుడు కోల్పోతున్న జీవితాన్ని, పొందలేక ఎదుర్కొంటున్న సమస్యలకు పరాకాష్ట ఈ కవితా సంపుటి. రచయిత కొత్తదనం కోసం ఆరాటపడ్డ తీరు మనకు కనిపిస్తుంది.

వాస్తవికమైన మానవుని కృత్రిమ మనస్తత్వాలకు ఇది పుటంలా కనిపిస్తుంది. విజ్ఞులను ఆలోచింప జేస్తుంది. మేధావులను హెచ్చరిస్తుంది. ఒక కొత్త భాష, భావం మనల్ని బెత్తంతో చరుస్తూ ముందుకు నడిపిస్తుంది. ఇప్పుడిప్పుడే సాహిత్యపు సముద్రంలోకి అడుగుపెట్టి, పిడికిలెత్తి, కలాలు ఎక్కుపెట్టి సామ్రాజ్యపు దోపిడీ వ్యవస్థపై విరుచుకపడే రచయితలకు నెత్తుటి కాగడాలా కనిపిస్తుంది. కవిత్వానికి కొలమానం లేదుగా!

"కవిత్వాన్ని ఆత్మ దీపంలా చేసి
కాలం గడపముందు వుంచాను
మనిషి అస్తిత్వం చుట్టూ అల్లుకున్న
గాయాల్ని గేయాలుగా మలిచాను"

కాలాన్ని జయించిన వాడే నిజమైన కవి. భావితరాలకు ధైర్యాన్ని, భవిష్యత్ చిత్రపటాన్ని ముందుగా ఆవిష్కరించ గలిగిన వాడే అసలైన కవి. ఏటూరి నాగేంద్రరావు మాటలు బంగరు కలల్ని చిదిమేసిన కాలానికి కథలు చెప్పేవిగా ఉంటాయి. శృతి తప్పిన ఈ కాలపు నడకలను సరైన మార్గంలో నడిపే అక్షర దివిటీలుగా కనిపిస్తాయి.

కాలం మారింది. కవిత్వం విస్తృతమై కొత్త రూపం సంతరించుకుంటుంది. జీవితం గాలిలో దీపంలా, ఎడారి కోయిల పాటలా, గాజు నెత్తురులకు గాయపడిన కవి హృదయంలా వుంది. శ్రమైక జీవన సౌందర్యం నత్త నడక

నడుస్తుంది. పొడిచే పొద్దును ఆదర్శంగా స్వీకరించి జన జాగృతికి చైతన్య గీతం ఆలపించే బాధ్యత తీసుకోవడం రచయిత పరిపక్వతకు తార్కాణం.

"ఈ మాయా నిశ్శబ్దాన్ని ఛేదించాలి
కొత్త రుచుల వెతుకులాటలో/ సమస్త అడవుల గుండా
మైదానాల మీదగా ప్రయాణిద్దాం"

ఈ కవిత్వంలో ఎన్నో కోణాలు, మరెన్నో రూపాలు మనకు దర్శనమిస్తాయి. కృత్రిమ వారసత్వానికి అధి నాయకులుగా చలామణి అయ్యే బానిస సమాజం తయారవుతుంది. అభివృద్ధి అంటే డబ్బు. డబ్బుంటే హోదా అనే అంతగా దేశం నూతన పందాకు నాంది వాక్యం పలుకుతుంది. ఇప్పుడే అసలైన ప్రమాదం ముంచుకొస్తుంది. యంత్రాలు తప్ప మనుషులు లేని సమాజం రోజు రోజుకు వర్ధిల్లుతుంది. ఇవన్నీ కవిత్వంలో గుర్తుచేసి, మానవ మనుగడను కాపాడే ప్రయత్నం చేశారు.

"హాయిగా రెక్కలు విప్పుతుంది స్వార్థం
ఇవాళ సుదీర్ఘమైన నటన తప్ప
ఎక్కడా మృదువైన కదలికలు లేవు"

కవి ఆవేదన, ఆక్రందన దేశంపై తనకు గల ప్రేమ వ్యక్తమవుతుంది. చూపులకు చిక్కకుండానే సమాజం రంగులు మార్చుకుంటుంది. నా బతుకు తాత్పర్యంలో అన్నీ వ్యాకరణ దోషాలే అంటారు ఆయన. ఈ మాట అనడానికి గొప్ప మనసు కావాలి. బాధ్యతలు నిత్యం పంచుకునే మంచి మనిషి కావాలి. అవన్నీ పుష్కలంగా ఉన్న కవి. ఈయనకు భాష మీద పట్టుంది. సామాజిక బాధ్యతుంది. ధైర్యం మెండుగా ఉంది. దు:ఖం కూడా నా కైపులో తలదూర్చి నిద్రపోతుంది అంటారు. ఈ మాట అనడానికి సాహసం కావాలి. ఈ కవి అక్కడక్కడ ప్రకృతి ప్రేమికుడిలా, మాతృభూమి ఆరాధకుడులా కనిపిస్తాడు. చెట్లకు అనుభూతులుంటాయని స్నేహం చేశాక తెలిసింది అంటారు.

రచయితకు భూమిలో, ఆకాశంలో, చెట్టులో, కొమ్మలో, ఆకులో, మొగ్గలో అణువణువు కవిత్వమై పలవరించే గుణం కావాలి. ఈ విధమైన స్పందన, బరువైన బాధ్యత కలిగిన కవి. సమాజంలో మనుషులతో ఉన్నప్పటికి మానవత్వం లేని సమాజాన్ని జీర్ణించుకోలేక ఇలా అంటారు.

"నేను శవాలతో తిరుగుతున్నాను
రాబందులతో పోరాడుతున్నాను
గొప్ప తెలివితో
సమాధి అరుగుపై కూర్చొని
నిర్లక్ష్య ప్రసంగాల్ని చేస్తున్నాను
చరిత్రల్ని అదృశ్య భాషలా మార్చి
చెట్ల మధ్య హోరెత్తి ఏడుస్తున్నాను"

అయినా ఆశలేని వాడు కవి కాడు. ప్రశ్నించని వాడు రచయిత కాలేడు. అడుగడుగునా ప్రశ్నలతో ప్రపంచాన్ని సంధించే వాడే కవి. మాతృత్వపు పురిటి వాసనతో కవి తన మనసులోని మాటను చరిత్ర కుటుంబ నియంత్రణలో వీరుల్ని కనడం మానేసింది. శవాల మీద నుండి అమ్మ జ్ఞాపకమేదో ప్రశ్నిస్తోంది అంటారు. ఇలా ఎన్నో మాటలు మనల్ని వెంటాడతాయి. ఏటూరి వారి కలం రాటుదేలిన ఈటై సాహితీ ప్రియుల గుండెలో నాటుకుంది. ఇంత మంచి కవిత్వం రాసిన నాగేంద్రరావు గారికి అభినందనలు. ■



## ప్రేమించు

**చ**దువునే కాదు
చెమటనూ ప్రేమించు
అక్షరాన్నే కాదు
వస్తువునూ ప్రేమించు
వంద నోటునే కాదు
వక్క రూపాయినీ ప్రేమించు
గాజు మేడనే కాదు
మురికి వాడనూ ప్రేమించు

ఆమె ఎత్తుపల్లాలనే కాదు
ఎత్తుకొని లాలించే అమ్మతనాన్నీ ప్రేమించు
నవతనే కాదు
మానవతనూ ప్రేమించు
మనిషినే కాదు
లోని మనసునూ ప్రేమించు
నీకు నీవు
మనీషినని నిరూపించు !

**- కర్లపాలెం హనుమంతరావు**

## చలనశీలతే వరం

అవునూ...
నెత్తుటి చుక్కకు నేర్పిందెవరు?
నిన్ను చూస్తేనే భయపడేంత
ఎరుపెక్కాలి నువ్వని ...

ఎప్పుడూ విడివిడిగా ఉండే
కారుమబ్బులను ఏకాయెకి కలిపిందెవరు?
నీటి ధారలై నేలను
తడాపేయాలి మీరని ...

అప్పటికప్పుడు ఆకులు రాల్చుకొమ్మని
చెట్లను ఆతురత పెట్టిందెవరు?
అవసానాన్ని అంత కష్టపడి
మోయాల్సిన అవసరం మీకు లేదని...

మలినాలన్నీ తొలినాళ్లలోనే తోసివేయమని
నదులకు నిధులిచ్చి మరీ విధులప్పజెప్పిందెవరు?
నీలి రంగుతో ఒళ్ళంతా
నిగనిగలాడాలి నువ్వని ...

గమ్యం లేని గమనం చేయమని
గాలికి చెప్పిందెవరు?
ప్రాణులకు చలనశీలతనిచ్చే
వరమవ్వాలి నువ్వని ...

ఆలోచనకు ఆచరణకు
ఊడిపోలేని ముడిపెట్టబడిందంటే
ఎంతో కొంత మేలు
జరుగుతుందనే కదా, అర్థం!

కదిలే ప్రతి పదార్థమూ
ప్రేరణాత్మకమైన ఓ కథ
చెబుతూనే ఉంది
వినాలనే ఉద్దేశమే నీకు లేనట్టుంది
పోయిందేమీ లేదు...
నేర్చుకో మెల్లగా
నేడో రేపో
నిన్ను నీవు మార్చుకో
అందమైన హరివిల్లుగా ...

**- కమలేశ్**
**91603 96596**



## కలల దారిలో కాలంతో పయనం

కలల దారిలో కాలినడకలో
కలిసొచ్చిన నెచ్చెలి కాలం
మండే ఎండలు వీచే సుడిగాలులు
కష్టాలు కన్నీళ్ళై ముళ్ళబాటను పరిస్తే
పారే సెలయేళ్లు పచ్చని చెట్లు
భుజం తట్టి, నీడనిచ్చి
ముందుకు నడిపిన ఆనంద క్షణాలు
కంటికానని కఠిన శిలేదో
ఎదురుదెబ్బై కాలికి తగిలింది!
కన్ను దాటని దుఃఖసాగరం
హృదయం లోతుల్లోనే నిశ్శబ్దంగా ఇంకిపోయింది
కింద పడకుండా సంబాళించుకొని
గాయం చేసిన రాయిని
దూరంగా విసిరేసాను
వర్తమానపు గాయానికి
సడలని సంకల్పపు మందు రాసి
భవిత బాటలో ముందుకు కదిలాను.
గాయం మానింది, మచ్చ మిగిలింది.
కాల నేస్తం వీపు తడుతూ
వెలుగు రేఖలు చూపిస్తే
ఆశయ శిఖరాన్ని అందుకోవడానికి
అడుగు ముందుకేశాను
వర్తమానం రాస్తున్న గ్రంథంలో
నాకోసం కొన్ని అక్షరాలను పోగేసుకొని,
చరిత్రలో ఓ పేజీగా మిగిలిపోవడానికి
ప్రయత్నిస్తూ... ప్రయాణిస్తూ...
అలుపెరుగని బాటసారిని నేను ...

**– హెచ్.మేఘన**, ద్వితీయ బియస్సీ,
ఎస్.ఎస్.పి.ఆర్.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హిందూపురం



# అక్రమ రవాణా

- నల్లపాటి సురేంద్ర
94907 92553

"హైవేలో జరుగుతున్న ప్రమాదాలకు కారణం ఆకతాయిల చేష్టలు. అలాగే సమాజాన్ని పట్టి పీడిస్తున్న మరో అనైతిక చర్య అక్రమ రవాణా. వీటికి అడ్డుకట్ట వేయడం మన ప్రధాన బాధ్యత. జాగ్రత్త వహించండి." అన్నాడు ఎస్ఐ చంద్ర. రోజువారీ కేసులు, శాంతిభద్రతలు చూస్తూనే ఈ విషయాలపై తాను ప్రత్యేక దృష్టి పెట్టాడు. సహాయంగా కానిస్టేబుల్ రాజు, మహిళ కానిస్టేబుల్ వనిత ఉన్నారు. అనుమానం వస్తున్న ప్రతి వాహనం ఆపుతూ.. అన్ని సక్రమంగా ఉన్నాయో లేదో చూస్తున్నారు.

"వనితా.. మీరు మహిళలు నడుపుతున్న బండ్లను ఆపండి. హెల్మెట్, లైసెన్స్ లేకపోతే అసలు వదలొద్దు. ఈ మధ్య ఇలాంటి ప్రమాదాల బారిన మహిళలే ఎక్కువ గురవుతున్నారు. మనం హెచ్చరిస్తూ ఉంటే కంట్రోల్‌లో ఉంటారు' అని ఎస్ఐ చెబితే 'సరే సార్' అంది వనిత.

కాసేపు తర్వాత ఒక వ్యాన్ అటు వైపు వస్తుంటే.. దానిని ఆపారు. ఆ వ్యాన్ లోపల ఓ ఆవు ఉంది. దీంతో ప్రశ్నల వర్షం కురిపించారు. వ్యాన్ డ్రైవరుతో పాటు.. క్లీనరుని కిందికి దింపి "అసలు ఎక్కడ నుంచి వస్తున్నారు" అంటూ ఎస్ఐ గద్దించి అడిగాడు.

వ్యాన్ దిగిన వ్యక్తి "సార్.. నా పేరు అజయ్. మేము హైదారాబాద్‌లో ఒక గృహ ప్రవేశానికి ఆవును తీసుకెళ్తున్నాం" అన్నాడు.

"మరి రెండు ఆవులు ఎందుకు?" అని అడిగాడు ఎస్ఐ.

"రెండు గృహ ప్రవేశాలు ఉన్నాయి సార్, ఒకే ముహర్తానికి"

"అబ్బా. ఛా... ఎప్పుడూ ఇలానే చెబుతారా? లేక సమయం వచ్చినప్పుడు ఇలా చెబుతారా?"

ఎస్ఐ ప్రశ్న వాళ్లకే కాదు.. పక్కన ఉన్న పోలీసులకు కూడా అర్థం కాలేదు.

వ్యాన్ డ్రైవర్ వైపు చూస్తూ "నీ పేరు ఏమిటి? ఎక్కడ నుంచి వస్తున్నావు? ఎప్పుడూ నువ్వే వస్తావా.. లేదా మరొకరు వస్తారా? ఒక్క ఆవును తరలిస్తే ఎంత ఇస్తారు నీకు?" అంటూ ఎస్ఐ కోపంగా అడగడంతో ఆ డ్రైవర్ భయపడిపోయాడు.

"సార్ నా పేరు రాజు అండీ.. నాకు ఏం తెలియదు సార్. ఈ రోజే తొలి బేరం ఒప్పుకున్నా" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తుంటే..

"భలే నటిస్తున్నావు.. నీకు సినిమాల్లో మంచి ఫ్యూచర్ ఉంది" అంటూ వెటకారంగా అన్నాడు.

ఆ డ్రైవర్ "సార్.. నిజంగా నాకేం పాపం తెలియదు" అంటూ.. "నన్ను వదిలేయండి" అంటూ ప్రాధేయపడ్డాడు.

"ఎస్ఐ సార్.. మీ ఉద్దేశం ఏమిటి? మీరు మమ్మల్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు'' అంటూ అజయ్ మాట్లాడాడు కొంచెం కోపంతో.

"నా ఉద్దేశం ఏమిటో నా నోటి నుంచి చెప్పాలా? మీరు ఈ ఆవులను కబేళాకు తరలిస్తున్నారు అనే విషయం కనిపెట్టలేను అనుకున్నారా?" అన్నాడు కోపంగా.

ఆ ఇద్దరు ఒకేసారి "సార్" అన్నారు గట్టిగా.

"మీరు తప్పుగా అనుకుంటున్నారు. కావాలంటే ఈ గృహ ప్రవేశ పత్రిక చూడండి. ఈ ఇంటికే వెళ్తున్నాం. కావాలంటే మీరు ఎంక్వైరీ కూడా చేయండి." అన్నాడు అజయ్.

"నేను ఇలాంటి కేసులు వందల్లో చూశాను. ప్రతి ఒక్కరూ

దొరికితే చెప్పే మాట ఇదే. అసలు ఆవు అంటే అర్థం తెలుసా? దాని విలువ తెలుసా రా మీకు? అసలు ఎంత ఇస్తారు వాళ్లు మీకు? ఈ మార్కెట్ ఎక్కడ ఉంది? రోజు ఈ వ్యాపారం చేస్తారా? లేక ఆదివారం మాత్రమేనా? మీకు డీలర్ ఎవరైనా ఉన్నారా? లేక నువ్వే డైరెక్ట్ డీలింగ్ చేస్తావా చెప్పు" అంటూ అజయ్ మీద విరుచుకుపడ్డాడు ఎస్ఐ.

ఆ మాటలకు మిగతా ఇద్దరూ భయపడ్డారు.

"నిజంగానే గృహ ప్రవేశానికే" అంటున్నా ఎస్ఐ వినిపించుకోలేదు.

"ఆవులు పెంచితే రైతులే కాదు. దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. కానీ, మీరు డబ్బు కోసం, ఎలాంటి పనులు చేయడానికయినా సిద్ధం అయ్యారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఆవులను అక్రమంగా ఎగుమతి చేయడం, క్రూరంగా వధించడం నేరమని కూడా పరిగణించింది. ఎలాంటి అనుమతులూ లేకుండా.. ఒక రాష్ట్రం నుంచి ఇంకో రాష్ట్రానికి పశువులను తీసుకెళ్లడం నేరం. అడ్డదారుల్లో వేలాది పశువులను ఇలాగే తీసుకెళ్తున్నారు. ఇన్నాళ్లూ నిఘా లేదు కాబట్టి.. మీ వ్యాపారం ఆరు ఆవులు ఏడు గోవులుగా సాగింది" అన్నాడు.

ఎస్ఐ ప్రవర్తనకి ఇద్దరూ కంగారుపడిపోయారు. దుఃఖంతో కుమిలిపోయారు. "మేము చెప్పింది నిజం" అంటున్నా వినే స్థితిలో ఎస్ఐ లేడు.

పక్కన ఉన్న పోలీస్ కూడా "సార్ .. ముందుగా వీరి దగ్గర ఉన్న ఫోన్లు లాక్కోని బాగా చెక్ చేయండి. పశురవాణా చట్టం 1978 ప్రకారం ఒక ప్రాంతం పశువులను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే మండల రెవెన్యూ శాఖ వారి అనుమతి తీసుకోవాలి" అన్నాడు.

"ఆ విషయం మాకు తెలియదు సార్" అన్నారు ఇద్దరూ.

ఒక వ్యానులో అయితే రెండు పశువులను మించి ఎక్కించకూడదు. పశువులను తరలిస్తున్న వాహనంలో గాలి, వెలుతురు వచ్చే సదుపాయం ఉండాలి. పశువులకు నీరు, ఆహారం ఏర్పాటు ఉండాలి. ప్రతి అరగంటకోసారి పశువులను వాహనం దింపి, అవి సేద తీరే విధంగా సదుపాయాలు కల్పించాలి. ఇక గర్భంతో ఉన్న పశువులను ఎట్టి పరిస్థితుల్లోనూ తరలించకూడదు. నిబంధనలు పాటించకుండా పశువులను రవాణా చేస్తే, ఆ వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చెయ్యొచ్చు. అందుకే మీ బండి సీజ్ చేస్తున్నాము" అంటూ చెప్పాడు ఎస్ఐ.

వారిద్దరూ ఎస్ఐ కాళ్ళ మీద పడ్డారు.

అతడు ఇంకే పునరాలోచనా లేచయలేదు.

ఇంతలో ఒక కారు చాలా వేగంగా రావడం గమనించిన వనిత ఆ బండిని ఆపింది .

డ్రైవర్, అతని పక్కన ఓ యాభై ఏళ్ల ఆడ మనిషి ఉంది. వెనుక సీటులో పెళ్లి కొడుకు బట్టల్లో నలభై ఏళ్ళు దాటిన మనిషి ఉన్నాడు. అతని పక్కన పెళ్లి చీరలో పద్నాలుగు సంవత్సరాల పాప ఉంది. ఆ పక్కనే మరో పాప కూడా ఉంది. ఎవరి మొహాలూ పెద్ద కలివిడిగా లేవు. వారి వైఖరి అనుమానంగా ఉండడటంతో వనిత వెంటనే ఎస్ఐ గారిని పిలిచింది.

ఎస్ఐ ఆవు తీసుకొచ్చిన వాళ్ళని మరో కానిస్టేబుల్‌కి అపచెప్పి "జాగ్రత్తగా చూస్కో .. పారిపోతారు" అని చెప్పి కారు దగ్గరకి వచ్చాడు.

"ఏమైంది" అని వనితను ప్రశ్నిస్తే, ఆమె "సార్.. వీళ్ళను చూస్తే చాలా అనుమానంగా ఉంది. పెళ్లి కొడుకు ఏజ్ బార్ మనిషిలా ఉన్నాడు. పెళ్లి కూతురు చిన్న పాపలా ఉంది" అంది

ఎస్ఐ వాళ్ళని చూసి పెదవి విరిచాడు.

"నీ అనుమానం ఏమిటి వనిత? ఏ బండి ఆపాలి? ఏది ఆపకూడదు? అనే విషయం తెలియదా? కారుకి అంటించి ఉన్న పువ్వులను బట్టి.. అలాగే పెళ్లి కొడుకు పెళ్లి కూతురు వేసుకున్న దండలని బట్టే చెప్పచ్చు .. వారు కల్యాణ మండపం నుంచి వస్తున్నారని." అన్నాడు.

"సార్.. అమ్మాయికి పెళ్లి కావాలంటే, ఇరవై ఒక సంవత్సరాలు ఉండాలి. కానీ ఈ అమ్మాయికి పద్నాలుగు కూడా ఉండవు" అంది వనిత.

"ఆమెను చూసి ఎలా చెప్పగలవు వనిత ? చాలా మందికి వయసు పెరిగితే మాత్రం, బరువు పెరగాలని లేదు .. పొడవు పెరగాలని లేదు కదా" అన్నాడు ఎస్ఐ తాపీగా.

"ఐడీ కార్డులు అడగండి సార్ ఒకసారి" అంది.

ఎస్ఐ వెంటనే "ఏమిటి వనిత. వీళ్ళను ప్రశ్నించడం వల్ల మనకే టైం వేస్ట్. కాస్త కామన్ సెన్స్ వాడు" అని చెప్పి వాళ్ళని పంపిచేస్తాడు ఎస్ఐ.

వెంటనే కార్ వేగంగా వెళ్ళిపోతుంది. వనిత కారును కార్ నంబర్‌ను ఫొటో తీసింది.

"సార్.. వీరిని ఏ ఎంక్వైరీ లేకుండా పంపించడం ఎందుకో బాగోలేదు సార్. నాకు ఇప్పటికీ మనసు అంగీకరించడం లేదు" అంది, విధేయంగానే.

"చూడు వనిత.. నీకు డ్యూటీ కొత్త. డౌట్ వచ్చిందని, ప్రతి వాహనాన్ని చెక్ చేసుకుంటూ పోతే.. మన పనులు చాలా పెండింగులో పడిపోతాయి." అన్నాడు.

కార్ నంబర్ ఒరిస్సాది సార్. వారు వెళ్తున్నది హైదరాబాద్. అంత దూరం నుంచి ఇక్కడికి రావడం అంటే ఏదో అను మానంగా ఉంది సార్. ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే.. ఇది పెళ్లిళ్ల సీజన్ కాదు. మరి ఎలా పెళ్లి అయింది? ఎక్కడ అయింది? కనుక్కోవల్సింది." అంది. తరువాత తన జర్నలిస్టు ఫ్రెండ్ ఇందిరాకి ఫోన్ చేసి విషయం చెప్పి కారు ఫొటో, నెంబర్ పంపింది.

"మీరు ఆవుతో వచ్చిన వాళ్ళని ఎన్నో ప్రశ్నలు వేశారు. వారు చెప్పింది వినలేదు. కానీ ఇక్కడ చిన్న పిల్ల పెళ్లి బట్టలలో ఉంటే కనీసం 'ఏ ఊరు? ఎక్కడ నుంచి వచ్చారు? ఏం చదివావు? అని కూడా అడగలేదు. మీ తల్లి దండ్రులు ఎవరు? ఆ పక్కన ఉన్న ఆడ ఆవిడ ఎవరు? అని అడగలేదు" అంటూ తన బాధను వ్యక్తపరిచింది.

ఎస్ఐ ఏదో చెబుతుంటే.. "మీరేం చెప్పద్దు సార్ .. మీకు ఆవులు మీద ఉన్న శ్రద్ధ మా ఆడవాళ్ల రక్షణ మీద లేదు. పశు చట్టాలు గురించి చెప్పిన మీరు.. ఐపీసీ 366 ఎ ప్రకారం పద్దెనిమిదేళ్ల లోపు బాల బాలికలను ఒక చోటు నుంచి మరొక చోటుకి తరలిస్తే పదేళ్ల జైలు శిక్ష.. ఐపీసీ 372, 373 ప్రకారం బాలికలను వ్యభిచారంలోకి దించడం .. ఇతరులకు విక్రయించడం చేస్తే పదేళ్ల జైలు శిక్ష ఉంటాయని ఎందుకు ఆలోచించలేదు. సింపుల్ గా అయిదే అయిదు నిమిషాలు మాట్లాడి పంపించేశారు. ఆవులను తీసుకొచ్చిన వాళ్ళని.. రెండు గంటల నుంచి విచారిస్తూనే ఉన్నారు." అంది విధేయపూర్వకంగానే.

"ప్రపంచ వ్యాప్తంగా జరిగే అక్రమ రవాణాలో 28 శాతం ఆడపిల్లలే ఉన్నారు. వెట్టి చాకిరి, బిక్షాటన, అవయవ దోపిడీ, వ్యభిచారం.. ఇవన్నీ దళారులు వాళ్ళతోనే చేయిస్తున్నారు." తనలో తానే గొణుక్కుట్టుగా అంది.

ఎస్ఐకి ఆశ్చర్యంగా అనిపించింది. ఆలోచనలలో పడేసింది.

ఇంతలో ఇందిర ఫోన్.

"వాళ్ళని పట్టుకున్నాం. నీ అనుమానం నిజమే వనిత" అంది.

"సార్. ఇప్పటికైనా మీరు వస్తారా? మా ఫ్రెండ్ ఇందిర.. టౌన్ పోలీసుల సహాయంతో వారిని చేజ్ చేసి పట్టుకున్నారు. మీరు వస్తే, మిగతా వివరాలు తెలుస్తాయి" అంది.

ఎస్ఐ ఆవులను తెచ్చిన వారి వద్ద వివరాలు తీసుకొని పంపేయమని మరో కానిస్టేబుల్‌ని పురమాయించాడు. తాను ఆ కారు దొరికిన ప్రదేశానికి బయల్దేరాడు.

కాసేపటి తర్వాత బ్రేకింగ్ న్యూస్ వచ్చింది టీవీలో...

"బాలికల అక్రమ రవాణా ముఠా అరెస్ట్..

పేద కుటుంబాలే వారికి టార్గెట్. ఒరిస్సాకి చెందిన ఇద్దరు బాలికలను చెరో లక్ష రూపాయలకు కొనుగోలు చేసిన హైదరాబాదు చెందిన వ్యక్తులు"

కానిస్టేబుల్ వనితను, జర్నలిస్ట్ ఇందిరను అభినందించారు పోలీసు కమిషనర్. ఈ సంఘటన జరిగాక, సిటీతో పాటు హైవే ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేశారు.

ఓ రోజు ఎస్ఐ .. వనితను పిలిచి "యూ డిడ్ ఏ వండర్ ఫుల్ జాబ్ వనిత. నేను వద్దన్నా, ఆ రోజు నువ్వు చూపిన చొరవే ఈ అమ్మాయిలను కాపాడింది" అంటూ ప్రశంసించాడు.

"థాంక్యూ సర్." అంది వనిత.

ఆమె మొహంలో ఏ మాత్రం గర్వం లేదు. నిర్మలంగా ఉంది. తన బాధ్యతను తాను సరిగ్గా నిర్వర్తించాను అనుకుంటూ, మరింత ఆత్మస్థైర్యంతో అడుగులు ముందుకు వేసింది. ■

## అక్షరాల భయం

ఈ రోజు రాయాలంటే భయంగా ఉంది.
ఎక్కడ మనసులోని మాటలు
ఉన్నది ఉన్నట్టుగా బయటికి వచ్చేస్తాయేమో అని.
నా అలజడులు, నా భయాలు,
వాటిని ఎవ్వరూ చూడకూడదు అనే ఆ తొందర
అక్షరాన్ని కాగితంమీద పెట్టనివ్వడమే లేదు

అలా కాదని,
అక్షరాన్ని కాగితపు అద్దంలో చూపిద్దామంటే
గుండె తుబీవను గాలుల వేగంతో కొట్టుకుంటోంది
పెన్ను మన్ను తిన్న పాములా చతికిలబడింది
ఆలోచనలు అలలలా ఎగిసిపడుతున్నాయి

ఇవాళ పెన్ను నా ఆలోచనలు తిన్నట్టుగా
నిజాలనే కక్కుతోంది.
అలా కదులుతున్న పెన్ను ను చూస్తే ఎందుకంత భయం?
నిజాలను కళ్ళతో చూడటానికి ఎందుకంత గుబులు?
గతంలోని నేనే ఎదురుగా వచ్చి మాట్లాడుతుంటే
ఎందుకంత చికాకు?

**– రూపా దూపాటి**

**63039 58822**

# మేమింకా బతికే ఉన్నాం!



దేశం మరచిన మట్టి రేడా!
దేహ సౌఖ్యం లేనివాడా!
అన్నం మెతుకులను అందంగా నేయటానికి
కోడి కూతతో పాటే వేకువను తట్టి లేపుతావు
ములుకర్ర మువ్వల సవ్వడితో
సోమరితనంతో నిద్రపోతున్న
సూర్యుణ్నీ మేలుకొలుపుతావు
జనాయువు పరిరక్షణా దీక్షతో
హలం ఆయుధం చేతపట్టి
ప్రమాణంతో భుజానపెట్టి
శ్రమ భూమిలో సమరం చేయటానికి
రామబాణంలా కదులుతావు
ఒంటి జటాజూటంలో
సుడులు తిరిగే స్వేద గంగను
గడ కండలతో పిండుతూ
నెత్తుటి ధారలతో మడి కడుతూ
పగలనకా, రాత్రనకా కాలంతో కాపురం చేసి
ఆకలి ఆయువుపట్టును కొట్టేఆయుధాన్ని సృష్టిస్తావు
పుట్టిన మొలకలకూ ఎదిగే పంటకూ
ప్రతిక్షణంకాపలా కాస్తూ
ప్రపంచ విజేతవై పరవశించిపోతావు
ఒళ్ళు నలగని దొరలేమో ఒంటి మహల్లో చేరుకొని
పరదేశీ పంట స్వాముల పాదాలనొత్తుతూ
వంచన మంత్రాలను వల్లె వేస్తూ
పడిలేవని నిన్ను చూసి, పదే పదే నవ్వుతుంటే
ఆశల గర్భాలయంలో వున్న 'నీవేమో'
పాతాళం నుంచి పైకి పొంగని
ధరలవంక తొంగిచూస్తూ
తేలిన ఎముకల్నింకా నలుపుతూ
మింగుడుపడని బాధల్నింకా నములుతూ
నీకు నువ్వే, నీలో నువ్వే
పురుగు తొలుస్తున్న గింజవై
ఆంగ్లం మింగుతున్న తెలుగువై
ఎంతకాలమైనా ఇలా నలుగుతూనే వున్నావు
కనిపించని కన్నీళ్ళతో
ఎన్నో మున్నీళ్ళను నింపుతూనే వున్నావు
వాడెవడో, అన్యాయపు కొరడాతో
కష్టంతో నింపుకున్నకడుపు మీద కొడుతున్నా
వీడెవడో, దగాకోరు వేళ్ళతో
ధాన్యపు సిరులన్నింటినీ దేగలా తన్నుకపోతున్నా
ఓర్పును నేర్చిన జానకిలా
అహింసా మార్గపు గాంధీలా
నిశ్చేష్టై నిల్చుంటావే తప్ప
తరిమి తరిమి గొంతుకొరికి
రక్తం జుర్రే పెద్ద పులిలా
ఒకతూరైనా గర్జించవు
బతుకంతా కాటికాపరిలా నిల్చుని
కార్పొరేట్ కామందులు పేర్చిన
దారిద్ర్యపు చితిలో నిర్జీవపు కట్టెవై
నీకు నువ్వే కాలిపోతుంటావు
ఓ కృషీవల మహాశయా!
నీ చుట్టూ అల్లుకొని వుండేది
రక్షక వలయం కాదు, రక్కసిమూక
నీవు నిత్యం పోషిస్తున్నది
మెత్తని పువ్వులను కాదు, విషం కక్కే నాగులని
విశ్వాసంతో నీ ఋణాన్ని
విలాసంతో నీ జీవితాన్ని
చిత్రించాల్సిన వైనతేయులం
నిలువునా నీవు కాలిపోతున్నా
నివురై నింగికి ఎగిరిపోతున్నా
నీ ఆక్రందనలను వింటూ నవ్వుకుంటున్న
పరిజ్ఞాన అసురులం
పది తలల రావణులం
ఇనుపముక్క మాటలు విని
కన్న తల్లినే నరికేయగల కర్కశ గొడ్డళ్లం
పక్కవాడి గోడకింద పడిగాపులు కాసే మేమంతా
నీ త్యాగానికి గాయం చేస్తూ
నీ ఆశలకు నీళ్ళొదులుతూ నీ లేమికి పాలుపడుతూ
పట్టించుకోని పాలకులమై
ఇస్త్రీ నలగని బట్టలతో క్రాపే చెరగని జుట్టుతో
రబ్బరు దిమ్మెల్లా ప్లాస్టిక్ బొమ్మల్లా
మేమంతా బతికే వున్నాం మేమింకా బతికే వున్నాం!

**- డా. పొదిలి నాగరాజు**
**90520 38569**






# సుతిమెత్తగా .. చురకత్తిలా ...

- కెంగార మోహన్
90007 30403

వర్తమాన సాహితీప్రపంచానికి కొత్త కొత్త కవులు పరిచయమౌతున్నారు. ఇది అనివార్యమైన మార్పు. తెలుగు కవిత్వానికి అంతో ఇంతో అక్షరార్చన. అయితే ఏ కవి రాసినా అందులో వస్తువు, శిల్పం, అభివ్యక్తి, భావుకత, పదచిత్రాలు, ఎత్తుగడలు కొంతమేరకైనా ఉంటాయి. కవిత్వం మనసుకు సంబంధించినదైనందున కవిత్వానికి కాస్తంత ఉద్వేగముంటే ప్రజల హృదయాలకు చేరువౌతుంది. ఏ కవైనా ప్రారంభంలో కవిత్వ నిర్మాణసూత్రాలేవీ తెలియకుండానే రాయడం సహజం. ఎవరు ఏది రాసినా కాసిన్ని కామెంట్లు, ఇంకొన్ని షేర్లు, మరికొన్ని లైకులు సామాజిక మాధ్యమాల్లో వస్తాయి. అయితే నిరంతర అధ్యయనం చేయడం ద్వారా కవిత్వ నిర్మాణ సూతాలన్నీ తెలుసుకుని కవిత్వం రాస్తారన్నది వాస్తవం.

కవయిత్రి స్వయంప్రభ తాజాగా పూలనిప్పులు పేరిట కవితా సంపుటి వెలువరించారు. భిన్నమైన శీర్షికతో సాగిన ఈ కవిత్వ ప్రయాణం నిజంగా నిప్పులపై నడకే. ఈ కవిత్వం సగటు మహిళ వాస్తవ జీవితానికి అద్దం పడుతుంది. వెలుగుల జీవితం అమాంతంగా అగాథంలో నెట్టేయబడ్డప్పుడు ఉద్భవించే కవిత్వం మనసును హత్తుకుంటుంది. అటువంటి కవిత్వమే స్వయంప్రభ గారి పూలనిప్పులు. పూలు పరిమళాన్నిస్తే, నిప్పులు బాధను కలిగిస్తాయి. మనిషి జీవితంలో పరిమళాలుంటాయి, ఆవేదనా తరంగాలుంటాయి. ఇది తాత్వికతే కాదు, సందిగ్ధ సంక్లిష్ట సంఘర్షణ కూడా. సుతిమెత్తని పదాలతో చురకత్తి పదును లాంటి భావాలతో ఈ కవిత్వం సాగింది.

"ఇద్దరం వొక్కటే అనుకున్నా/ అహమూ అహంకారమూ/ నీ జీవం నీ జీవనం అని/ అవగతమయ్యాక/ ఇరువురి మధ్యన/ అడ్డుగోడ కట్టినట్టయ్యింది/ నేనోదేహయంత్రమని/ నువ్వు ప్రగాఢంగా నమ్ముతున్నాక/ ఇరు తీరాలు కలవలేవని / చెప్పడానికి సాక్ష్యమేం కావాలి?/ సమస్య ఎక్కడ మొదలైందో/ తెలియదు కానీ/ మనిషిని/ అల్లకల్లోలం చేస్తూ/ మది స్తంభించి/ భూకంపం వచ్చినట్టుంది/ మూర్ఖత్వం చుట్టి ముట్టి/ జ్ఞానం అంధకారమనే ఇంట్లో కూర్చుంది/ అస్తిత్వాన్ని కోల్పోయినట్టుంది/ నడిసంద్రంలోని నావ మునిగినట్టు/ ప్రయత్నం సన్నగిల్లి/ కొడిగట్టిన దీపంలా మసకబారింది/ నీపై గెలిచే యుద్ధంలో/ సరికొత్త పద్మవ్యూహాన్ని/ సిద్ధం చేస్తున్నా/ గెలవాలనే పంతం పట్టి / మొండివైఖరితో పోరాడుతున్నా/ విడిపోయే ప్రయత్నం నాది/ కలవాలని చేసే యాగం నీది/ హృదయాన్ని తడుతుంటే/ వేరుగా భావించాను కానీ/ స్పందనని గ్రహించలేకపోయాను/ నీదైన ప్రపంచంలో/ మనమై ఉందామా/ మన్నించు ప్రియా మమేకమైపోతా!" (మలుపు).

ఈ ఒక్క కవిత చాలు, సగటు మహిళ జీవితం నిప్పులపై నడుస్తుందని అర్థమవుతుంది. జెండర్ అసమానతలున్న సమాజంలో పురుషాధిక్యత రాజ్యమేలుతూనే వుంటుంది. స్త్రీ రాజీ పడుతుంది. స్త్రీ కూతురుగా.. భార్యగా.. అమ్మగా.. బహుముఖీయంగా జీవితంలో రూపాంతరం చెందుతుంది. వెతల్ని కవితలుగా రాయడం ఇటీవల కాలం సాహిత్యం సాధించిన విజయమని చెప్పవచ్చు. ఈ కవిత్వ సంపుటి అనేకానేక వస్తువుల సముదాయం.. అనేకానేక మానసిక వైఖరుల గమనం. మరెన్నో సామాజిక సమస్యలపై ఎక్కుపెట్టిన కవితాక్షరాల సమూహం.. ఇక ఈ సంపుటిలో మొదటి కవితలో అన్నదాత కష్టాల్ని రాశారు. "మట్టిని ముద్దాడిన పుడమితల్లి పుత్రులం../ మలినమంటని ఆకలి పేగులం../ విశ్వానికే కంచంలో అన్నం పెట్టిన అన్నదాతలం../ కాలే కడుపుకు నడుము కట్టుకట్టిన దారిద్ర్యరేఖ బంధువులం.."

అంటారు. అవును.. రైతు నిజంగా మట్టిని ప్రేమించి మట్టిని ముద్దాడి అది కరుణించకపోతే ఆ మట్టిలోనే కలిసిపోతాడు. రైతుకు అతివృష్టి, అనావృష్టి బద్ధశత్రువులు. జీవితంలో జరిగే ప్రతి ఘటనను ప్రతిఘటనగా ఈ కవయిత్రి కవిత్వీకరిస్తుంది. ఈ సంపుటి నిండా జీవన సమరంలో పరచుకున్న సంఘటనల తెరలన్నీ పరచుకున్నాయి. అందుకే ఈ సంపుటికి పూలనిప్పులు అనే శీర్షిక నిర్ణయించుకున్నది. మొదట ఈ శీర్షిక చదివినపుడు భిన్నంగా వైవిధ్యంగా ఉందనిపించింది. ఆ కవిత చూద్దాం.

"విరియని విరులు / తెల్లనివన్నీ పాలే అనుకున్నా.../ తెలియనివన్నీ నిజాలు అనుకున్నా.../ నిజాలు నిప్పులా కాలుస్తుంటే/ కన్నీటి కలలో మరో పుట్టిల్లు/ ఆశ్రమవాసికి అద్భుతాలెందుకు/ కొన్ని పూలతోనే కొత్త వసంతం/ నిన్నటి పరిచయాలు.../ మొన్నటి జ్ఞాపకాలు/ రొద పెట్టే రేపటి గతం/ పరిచయం అయిన ప్రతి ఒక్కరూ వివేకానందుడే/ పరువాన్ని కూడా పరిచయం / చేయమన్నప్పుడే/ శునకానందుడు/ కాలం నాదైతే కలమేగా/ పాలూ, నీళ్లు విప్పిచెప్పే/ కలహంస.../ కాలకూటాన్ని కప్పేసే/ పరమహంస."

ఎంతో ఆర్తిగా, ఆవేదనగా కవిత చెప్పాలనకుంటుంది. అసంకల్పితంగా ముగిస్తుంది. చెప్పదలచుకున్న భావాన్ని భావుకతను, భావోద్రేకాన్ని పిడికిట్లో అదిమిపట్టుకుని బహిర్గతం చేయకుండానే వదిలేస్తుంది. తన జీవనం, జీవితం నిరంతరం ముళ్ళపై నడుస్తుంటుందని చెప్పకనే చెబుతుంది. ప్రతి కవితా వాక్యం శిల్పనిష్ఠతో హృదయాంగమం చేసే ప్రయత్నమే చేసింది. ఎంతవరకు సఫలీకృతురాలయ్యిందో తెలుసుకోవాలంటే ఈ సంపుటి మొత్తం చదవాలి. ఈ కవిత్వం నిండా ఓ సగటు మహిళ జీవితం దృశ్యాలుగా కనబడుతుంది. చాలా కవితలు మనముందు అనిర్వచనీయంగా పరచుకుంటాయి.

"ఆకాశానికి / నుదుటి తిలకమైనా ఓ సూరీడా../ విశ్వాన్ని చుట్టి వచ్చావా/ అలసిపోయి సంధ్య వాకిలికి చేరుతున్నావా / నా నుదుటి కుంకుమ జాడ తెలిసేనా నీకు/ కనులకు కానరాక ఎన్ని పొద్దులు/ కొండల నడుమకు జారిపోయానో/ సమాధానాలు చెప్పలేక/ ... ప్రతి పొద్దు నీ వస్తావాన్న ఆశ నాకు/ శ్వాసగా మరి భూమ్మీద నూకలు మిగిల్చాయి/ వస్తావు కదూ/ నీకోసం / ఎదురుచూపుల జాగరణ చేస్తాను! (తెల్లవారని సూరీడు).

స్వయంప్రభ కవిత్వాన్ని ఇష్టంగా రాస్తుంది అనడంకంటే కవిత్వంలో మమేకమై రాస్తుందనడం సబబు. కవిత్వం చదువు తుంటే జీవితం కళ్ళముందు కనబడుతుంది. ఉపమానాలు, యతిప్రాసలు వంటివి తనకేం తెలియవు. జనంలోకి చేరేలా రాస్తుంది. పదివరకే చదువుకున్న ప్రభ గారి కవిత్వం భాషా సాహిత్యాల మీద పట్టున్న కవులు రాసినట్లే ఉంటుంది. ఈ కవిత్వం నిండా కన్నీళ్ళు బాధలు, బాంధవ్యాలు, అంతరించి పోతున్న విలువలు, నైతికతలే కాకుండా మానవ జీవితంతో ముడి పడిఉన్న అనేకాంశాలు, సమస్యలు కవితలుగా ఉన్నాయి. తీరం అనే కవిత చూడండి.

"ముగింపు కథకు చేరుకున్న/ తీరని మౌనఘోష మళ్లీ మొదలు../ నిశ్శబ్దం దుప్పటి కప్పుకున్న/ శబ్దాల అలికిడి వింటున్న శవాన్ని నేను../ దేహం చితిమంటల్లో దగ్ధమౌతున్న/ కోరికల ధూపం రాజుకుంటోంది సన్నగా../ కపాలం భళ్లున పేలిన/ కర్మ ఫలితం వెంటాడుతోంది నీడలా../ కానరాని మోక్షం కోసం/ సాక్ష్యం లేని ప్రయాణం వ్యర్థం../నోట్ల కట్టల గణితంలో/ శిఖరాగ్రం చేరుకున్న అగ్రస్థానం నాదే ../ బంధాల లెక్కింపులో/ సంఖ్యలను కోల్పోయి/ చుక్క ఎడమ చేరిన సున్నాను నేను../ గెలుపంటే ప్రపంచం గుర్తించిన/ వ్యక్తులలో ఒక్కడిననుకున్నా/ సర్వం కోల్పోయి ఒంటరిగా మిగిలున్నా../

స్వయంప్రభ కవిత్వం వస్తు ప్రధానమైనది. అలాగని శిల్పం లేదనడానికి వీల్లేదు. అయితే కవిత్వంపై సాధికారత రావాలంటే మాత్రం నిరంతరకవిత్వ అధ్యయనం అనివార్య మని భావిస్తున్నాను. ప్రారంభదశలోనే ఇంత ఆర్తిగా కవిత్వం రాయడం అసాదరణమైన విషయం. ఈ కవిత్వం ద్వారా సమాజాన్ని మార్చాలని కోరుకుంటుంది. ఇదొక గొప్ప సంకల్పం. అందుకేనేమో ప్రశ్నిస్తేనే మారదు సమాజం – మార్పు నీతోనే మొదలవ్వాలి. ఎదిరించి నిలబడితేనే జరగవు కార్యాలు – ఆచరణాత్మక అడుగులేస్తేనే విజయాలు.. నిజమే కదా వేలప్రసంగాలు కాదు..గొప్ప గొప్ప రాతలు అంతకంటే కాదు..ఆచరణాత్మకంగా జీవితం లేకపోతే వృధానే..మనం కోరుకుంటున్న మార్పు.. మనం కోరుకుంటున్న సమాజం మనం ఆచరణలో ఉండగలిగినప్పుడే సాధ్యం. ఈమె కవిత్వం మున్ముందు ఇంకా గాఢతను సంతరించుకుంటుందని ఆశిద్దాం. అయితే తనింకా చదవాలి. చదివితే ఇంకా బాగా రాస్తుంది. మొదటి సంపుటిలోనే ఇంత ఆర్తిగా రాయడం, ఇంత అభివ్యక్తితో కవిత్వం చెప్పడం, ఇంత భావుకతని మేళవించడం అభినందనీయం. ప్రారంభదశలో రాస్తుంది కాబట్టి ఇందులో కవిత్వ నిర్మాణమంతా కనబడాలని కోరుకోకూడదు. తన చెప్పదలచుకున్న బాధనో ఆనందాన్నో ఆవేదననో ఏదో ఒక పెయిన్‌ను కవితాత్మకంగా చెబుతున్నది. కొన్ని కవితలు తన జీవితంలోంచి ఉబికి వచ్చిన ధారలు. ఆ ధారలే స్రవంతిగా మారి సెలయేరై ఆ అక్షరాలే జడివానై ఇలా మన ముందు పూలనిప్పులై మండుతున్నాయి. స్వయంప్రభ నిరంతర కృషి, అధ్యయనంతో భవిష్యత్తులో గర్వించదగ్గ కవిత్వం రాస్తుందనే నమ్మకం కలుగుతోంది. ■



## కన్నీటిధార

- కుడికాల వంశీధర్
9885201600

మధురోహాల మైకం కమ్ముకున్న వేళ
అంతరంగం ఆనందపు జల్లులో
నిలువెల్లా తడుస్తున్నప్పుడు
కనుల ముందు కమనీయంగా
నిలిచి ఉన్న రూపు నీది.

ఒంటరిగా వేణు గానం ఆలపించు వేళ
దూరంగా జత కలిపే
మనోహర వసంత రాగమై
మృదుస్పర్శతో హృదయాన్ని
తడిమిన పిలుపు నీది.

పరువం కొత్త చిరుగు వేస్తున్న వేళ
మమతల మకరంద మాధుర్యం
వలపు పువ్వుల పరిమళంతో
గోరువెచ్చని సూరీడు సాక్షిగా
అందించిన అభిమానం నీది.

మనదైన ఊహాలోకాన మనసును ఊయలలూపి
మరోజన్మకు విడిచిపోతే
నా కన్నుల్లో జాలువారుతున్న
ఈ కన్నీటిధార నీది!

## చెరసాల

దాహమేసి గుక్కెడు మంచి నీళ్లతో
గొంతు నింపుకుందామనుకుంటే
కులం తక్కువ వాడినని అవహేళనతో
తోటివాళ్ళే దూరంగా నెట్టేశారు
స్కూలు బయట ఎవరూ ముట్టని
మట్టి కుండలోని వాన నీటి
చుక్కలతో గొంతు తడుపుకొమ్మన్నారు
ఎండిన గొంతులు తడిపే
నీళ్ల కుండలకు కూడా
కులం రంగు పులిమారని అప్పుడే తెలిసింది!
ఆకలేసి గుప్పెడు మెతుకులతో
కడుపు నింపుకుందాం అంటే
అస్పృశ్యుడినని అవమానించి
వంట వాళ్ళే బయటకు గెంటేశారు
ఆరుబయట ఎండలో నిలబెట్టి
అరచేతిలో రెండు ముద్దలేసి పొట్ట నింపుకోమన్నారు
ఆకలి కడుపులు నింపే అన్నం పళ్ళాలకు కూడా
కులం కంపు అద్దారని అప్పుడే అర్థమైంది
అందరితోపాటు ముందు వరుసలో కూర్చుని
శ్రద్ధగా పాఠాలు విందాం అంటే
మలినపడిన మనిషినని అనాదరిస్తూ
టీచర్లే ఓ మూలన కూర్చోబెట్టారు!

నా నీడ కూడా తగలని చోటకు తోసేసి
చిరిగిపోయిన కాగితాలు నాలుగు
చేతిలో పెట్టి చదువుకో పొమ్మన్నారు
ఖాళీ మెదళ్ళను నింపే అక్షరాలకు కూడా
కులం మసి పూసారని అప్పుడే అనుకున్నాను
ఎంత చక్కగా చదివినా వెక్కిరింతలే
ఏ చిన్న తప్పు చేసినా కఠిన శిక్షలే
అందమైన కలలు కనటానికి ఆక్షేపణలే
ఆశలు నెరవేర్చుకోటానికి అన్నీ అవరోధాలే
పేరుకే మాది ఆదర్శ పాఠశాల
ఏక రూప దుస్తులలో మాత్రం అందరం సమానమే
అంటరానితనం నేరం అనే రాతలు
గోడలకే పరిమితం
సమాజం మా భవిష్యత్తుకు మతం ముళ్ళతో
కులం కంచెలతో కట్టిన చెరసాలని
ఎదిగే కొద్దీ తెలిసొస్తోంది!

– ఈదర శ్రీనివాస రెడ్డి



# ఆదర్శ అధ్యాపకుడు ఆచార్య తుమ్మపూడి

- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
94402 22117

**తె**లుగునాట తెలుగుశాఖలకు, సాహిత్య విమర్శక లోకానికీ ఆచార్య తుమ్మ పూడి కోటీశ్వరరావు గారు బాగా తెలిసినవారు. అన్ని విశ్వవిద్యాలయాలూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు (కేంద్ర సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ, తిరుమల తిరుపతి దేవస్థానం, మద్రాసు ఆసియన్ స్టడీస్ కేంద్రం) ఆయన సేవలను నిర్మాణాత్మకంగా ఉపయోగించుకున్నాయి. ఆచార్య తుమ్మపూడి వారు నాకు 1969 నుంచి గురువులు. నాలుగున్నర దశాబ్దాల నుంచి మా గురుశిష్య సంబంధం పొరపొచ్చాలు లేకుండా కొనసాగుతోంది.

నేను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బిఏ మూడవ సంవత్సరం చదువుతున్నప్పుడు తుమ్మపూడి వారు తెలుగు అధ్యాపకులుగా చేరారు. అంతకుముందు కరీంనగర్, శ్రీకాళహస్తిలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేశారు. 1969-70లో బిఏలోనూ, 1970-72 మధ్య ఎంఏలోనూ, 1973-77 మధ్య పరిశోధనలోనూ వారు నాకు అధ్యాపకులు. 1977-94 మధ్య అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయంలో నేను వారి దగ్గర సహాధ్యాపకుడుగా పనిచేశాను. అప్పుడూ ఆయన నాకు గురువే. ఆయన ఉద్యోగ విరమణ చేసినా, నేను కూడా రిటైర్ అయినా ఇప్పటికీ నేను ఆయన విద్యార్థినే.

తుమ్మపూడివారు నాకు సాహిత్య అధ్యయనంలో మార్గం చూపించారు. సాహిత్య విమర్శలో లోతులు చూపించారు. పరిశోధనలో, పర్యవేక్షణలో ఆదర్శవంతులయ్యారు. సాహిత్య బోధనలో ఒరవడి దిద్దారు. నన్ను కేవలం విద్యార్థిగా చూడలేదు. తన కుటుంబ సభ్యునిగా ఆదరించారు. కాలక్రమంలో నా భావజాలంలో మార్పులు వచ్చినా నా దారిలో నన్ను నడవనిచ్చారు. తరగతి గదిలో పాఠాన్ని ఆకర్షణీయంగా చెప్పడం వారి కళ. సాహిత్య విమర్శలో నిలకడగా మాట్లాడడం వారి సైన్సు. పరిశోధకులకు విలువైన పద్ధతులను నేర్పడం వారి పద్ధతి. కుటుంబ ధర్మాలూ, సమాజ ధర్మాలూ నిర్వహిస్తూనే సాహిత్యైక జీవిగా జీవించడం వారి నిబద్ధత.

ఆయన పాఠం చెప్పడం మొదలుపెట్టినప్పుడు మొదటి వరసలో కూర్చున్న విద్యార్థులు కూడా చెవులు రిక్కించుకొని వినాల్సిందే. లోగొంతుకతో, తనతో తాను మాట్లాడు కుంటున్నట్లుగా మొదలు పెడతారు. అందువల్ల విద్యార్థులందరూ ఆయనపైనే దృష్టి పెడతారు. పదహైదు నిమిషాలు గడిచే లోపల ఆయన కంఠస్వరం గదంతా పాకుతుంది. అదొక నాదస్వరం. అదొక మృదంగ వాదనం. తర్వాతి నలభై అయిదు నిమిషాలు ఆయన పాఠం విద్యార్థులను తన్మయులను చేస్తుంది. ఆయన మృదువైన గొంతుతో పద్యం ఆలపిస్తూ ఉంటే, పౌరాణిక పదాలలో చెప్పాలంటే, పోతన భాగవతంలో శ్రీకృష్ణుని వేణుగానానికి ప్రకృతంతా పరవశించి పోయినట్లు, విద్యార్థులు మైమరచిపోయి వినేవాళ్ళు. పద్యాలాపన సమయంలో ఆయన కళాకారుడు. పద్యాన్ని వ్యాఖ్యానించేటప్పుడు శాస్త్రకారుడు. ఆయన వ్యాఖ్యానంలో సామాజిక, వైజ్ఞానిక, సాహిత్య శాస్త్రాలు, సాహిత్యేతర కళలూ... అన్నీ చెట్టాపట్టాల్ పట్టుకొని వచ్చి సమన్వయం పొందుతాయి. ఆయన సృజనాత్మక అధ్యాపకుడు. ఆయనకు అంకారశాస్త్ర పరిజ్ఞానం పుష్కలంగా ఉంది. అట్లని ఆ శ్లోకాలను తరగతి గదిలో విద్యార్థుల మీద కుమ్మరించరు. విద్యార్థులకు ఎంతో అవసరమో అంతవరకే ఉదహరించేవారు. ఆయన బోధనలో ఒక లయ కొనసాగేది. అది మాకు ఆసక్తికరంగా ఉండేది. సాహిత్య బోధన విద్యార్థులను సాహిత్యం

నుంచి తరమగొట్ట కూడదు. వాళ్ళను సాహిత్య పఠనం వైపు మళ్ళించాలి. తుమ్మపూడి వారి బోధనలో ఆశక్తి ఉంది. తరగతి నుండి హాస్టలుకు వెళ్ళిన తర్వాత నాలుగైదు మంది మిత్రులం కలిసి వారి పాఠం గురించి చర్చించుకున్న సందర్భాలున్నాయి. పురాణాల్లో ఎక్కడో ఆశ్రమానికి ఎవరో రుషి వస్తాడు. ఆయనను ఆ ఆశ్రమవాసులు గౌరవిస్తారు. ఆయన సంతృప్తి చెంది మీకు ఏ కథ కావాలో కోరుకోండి చెప్తానంటాడు. వాళ్ళు పలానా కథ చెప్పమంటారు. ఆ కథను మొదలుబెట్టే ముందు ఆ రుషి 'దత్తావధానులరై వినుండు' అని మొదలుబెడతాడు. అంటే జాగ్రత్తగా వినండి అని అర్థం. తుమ్మపూడి వారు పాఠాన్ని తగ్గు స్వరంతో మొదలుపెట్టడంలోని రహస్యం అది అని మేము ఆలస్యంగా తెలుసుకున్నాం. ఆయన కంఠస్వరం విద్యార్థులను అయస్కాంతంలాగా ఆకర్షిస్తుంది. ఒక్కోసారి ఆయన మా గ్రహణస్థాయిని దాటి లోతులకు లేదా ఎత్తులకు వెళ్ళిపోయేవారు. మేము ఆయనకూ మాకూ కనెక్షన్ తెగిపోవడంతో బిక్కమొహం వేసేవాళ్ళం. ఆయన వెంటనే గ్రహించి మా స్థాయికి వచ్చేసేవారు. ఆ వచ్చే ముందు 'అంచేతా' అనేవారు. అంటే నేను మీదగ్గరికి వస్తున్నానని సూచన అన్నమాట. ఆయన సమయస్ఫూర్తి అది. విద్యార్థుల గ్రహణశక్తిని గుర్తించని అధ్యాపకులు అధ్యాపకులుగా రాణించలేరు.

తుమ్మపూడి వారికి కవిత్వంలో శుష్కశబ్దాడంబరం నచ్చేది కాదు. విచిత్ర శబ్దవిన్యాసం బాగా నచ్చేది. కవిత్రయం, నాచన సోముని తర్వాత శ్రీకృష్ణదేవరాయలు ఆయన అభిమాన కవి. రాయలు కవిత్వంలోని విచిత్రశైలి ఆయనకిష్టం. అట్లని ఆయన కేవల శబ్దప్రియులు కాదు. ఆయన భావగాఢతా, రసనిర్భరతా ప్రియులు. భావసౌందర్యవాది. శబ్దసంయోజనం రసావిష్కరణకు దోహదం చేయాలన్నది ఆయన అభిమతం. ఆయన కుంతకుని 'వక్రోక్తి జీవితం' అనే అలంకార శాస్త్రాన్ని సాధారణంగా ప్రస్తావించే వారు. కావ్యశైలిలో సుకుమార శైలి, విచిత్రశైలి అని రెండు ఉంటాయని మాకు చెప్పిన పాఠం ఇప్పటికీ నాకు జ్ఞాపకం. ఆయన మాకు భవభూతి 'ఉత్తర రామచరిత్ర', ధర్మవరం రామకృష్ణమాచార్యులు 'చిత్రనళీయం' నాటకాలను బోధించారు. ఆయనకు భవభూతి అంటే మహాప్రీతి. ఏడాదంతా ఉత్తర రామచరిత్ర బోధించారు. అది అనువాద నాటకం. ఆ అనువాదం చాలాచోట్ల ఆయనకు నచ్చలేదు. అప్పుడు మూలాన్ని చెప్పి వివరించేవారు. తేలికపాటి కవిత్వం ఆయనకు నచ్చేది కాదు.

అప్పట్లో ఆయన సైకిల్‌లో వచ్చేవారు. టౌనుకు కూడా సైకిల్‌పై వచ్చేవారు. ఒకరోజు నేనూ నా క్లాస్ మేట్స్ కొందరం తిరుపతి బజారుకు వెళ్ళి తిరిగి హాస్టల్‌కు వెళ్ళుతున్నాం. ఆయన సైకిల్ మీద టౌన్‌లోకి వస్తున్నారు. అప్పుడు హోటల్ అలంకార్ అని ఒక కొత్త హోటల్ వచ్చింది. ఇప్పుడది ఎన్‌టిఆర్ కూడలి. మాస్టారు మమ్మల్ని ఆ హోటలుకు తీసుకు వెళ్ళారు. మా పాఠాలు ఎలా సాగుతున్నాయో అడిగారు. అప్పుడు కేవలం శాబ్దిక కవులను గురించి వివరంగా చెప్పారు. మాకు పూరీలు తెప్పించారు. పూరీ వేడిగా ఉంటుంది కదా! వేలితో పొడిచారు. దాంతో ఆవిరి బయటకు వచ్చి పూరి బోలుగా కనిపిస్తుంది. దానిని చూపించి అలా ఉంటుంది కేవలం శాబ్దిక కవిత అన్నారు. మాకు నిబిడాశ్చర్యం కలిగింది. ఆయన ఆకర్షణీయమైన అధ్యాపకుడు.

నేను ఎస్వీయూలోనే పరిశోధన చేశాను. ఆచార్య తుమ్మపూడి గారు నా పరిశోధనకు పర్యవేక్షకులు. నేను పింగళి సూరన రచించిన 'ప్రభావతీ ప్రద్యుమ్నం' ప్రబంధం మీద పరిశోధన చేశాను. దానిని సూచించింది మాస్టారే. 1973 జనవరిలో పరిశోధక విద్యార్థిగా చేరాను. 1977 ఫిబ్రవరిలో పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించాను. 1977 అక్టోబరులో వైవా పరీక్ష జరిగింది. ఆచార్య బిరుదురాజు రామరాజు గారు, ఆచార్య ఎస్వీ జోగారావు గారు, ఆచార్య తిమ్మావజల కోదండరామయ్య గారు పరీక్షకులు. జోగారావు గారు వైవా పరీక్షకు వచ్చారు. నా సిద్ధాంతం గ్రంథం పేరు 'ప్రభావతీ ప్రద్యుమ్న కావ్య పరామర్శ'. దానిని 1980లో పుస్తకంగా ప్రచురించాను. అప్పుడు దాని పేరు 'శిల్ప ప్రభావతి' అయింది. ఆ పేరు పెట్టింది మా మాస్టారే. దానికి మా మాస్టారితోపాటు మా గురువు, తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జి ఎన్ రెడ్డిగారు, శ్రీసర్దేశాయి తిరుమలరావు గారు ముందు మాటలు రాశారు.

ఆచార్య తుమ్మపూడి వారు ఆదర్శవంతుడైన పర్యవేక్షకులు. పరిశోధకునికి అన్నీ తానే సమకూర్చి పెట్టి, బంగారు స్పూన్‌తో తినిపించరు. అట్లని పరిశోధకుని గాలికొదిలేసి, నీ చావు నువ్వు చావు, నువ్వు రాసుకొస్తే నేను సంతకం చేస్తాను అనే తత్వం కాదు. పరిశోధకులు తమకు తామే పరిశోధన పూర్తి చేసుకోడానికి అవసరమైన జ్ఞాన వాతావరణం కల్పిస్తారు. నిరంతరం సాహిత్యం గురించే చర్చిస్తూ, ఆలోచనలు రేకెత్తిస్తూ ఉంటారు. ఆయనకు నేను మొదటి పరిశోధక విద్యార్థిని. నాతోపాటు కావలికి చెందిన ఆంజనేయులు, వాకాడుకు చెందిన జెవి సుబ్బారాయుడు పార్ట్ టైం పరిశోధకులుగా చేరారు. పరిశోధనలో చేరగానే బాలాజీ బుక్ హౌస్‌కు వెళ్ళి వావిళ్ళ వారు ప్రచురించిన 'ప్రభావతీ ప్రద్యుమ్నం' ప్రబంధం కొనుక్కున్నాను. కుట్లు విప్పేసి కాగితాల మధ్య తెల్ల కాగితాలు పెట్టి కుట్లు వేయించాను. వ్యవసాయం చేసుకుంటూనే మూడు నాలుగుసార్లు చదివితే గానీ కావ్యం

అర్థం కాలేదు. రోజూ గురువు గారి దగ్గరకు పోయి నేను చదివిన గ్రంథాలను గురించి చెప్పేవాడిని. ఆయన మంచిది అనేవారు. మధ్యలో నా పరిశోధనాంశాన్ని గురించి ప్రస్తావించే వాడిని. ఏమన్నా చెబితే రాసుకుందామని నా ఆశ. కానీ ఆయన దానిని గురించి మాట్లాడేవారు కాదు. నా పరిశోధనాంశాన్ని గురించి తప్ప, వేరే రచనలను గురించి గంటల తరబడి చెప్పేవారు. ఇలా చాలాకాలం సాగింది. ఆయన అలా చెయ్యడం లోని ఆంతర్యం నాకు కొంత ఆలస్యంగా అర్థమైంది. ఆయన ఇతర కవులను గురించి చెబుతున్న విషయాల వెలుగులో నేను నా పరిశోధనాంశం గురించి ఆలోచించి సిద్ధాంతం గ్రంథం రాయాలన్నది ఆయన అభిమతం.

ఒకరోజు పరిశోధన గ్రంథానికి అధ్యాయ విభజన కావాలని అడిగాను. ఆయన మొదట ఆరు అధ్యాయాలు చెప్పారు. ప్రతి అధ్యాయం చివర శిల్పం అని వస్తుంది. అవి 1. కథాశిల్పము, 2. రసశిల్పము, 3. వర్ణనాలంకార శిల్పము, 4.పాత్రచిత్రణా శిల్పము, 5. శైలీ శిల్పము, 6.తులనాత్మక శిల్పము. పరిశోధన గ్రంథాన్ని గ్రాంథిక భాషలోనే రాశాను. ఒక్కొక్క అధ్యాయాన్ని రాయడం, గురువుగారికి చదివి వినిపించడం, వారు ఏవైనా మార్పులు చెబితే ఆ అధ్యాయాన్ని తిరిగి రాయడం. నేను ఒక అధ్యాయం రాసి తీసుకొనిపోతే, టేబిల్ మీద పెట్టుకొని ఎప్పుడో చూసి కరెక్షన్లు చేసిపెట్టే పద్ధతి కాదు ఆయనిది. నేను రాసిన దానిని నేనే చదివి వినిపించాలి. ఆయన వినాలి. నచ్చితే బాగుంది అనేవారు. లేకుంటే ఇంకోసారి ఆలోచించు అనేవారు. ఇంకోసారి ఆలోచించు అంటే మళ్ళీ రాయమని అర్థం. నేను మళ్ళీ రాసేదానికి అవసరమైన సూచనలన్నీ ఇతర కవులను గురించి చెప్పే క్రమంలో ధ్వనించేవారు. పెద్దన గురించి ఆయన చెప్పినదాని వెలుగులో నేను సూరన గురించి రాయాలి. నేను రాసిన దానిని చదివి వినిపిస్తుంటే ఒకచోట ఆపి, 'దీనిని ఎక్కడినుండి తీసుకున్నావు?' అని అడిగేవారు. నేను చెప్పేవాడిని. దానిని ఫుట్ నోట్‌లో పెట్టమనేవారు. నేను అలా చేసేవాడిని. ఇదీ వారి పర్యవేక్షణ పద్ధతి.

ప్రతి అధ్యాయాన్నీ మూడుసార్లు రాశాను. చదివేటప్పుడు గురువు గారి ముఖం చూసేవాడిని కాదు, నేను చెప్పేది నచ్చకపోతే ఆయన ముఖం ఎలా ఉంటుందో చూడడానికి భయం గనక. అన్ని అధ్యాయాలనూ మూడోసారి ఆమోదించారు గానీ మొదటి రెండు అధ్యాయాలను మాత్రం నాలుగుసార్లు రాయాల్సి వచ్చింది. ఎందుకంటే మొదట కథాశిల్పము, కథనశిల్పము రెండూ కలిపి కథాశిల్పము అనే చెప్పారు మాస్టారు. నేనూ అలాగే రాశాను. మూడుసార్లు రాసినా మరోసారి ఆలోచించు అన్నారు. ఇంకా ఏమి ఆలోచించేదబ్బా అనిపించింది. ఎందుకన్నారంటే: కథా శిల్పం అనే అధ్యాయంలో నేను రెండు అంశాలను కలిపి రాస్తూ వచ్చాను. అవి 1. కథానిర్మాణం. 2. కథాకథనం. నా ముందటి పరిశోధకులు, విమర్శకులు ఇలాగే రెండింటినీ కలిపే చర్చించారు. నేనూ అలాగే రాశాను. నేను రాసింది వినిపించే క్రమంలో కథానిర్మాణం, కథా కథనం వేరు వేరని ఆయనకు స్ఫురించిందేమో! నన్ను మళ్ళీ మళ్ళీ ఆలోచించమన్నారు. మూడోసారి కూడా ఆలోచించాలన్నారు. నేను తెలుగుశాఖ ఆఫీసు గదిలోనే ఒకరోజు అర్ధరాత్రి దాకా రాసింది మళ్ళీమళ్ళీ చదివాను. అప్పుడు నా మిత్రుడు పి ఎల్ శ్రీనివాసరెడ్డి కూడా నాతో ఉన్నాడు. అర్ధరాత్రి సమయంలో కథాశిల్పం అధ్యాయాన్ని రెండు అధ్యాయాలు చేస్తే బాగుంటుందేమో అని ఐడియా వచ్చింది. నాకే నవ్వు వచ్చింది. కథాశిల్పం అనే అధ్యాయంలో కథానిర్మాణం గురించి, కథన శిల్పంలో కథా కథనం గురించి రాద్దాం అనుకున్నాను. ఒక నెలరోజుల్లో కథానిర్మాణం, కథా కథనం గురించిన సమాచారం సేకరించి 'ప్రభావతీ ప్రద్యుమ్నం' ప్రబంధానికి అన్వయించి రెండధ్యాయాలు రాసేశాను. విన్నాక గురువు గారి ముఖంలో దరహాసం నాట్యం చేసింది. 'నీ పరిశోధన పూర్తయిందిపో' అన్నారు. అది నా జీవితంలో మరిచిపోలేని సమయం. ఆయనకు కలిగిన అభిప్రాయాన్ని నాకు చెప్పకుండా ఆలోచించు అనే మాటతో నాకే ఆ విషయం తెలిసేటట్లు చేయడం పెద్ద చమత్కారం. రచయితలకన్నా విమర్శకులు రెండాకులెక్కువ చదువుకోవాలి అన్నారు కొడవటిగంటి కుటుంబరావు గారు. పరిశోధకుల కన్నా పర్యవేక్షకులు వంద ఆకులు ఎక్కువ చదువుకోవాలి. నా గురువు అలా చదువుకున్నవారు. ■

> 'మనం కాలాన్ని కొలువ గలిగింది మార్పుతోనూ, నూతనానుభవాల తోనూ మాత్రమే!
>
> అప్పుడే మనకు అంటే మనం జీవించిన మన కాలానికి అర్థం... పరమార్థం!'.
>
> **- కొడవటిగంటి**
>
> ('ఐశ్వర్యం' కథలో)

# నా పోస్టుమార్టం రిపోర్టు నాకివ్వండి!



పెద్ద కోరికేం కాదు
అన్యాయమైన ఆశా కాదు
ఒక సాదాసీదా కోరిక
ఒక అతి మామూలు ఆశ
సముద్రాన్ని పిడికిట్లో పట్టుకుని
ఆఖరిసారి అడుగుతున్నా
'నా జ్ఞాపకాల్ని నాకివ్వండి'

బడి కెళ్ళే మొదటి రోజు
నాయినమ్మ చీర చెంగు నా రెప్పల చూరు వరకూ
పచ్చని పందిరిలా అల్లుకొనే
అతి చిన్న జ్ఞాపకం
'మీ నాన్నుంటే నీ బర్తేకి ఏం కొనిచ్చుండేవాడ్రా'
అన్న నేస్తం మాటలకు
నా చెంపలపై ఉప్పుజలపాతాలు జారని
మంచుముద్ద లాంటి జ్ఞాపకం!

చాపెక్కిన సంబరంలో
కోవెల మెట్ల మీద
స్నేహితురాళ్ళ మధ్య అక్కను చూస్తూ
మేనత్త ముసిముసి నవ్వుల మబ్బుయ్యే
మోస్తరు జ్ఞాపకం

నా చిటికెన వేలికి లంకె కుదిరే వేళ
అమ్మ కళ్ళల్లో నక్షత్రాలు
నాన్న కళ్ళల్లో చందమామలు పూసే
సగటు జ్ఞాపకం


ఉచితాల మీద ఆపేక్ష కాదిది
రాత్రికి రాత్రి పొలంలో మేడలు మొలవాలన్న
ఆత్రం కాదిది
ప్రాంతానికో అంతస్తు చొప్పున
ఇంటిని కట్టే వ్యూహం లేదిందులో
పాత బరువు దించి కొత్త బరువెత్తుకొనే చోట
జీవితం భుజం మార్చుకునే కూడళ్ళలో
గాలరీ బోసిపోకూడదనే ఆశ
నా జ్ఞాపకాల్ని నాకివ్వండి!

ఇరవై ఏళ్ళకు ముందెప్పుడో
ఏ ఉపగ్రహ ఛాయాచిత్రానికీ చిక్కని అల్పపీడనం
నా జ్ఞాపకాల మీద కన్నేసింది
వాయుగుండం అంతకంతకూ తుపానై
అంతుపట్టని మృత్యు అలై
నా తీరాన్ని గుద్దుకుని ఇక్కడే తిష్టవేసింది
పొదల చాటున నక్కిన కొండ చిలువ
ఒక్కొక్కటిగా నా జ్ఞాపకాలన్నిటినీ మింగేసింది

రక్తశుద్ధి యంత్రాలతో
నా జ్ఞాపకాలను పూరించాలని చూడొద్దు
పడకలు పెంచి
ప్రాణాలు పదిలమని నమ్మించలేరు
ఎత్తైన ఆసుపత్రుల ముందు
ఆకాశమంత ఎండుచెట్లను నిలబెట్టి
వాటి మొదళ్లకు
నా స్మృతుల్ని అనాథల్లా కట్టేయకండి

నా జ్ఞాపకాల్ని నాకు తిరిగివ్వలేనప్పుడు
నా చావుడప్పును మోగిస్తున్న చేతులేవో తేల్చండి
కనీసం
నా పోస్టుమార్టం రిపోర్టునన్నా
నన్ను చదువుకోనివ్వండి!

**- సాంబమూర్తి లండ**
**96427 32008**






# మానవీయ స్పర్శ ఉన్న కథలు

**- అలజంగి మురళీ మోహనరావు**

**ఒ**రియా నుంచి తెలుగులోకి సాహిత్యానువాదం ఎప్పటినుండో ఉంది. పురిపండా అప్పలస్వామి ఈ ఒరియా–తెలుగు అనువాదంలో అగ్రగణ్యులుగా ప్రసిద్ధికెక్కారు. వీరు గోపీనాథ్ మహంతి 'అమృత సంతానం', కాళింది చరణ్ పాణిగ్రాహి 'మట్టి మనుషులు' నవలలను అనువదించారు. ఉత్తరాంధ్ర మాండలికంలో సాగింది వీరి అనువాదం. జయంత మహాపాత్ర కవిత్వాన్ని తెలుగు చేశారు డాక్టర్ యు.వి. నరసింహమూర్తి. ఈ మధ్యకాలంలో జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన మేటి రచయిత్రి ప్రతిభారాయ్ నవల 'యాజ్ఞసేని' కూడా తెలుగులోకి అనువాదమయ్యింది. కవి సీతాకాంత మహాపాత్ర గారి కవిత్వాన్ని నిఖిలేశ్వర్ అనువదించారు.


ఇప్పుడు ఈ కోవలో సాహిత్య అకాడెమీ పురస్కారం అందుకొని సుప్రసిద్ధులైన ప్రఖ్యాత ఒరియా కథకులు గౌర హరిదాస్ గారి కథలను 'గౌర హరిదాస్ కథలు' అన్న పేరుతో తెలుగులో మనకు అందించారు ప్రముఖ కథకులు, అనువాదకులైన మూర్తి కెవివిఎస్. ఆయన మేరియో పుజో 'గాడ్ ఫాదర్' ఆంగ్ల నవలని తెలుగులోకి ప్రతిభావంతంగా అనువదించి గాడ్ ఫాదర్ మూర్తిగా పేరు గాంచారు. వారి సారళ్యమైన తెలుగు నుడికారంలో అనువదితమైన గౌర హరిదాస్ ఒరియా కథలను చదివి మనం చక్కని అనుభూతిని పొందవచ్చు. 'గౌర హరిదాస్ కథలు' పుస్తకంలో మొత్తం 12 కథలు ఉన్నాయి. గాజుబొమ్మ, తండ్రి, పాపం, కసింద చెట్టు, ఇల్లు, ఏకుమేకు, అహల్య పెళ్లి, బంగారపు ముక్క, సరిపోయింది, ఊర్మిళ, నేరం – శిక్ష, మాయావృక్షం, చిన్న పంతులు అన్నవి ఆ కథలు. ఈ కథలన్నిటిలో మానవీయ కోణాలున్నాయి, మానవీయ నైజాలున్నాయి. ఒక ప్రత్యేకమైన ఎత్తుగడ, ముగింపులతో సాగే కథా నిర్మాణంలో ముగింపు కొచ్చేటప్పటికి పాఠకుని మదిలో ఒక తటిల్లతలాంటి కదలిక, కళ్ళలో కాసిన్ని కన్నీళ్లు వస్తాయి. మానవ అంతరంగాల్లోని సామాజిక నిర్మితిలోని బోలుతనాన్ని ఎత్తి చూపుతూ సాగే ఈ కథలన్నిటా రచయిత చూపు, సంస్కరణా దృష్టి విదితమౌతూనే ఉంటాయి. సంఘంలోని లోపాన్ని ఇది అని ఎత్తిచూపుతూ ఏదో ఉపన్యాస ధోరణిలోనో, లేదంటే ఏవో ప్రవచనాల రూపంలోనో రచయితా చొరబడి మనకేదో ఉపదేశం ఇస్తున్నట్లుగా ఉండవు కథలు. పాత్రలే మాట్లాడతాయి, కథాగమనంలో పాత్రల నడవడిక, తీరుతెన్నుల ద్వారానే రచయిత ఎత్తి చూపదలుచుకున్న సమస్య మనకు అర్థమై పోతుంది. సామాజిక వాస్తవికతను చూపించే ప్రయత్నాలు రచయిత కథా శిల్పాన్ని ఎక్కడా విడువక కథను నడుపుకుంటూ వెళతారు. పాఠకుణ్ణి కథని చివరంటా చదవాల్సిన పరిస్థితిని కల్పిస్తారు. గౌర హరిదాసు కథల్లో కనిపించే విశిష్టత ఇదే! ఈ 13 కథల సంకలనంలో అన్నీ మానవత్వపు గుభాళింపులతో కూడుకున్నవే అయినప్పటికీ ఇల్లు, బంగారపు ముక్క, సరిపోయింది, ఊర్మిళ, చిన్న పంతులు కథలు అంతర్జాతీయ ప్రమాణాలతో కాలానికి నిలబడే కథలుగా రూపు దిద్దుకున్నాయి.

ఇల్లు కథ కలకాలం గుర్తుండిపోయే కథ! హ్యూమన్ ఎమోషన్స్, సున్నితమైన మానవ సహజమైన వాంఛలు, వయసు మళ్ళిన వారిలో కనిపించే ఐడెంటిటి క్రైసిస్... ఇట్లాంటి మానవ సంవేదనలు చుట్టూ తిరిగే ఈ కథ పఠిత మనసుని పట్టేస్తుంది. కథాగమనంలో ఏదో ఒక చోట మనం మనకి మంచిగానో, చెడ్డగానో కనిపిస్తాం కూడా. కథ వెంట మనం పరిగెడుతుంటాం, అదే సమయంలో మన మదిలో ఆత్మా చింతనా దౌడు ఒకటి సాగుతూ ఉంటుంది. అదే 'ఇల్లు' కథ యొక్క ప్రత్యేకత! ఇక సరిపోయింది కథని రచయిత చాలా knackగా, చాకచక్యంగా

చెప్పేరు. ఈ కథలోని ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లో డిప్యూటీ సెక్రటరీగా పనిచేసే అనుపమ్ పాత్ర స్వభావం, మనస్తత్వాన్ని చాలా గొప్ప ధ్వనితో చెప్పేరు రచయిత. ఇటువంటి కథల నిర్మాణం ఏదో ఒకటి రెండు రోజుల్లో జరిగేది కాదు. ఈ కథని చదువుతున్నప్పుడు ప్రఖ్యాత రచయితల సంకలనం అయిన 'వైరాగ్యంలోని మహిమ' గుర్తుకొచ్చింది. ప్లానింగ్ ఎక్జిక్యూషన్, పరిశీలనలలో ఈ కన్నడ కథా సంకలనంలోని కథలకు దీటుగా ఉంది ఈ 'సరిపోయింది' కథ. 'ప్రేమ తిండి పెట్టదు, డబ్బే పెడుతుంది' అనే ఒక ప్రాపంచిక పెడ ధోరణికి ప్రతీకగా నిలుస్తుంది అనుపమ్ పాత్ర. ఈ సత్యాన్ని వెల్లడి చేయడానికి అనుపమ్ పాత్ర మాటున కథకుడు కథని ఎలా నిర్మించేడో, నడిపేడో చదివి ఆనందించాల్సిందే!,

'ఊర్మిళ' మరో గొప్ప కథ. విధి వంచితురాలైన ఒక స్త్రీ దీనగాథ ఇది. పాఠశాల స్థాయిలో ఎంతో చురుకుగా, డామినెంట్‌గా, అందంగా, ఆరోగ్యంగా, నిక్కచ్చిగా ఉండే ఊర్మిళ, లెవెంత్ క్లాస్ ఫెయిల్ అవ్వడం, ఒక నకిలీ తాంత్రికుడి వలలో పడి తనతో లేచి పోవడం, చివరికి అంటే ఒక ఇరవై ఐదేళ్ళ కాలం గడిచిన తర్వాత ఒక హాస్పిటల్‌లో ఆయాగా జీవితాన్ని వెళ్లార్చడం... ఇలా తన జీవితం గిరికీలు కొడుతూ కిందికి పడిపోతుంది. ఆయాగా ఉన్నప్పుడే ఈ కథని మనకి వినిపించే పాత్ర ఆసుపత్రిలో ఆమెని చూడడటం, ఆశ్చర్యపోవడం జరుగుతుంది. ఎందుకంటే వీళ్ళిద్దరూ పాఠశాలలో క్లాస్ మేట్స్! ఊర్మిళ అప్పట్లో ఇతనిని తరగతిలో విపరీతంగా ఏడిపించేది. ఇంకా ఊర్మిళకు, తనకు సంబంధించిన ఇతర జ్ఞాపకాలు కూడా ఉంటాయి. ఆసుపత్రిలో ఆయాగా చేస్తున్న ఊర్మిళను చూసి 'నువ్వు ఊర్మిళవు కదా?' అనడిగితే ఊర్మిళ ఎవరు? నా పేరు బనలతా ఫరీదా అని అబద్ధం చెబుతుంది. ఊర్మిళ ఇంటికి కథ చెప్పే పాత్ర వెళ్ళినపుడు కూడా తను ఊర్మిళను కానని చెప్పి పంపేసి తలుపులు వేసుకుని ఆమె వెక్కి వెక్కి ఏడుస్తుంటే, ఆ ఏడుపు కథ చెబుతున్న పాత్రకే కాదు, కథ చదువుతున్న మనకీ వినిపిస్తుంటుంది. మనం కన్నీటి పర్యంతం అవుతాం, మంత్రగాని చేతిలో మోసగించబడిన ఊర్మిళ ఇంటికి మనమూ ఒకసారి పోయి ఆమె కన్నీళ్లను తుడవాలనిపిస్తుంది. ఇంత చక్కని కథాసంకలనాన్ని ఎంతో శ్రమతో అనువదించి, కథల్లో బిగిని, వేగాన్ని సడలనీయకుండా తెలుగు పాఠకులకి అందించిన అనువాదకులు మూర్తి కెవివిఎస్ ఎంతైనా అభినందనీయులు. తమ అనువాదాల ద్వారా తెలుగు సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేస్తున్న వీరు ఈ 'గౌర హరిదాస్' కథలు అనువాద సంకలనం ద్వారా మరింత ప్రసిద్ధులు కాగలరు.

**(ప్రతులకు : నవోదయ బుక్ హౌస్,హైదరాబాద్. పేజీలు :144, వెల : రూ.150)**



## స్వాగతం

**గ**డిచిన ఏడాది
తీపి జ్ఞాపకాలు కొన్ని
చేదు వాస్తవాలు కొన్ని మిగిల్చింది
కష్టాలు అలల్లా వచ్చి పోతుంటాయి
నీ కోసం నేనున్నాను...
నీ బాధలన్నీ నేను తీర్చేస్తానంటూ
కొత్త సంవత్సరం ధైర్యం చెపుతోంది

కొంగొత్త ఆశయాలతో
ఆశావహ దృక్పథంతో
మనసారా స్వాగతిస్తే
నీకు శుభాశీస్సులు అందిస్తానంటోంది
నవోదయ నవ్య వత్సరం ...

కరోనా కష్టాలతో పోరాడి
జీవిత విలువలను తెలుసుకున్నాం
నేర్చుకున్న అనుభవాలను
భావి తరాలకు పాఠాలుగా చెపుదాం
మనం అనుకున్న లక్ష్యాలు
మనోబలంతో  నెరవేర్చుకుందాం
రైతన్న ఇంట ధాన్యాలతో సమృద్ధిగా నిండాలని
సుఖ సంతోషాలతో
అందరికీ సకల శుభాలను ఇవ్వాలని
కోరుకుంటూ న్యూ ఇయర్‌కి
స్వాగతం పలుకుదాం!

**- ములుగు లక్ష్మీ మైథిలి**
**94400 88482**

## మనిషి - చెట్టు

ఆ చెట్టుకు వయసు ఎనభై ఏళ్ళుండొచ్చు
మా నాయన దాని నీడనే పెరిగినానని చెప్తుంటాడు
తాత నాటిన మొక్క పెను చెట్టుగా మారి
మూడు తరాలకు నీడనిచ్చింది
చారెడు నీళ్ళు పోసినందుకే
కన్నతల్లిలా మమకారం చూపించేది
బాల్యాన్ని ఊయల కట్టి ఊగించేది
చెట్టు నీడన నిద్ర అమ్మ ఒడిని తలపించేది
అ రోజుల్లో చెట్లను పెంచుకునేందుకే
ఇంటిముందు చాలినంత జాగా వుండేది
పండగలైనా పెళ్ళిళ్ళయినా
చెట్టు కింద పంచాయితీలు ఎడతెగేవి కావు
చెట్టు కింద నేస్తాలతో ఆటలు
రాలిన కాయల కోసం కుస్తీ పట్లు
వెన్నెల రాత్రుల్లో చెట్టు కింద బువ్వారగింపులు
మర్చిపోలేని జ్ఞాపకాలను మనసు పొరల్లోంచి
తవ్వుకుంటాడు నాయన
కూడు ఉడకేసుకోవాలన్నా
ఉడుకుడుకు నీళ్ళు పోసుకోవాలన్నా
చెట్లు కొమ్మలు పొయ్యిలో వెలుగయ్యేవి
భోగిమంటలకు ఎండిన ఆకూ కొమ్మా
చలి కాసుకనేందుకు సమిధలయ్యేవి ...
చెట్టు పాట పాడేది ఆకుల సవ్వడితో
కొమ్మల గూళ్ళలో పక్షులు కువకువలు వినవచ్చేవి!

అలాంటి చెట్టుకు
కాలంతో పాటు చెడ్డ రోజులు వచ్చాయి
తరాలతో పాటు చెట్టు తలరాత మారింది
ఇప్పుడు చెట్టు వ్యాపార వస్తువైంది
పల్లెలు పట్నంలో కలిసిపోతుంటే
చెట్టు పుట్టిన జాగాకు డబ్బు చేసుకుంటూ
ఇరుకు బతుకులకు అలవాటుపడింది
మనిషి స్వార్థం!
చేజేతులా చెట్టునుంచి దూరమైన మనిషి జీవితం
పచ్చదనాన్ని కోల్పోయింది!

**- డా.పాతూరి అన్నపూర్ణ**
9490230939

## దాహం .. దాహం ...

దాహం
జలప్రళయాలు పుక్కిట పట్టినా
జన ప్రవాహానికి దాహం తీరడం లేదు
ఎటు చూసినా పెను దాహ చింతనమే
చూసే కొద్దీ అవలోకించే కొద్దీ
దాహం అనకొండై దావానలంలా
భూనభోంతరాళాలు విస్తరించిపోతున్నది
మనిషి వామనుడైపోతుంటే
దాహం హిమవన్నగమైపోతున్నది
కండల్ని, కొండల్ని, గుళ్ళనీ, గుండెల్నీ కబళించాలని ..
విశ్వమంతటిని మింగాలని ఆశ్చర్యకర దాహద్రోణి!
కడలి అంచునుంచి నింగి కడ దాకా
పగటినీ రాత్రినీ నుసి చేసి భోంచేయాలన్న
ప్రళయ కావేరి దాహం
ఈ దాహమ్మొక పద్మవ్యూహం!
స్వప్నాలు కననీయని, కనురెప్పల వలయాల్ని
మూయనియ్యని
మనిషిని కుదిపేసి, మెదడును కవ్వంలా చిలికేసి
వేదనా జడివానల్ని దుప్పటిలా కప్పేసే దాహ బీభత్సం
తుపాన్లను సైతం మోసుకొచ్చి
శరీర మహానగరంలో ప్రవేశపెట్టే పెనుదాహం
ఇదో కొండచిలువ ఆకలివంటి
కేళీ విలాసమైన దాహం
ప్రపంచంపై ఆధిపత్యం కోసం విద్యుద్ఘాతం
విసరాలన్న దాహం
ఇదో విచిత్ర విలాస రమణీయ రాక్షస క్రీడ
ఎగురవేసే రంగురంగుల జెండాలది ఇదే దాహం
నదిలో దూకి సైతం పులిలా లంఘించాలనే
శబ్దాలకు రెక్కలిచ్చిన దాహం
అన్నిటా ఘనీభవించిన అవకాశవాద దాహం
బ్రతుకులోని కొద్ది కాలానికే
ఈ దాహయుద్ధభేరి అగత్యమా?
మూణ్ణాల్ల జీవితానికి యుగాల
అదృశ్యాల ఆనంద సముద్రం సమర్ధనీయమా?
అందుకే నేనో జలపాతమై రాత్రి నక్షత్రాల్ని మోసుకొచ్చి
కొండల విల్లంబులతో, కోనల కరవాలాలతో
దాహం కుత్తుకలు కోయాలని ఉంది
దాహార్తి నరకాసురుణ్ణి వధించాలని ఉంది!

**- చిన్ని నారాయణ రావు**
9440202942



# 'పాల'వెల్లి

- రాజేంద్ర ప్రసాద్ చేలిక
99858 35601

ప్రియమైన రాజా,

**వె**ళ్లి ఆరు నెలలు దాటింది. టెక్నాలజీ ఎంత దెవలప్ అయినా, నేరుగా చూడనిదే అంత తఅప్తి ఉండదనే నిజం ఆలస్యంగా తెలిసింది. అందరూ మాట్లాడుతుంటే ఏమో అనుకున్నా గానీ, అనుభవంలోకి వస్తేనే అర్థమైంది. దినామూ ఐదారు సార్లు ఫోన్ చేస్తూ, కనీసంగా రెండు మూడు గంటలైనా మాట్లాడుతున్నాను. అన్నట్టేగానీ మనస్సు మాత్రం నీ చుట్టే తిరుగుతున్నది. ఫోన్‌లో చూసేదానికి, ప్రత్యక్షంగా కలిసే దానికి ఉండే తేడా నా దాకా వస్తేనే తెలిసింది. నువ్వు సంక్రాంతికి వస్తావని చెప్పిన నుంచి ఎప్పుడెప్పుడు పండుగ వస్తుందా, ఏ బస్సులో నువ్వు దిగుతావా.. అని నువ్వెళ్లిన రోజు నుంచి క్షణం క్షణం చూస్తేనే గడుపుతున్నా. నువ్వు ఊర్లో ఉన్నప్పుడు నన్నే చూస్తూ గడిపావు.., అక్కడికి వెళ్లగానే బిజీ అయ్యావు. స్నేహితులు, ఇల్లు చక్కబెట్టుకోవడం.., వండుకోవడం, బట్టలుతుక్కోవడం, ఆఫీస్ పని, టార్గెట్లు.. ఇలా రోజంతా తీరిక లేకుండా నీకు సమయం గడిచిపోతున్నది. నేనేమో ఎప్పుడెప్పుడు చీకటవుతుందా.., ఎప్పుడు ఇంట్లో వాళ్లు నిద్రలోకి జారుకుంటారా.., నీకు ఫోన్ చేసి ఎప్పుడు మాట్లాడుతానా.. అని గడియారంకేసి చూస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నాను.

సమయం చిక్కితే చాలు ఫోన్ చేయడమే నా పనవుతోంది. నిన్ను విడిచి ఉండలేక, నన్ను నేను సముదాయించుకోలేకా.., నీవు వదిలి వెళ్లిన గుర్తులను నెమరేసుకుంటూ, బాధలు భరిస్తూ గడుపుతున్నాను. నువ్వు ఫోన్ ఎత్తనప్పుడు నాకు నేను సర్దిచెప్పుకుంటూ మనం కలిసి గడిపిన జ్ఞాపకాలను నెమరేసుకుంటున్నాను.

■■■

ఊరి పక్కనుంచే పారే గోదావరి. ఏటి గట్టు పెద్ద మర్రి చెట్టు. ఓ వైపు బస్టాప్, మరోవైపు గేదెలు పోగయ్యే స్థలం. నేను గేదెలు మందకు తోలుకుని వస్తుంటే నువ్వేమో సైకిల్ పై అటోటి, ఇటోటి రెండు బిందెలు పెట్టుకుని ఏటి పక్కనే ఉన్న బావి నుంచి నీళ్లు, అట్నుంచి అటే మా ఇంటికి వచ్చి గేదె పాలు తీసుకెళ్లేవాడివి. మొదట్లో నిన్ను అంతగా పట్టించుకోకునే దాన్ని కాదు. అయినా మా ఇంటికి ఎక్కువగా మీ అమ్మ లేదంటే మీ అక్కయ్య పాలకు వస్తుండే.., నువ్వు ఎప్పుడో ఓ సారి వచ్చేవాడివి. నువ్వొచ్చిన ఒకటి రెండు సందర్భాల్లో నేను యథాలాపంగా చూసినట్టు గుర్తు. అంతేగానీ ప్రత్యేకంగా నువ్వేమీ నాకు తెలియదు.

■■■

కాలం గడుస్తున్నా కొద్దీ మీ అమ్మ., అక్క పాలు తీసుకెళ్లడానికి రావడం తగ్గించారు. నీ రాకటేమో బాగా పెరిగింది. అమ్మ కూడా చాలాసార్లు నీతో "అదేంట్రా ప్రసాదూ.. ఈ మధ్య పాల కోసం ఎప్పుడూ నువ్వే వస్తున్నావ్.. అమ్మకు పని తీరిక లేకుండా పోతోందా.." అని అడిగి సందర్భాలూ ఉన్నాయి.

ఆ విషయంలో నాక్కూడా మొదట్లో అర్థం కాలేదు.

నాకేమోగానీ నా ఫ్రెండ్ స్వప్న మాత్రం ఓ విషయం ఇట్టే కనిపెట్టింది. కడుపులో ఏది ఆపుకోలేని అదే ఓ రోజు “ప్రసాద్ రోజూ మీ ఇంటికి వస్తున్నది పాలకోసం అనుకుంటున్నవానే.., ముమ్మాటికి నీ కోసమే.., నిన్ను చూడడానికే వస్తున్నాడే..” అని చెబితే అప్పుడెక్కింది నా మట్టిబుర్రకు. అదలా మాట్లాడినప్పుడు నాకు కొంచెం కోపం వచ్చింది.., ఇతడేంటి నాకోసం రావడమేంటి.., పనిపాటా లేదా..? అనుకున్నా.

అదీ కాక 'వాడో జులాయిగాడు.., తల్లిదండ్రులు సంపాదిస్తుంటే ఊరిమీదపడి స్నేహితులనేసుకుని బలాదూర్ తిరుగుతుంటాడని' ఇరుగుపొరుగు వారు నీ గొప్పతనాన్ని కీర్తిస్తూ ఉంటే నా చెవులారా విన్నదాన్నాయే. అందుకే ఆ సమయంలో కోపమొచ్చింది. కానీ, కొన్నిసార్లు నిన్ను చూస్తుంటే జాలేసేది. ఊరోళ్లంతా ఇంతగా తిడుతున్నారేంటి పాపం అనిపించేది. నాకేమీ కాని నువ్వు నాకోసం వస్తున్నావని తెలిసి కొంచెం సంబురం కూడా అయ్యింది. అందునా అర్ధరాత్రులు బలాదూర్ తిరుగుతూ ఉదయం పది దాటితేగానీ నిద్ర లేవని నువ్వు, నాకోసం పెందలాడే లేచి బిందలేసుకుని, పాల గిన్నె పట్టుకుని వస్తున్నావనిపించే సరికి ఏదో తెలియని ఫీలింగ్. కాస్త ఆయోమయంగా ఉన్నా, మనస్సుల్లో ఎక్కడో 'బంధం' ఏర్పడింది. అదే సమయంలో మర్రిచెట్టు దగ్గరకు వస్తుంటే స్వప్నతో పాటు ఇతర స్నేహితులు నువ్వు కనిపించే సమయంలో నన్ను ఆట పట్టిస్తూ, గిలిగింతలు పెట్టడం మరింత ఉత్సాహంగా ఉండేది. ఊరి జనాలేమనుకుంటే నాకేంటి అన్నట్టుగా, నువ్వు నిద్ర నుంచి లేవగానే సైకిల్‌పై వచ్చే దృశ్యాలు చూసిచూసి కొద్ది రోజులకు నాక్కూడా మనస్సు కరిగిపోయింది. నువ్వు ఇంటి వరకు వచ్చే దాకా వేచి చూసే ఓపిక లేక, అమ్మ నన్నెక్కడ కనిపెట్టి మొట్టిలు వేస్తుందోననే భయంతో నేను గబగబ గేదెను తోలుకుని ఏటి గట్టుకు బయలుదేరేదాన్ని. నువ్వు మా ఇంటికెళ్తూ ఎదురుపడడం, నేను నిన్ను, నువ్వు నన్ను చూసుకుంటూ మౌనంగా ఎదురెదురుగా దాటుకుంటూ వెళ్లడం చాలా సరదాగా అనిపించేది. పాలు తీసుకుని తిరుగు ప్రయాణం అయ్యాక నా వెనకాలే వస్తున్నావనే అడుగుల చప్పుడుతో లోలోపలే ఉబ్బితబ్బిబ్బయ్యే దాన్ని. దూరంగా ఉన్నప్పుడు నిన్ను చూడడం., దగ్గరకు వస్తున్నా కొద్దీ కంగారుగా కనిపెట్టుకోవడం.., సైకిల్‌పై మళ్లీ దూరంగా వెళ్తుంటే దొంగచూపులు చూస్తూ కాస్త బాధగా తిరుగు ప్రయాణం అవ్వడం నాకు అలవాటైంది.

▪▪▪

కాలమెప్పుడూ ఒకేలా ఉండదు.., సాఫీగా అంతకన్నా సాగదు కదా. నువ్వు కనిపించడం క్షణాలు ఆలస్యమైతేనే తెలియకుండానే కళ్లల్లో నీళ్లు తిరిగేది. అలాంటిది ఒక సందర్భంలో నువ్వు వరుసగా సుమారు పది రోజులు కంటికే కనిపించకుండా పోయావు. నీకేమైందో తెలియదు., ఎందుకు రావడం లేదో అర్థం కాదు. ఇంటి నుంచి బయలుదేరింది మొదలు, మర్రిచెట్టు దగ్గరకు చేరేదాకా గేదెను తోలుకెళ్తున్నానన్న మాటేగానీ చూపంతా నువ్వొచ్చే దారి వైపే. ఎంతకు నువ్వు కనిపించడం లేదనే ఆలోచనలే. నాకేమో విపరీతంగా ఏడుపొచ్చేది. మొదటి రోజు ఏమోలే.. నిద్రలేవకపోయి ఉంటాడులే అని సముదాయించుకున్నా. మరుసటి రోజు కూడా రాకపోయేసరికి ఏదో పనిమీద వెళ్లి ఉంటాడులే అనుకున్నా. ఆ తర్వాత రాకపోయేసరికి మనస్సుకు చాలా బాధేసింది., పట్టరాని కోపం కూడా వచ్చింది. నీ కోసం నేను బిక్కుబిక్కున చూడడం, నా మిత్రులు నన్నే గమనించడం. నా ప్రాణం విలవిల్లాడిందనుకో. అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఏదో కోల్పోయిన దాని వలే దిగాలుగా గేదెను తోలడం.., నువ్వెక్కడ రాకపోతావా.. అని వెనక్కివెనక్కి చూస్తూ ఇంటి దారిన పోవడం భారంగా అనిపించింది. పది రోజులు అదే తంతు. ఇంట్లో నేనేం చేస్తున్నానో అర్థం అయ్యేది కాదు.., అమ్మ ఓ పని చెబితే నేనోటి చేసేదాన్ని, చేసే పనిలో స్థిరత్వం లేక రెండు పచ్చడి జాడీలు.., మూడో నాలుగో మట్టి పాత్రలు పగులగొట్టిన సందర్భాలూ ఉన్నాయి.

నా ప్రవర్తనలో మార్పును కనిపెట్టిన అమ్మా ఓ రోజు నన్ను తీవ్రంగా మందలించిన సమయం ఇప్పటికీ గుర్తే. అయినా ఏమీ చెప్పలేక, ఎవరితో పంచుకోలేక తన్నుకొచ్చే ఏడుపును కళ్లల్లోనే ఆపుకుంటూ ఆ పది దినాలు గడిపాను.

▪▪▪

ఆ పదిరోజులు అమ్మవాళ్లు పొలం పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఒక్కదాన్నే ఉంటాను కదా.., ఆ సమయంలో మనస్సులో పరిపరి విధాల ఆలోచనలు మెలిపెట్టేవి. “వీడికేమైనా ఉంటుందబ్బా.. ఎందుకు రావడం లేదు.., ఏమైనా తప్పుగా ప్రవర్తించానా.., నా ప్రవర్తనతో కోపమొచ్చిందా..,” అని నాకు నేను ప్రశ్నలు వేసుకోవడం, అలా అయ్యి ఉండదులే అని స్థిమితపడడం కామన్ అయిపోయింది. ఒక్కటిరెండుసార్లు 'అమ్మా.. ప్రసాద్ ఎందుకు రావడం లేదు' అని అడుగుదామా అన్నంత ఆత్రుత పడ్డాను, కానీ అడగలేకపోయాను. పోనీ తెలిసిన వారి నుంచి వివరాలు కనుక్కుందామా అంటే.. ఏమనుకుంటారోో అనే కంగారు ఉండేది. అదీ కాకుండా డైరెక్ట్‌గా నేను మీ ఇంటి వైపు వద్దామనుకుంటే ఈ పిల్ల అటెందుకు

వెళ్తోందని అని ఎవరైనా అనుకుంటారోనని భయం ఉండేది. వరుసగా అన్ని దినాలు కనిపించకపోయేసరికి ఓ వైపు కోపం.. ఇంకో వైపు అసహనం.., దిగాలు..

ఒక్కోసారి అసలేమైంది నాకని నామీద నాకే అసహ్యం.., జాలి వేసేది. ప్రత్యక్ష నరకం అంటే ఇలా ఉంటుందా అని అనుభవంలో చూశాను. అదీ నా బుద్ధెరిగిన నుంచి అలాంటి పరిస్థితి ఎన్నడూ ఎదుర్కోలేదు.

■■■

పది దినాల తర్వాత బక్కచిక్కిన మొహమేసుకుని కనిపించావు. కనిపిస్తే కడిగి పారేయాలనుకున్న నేను నీ ముఖం చూసి తీవ్రంగా కంగారు పడ్డాను. నీకేమైందో తెలుసుకోవాలని ఆత్రుతగా ఇంట్లోంచి గుమ్మం వద్ద అమ్మపోసే పాల కోసం నిల్చున్న నీ దగ్గరకు పరుగుపరుగున వచ్చాను. అన్ని రోజుల తర్వాత నువ్వు కనిపించే సరికి పక్కన ఎవరున్నారు., ఎవరు గమనిస్తున్నారనే విషయాన్నే మరిచిపోయి నిన్ను సమీపించాను. అసలేమైంది.. నీకు.. ఎందుకిలా తయారయ్యావు.. చెప్పు.. అని చిన్నపిల్లగా మారాం చేసిన సందర్భం ఇప్పటికీ గుర్తే. మొదట ఎంత అడిగినా చెప్పని నువ్వు.. 'అమ్మ వస్తే బాగుండదు, తర్వాత చెబుతాను లే.. నువ్వెళ్లు..' అని ఎంతగా సర్ది చెప్పడానికి ప్రయత్నించినా నేను వినలేదు. నా ప్రశ్నల వర్షం తట్టుకోలేక అప్పుడు 'విపరీతమైన చలిజ్వరం.., నాలుగు రోజులైతే నోట్లోకి పచ్చి మంచినీరు కూడా పోలేదు. అమ్మవాళ్లు తీవ్రంగా కంగారు పడ్డారు. డాక్టర్ కూడా కాస్త కష్టమే అని చెప్పడంతో అమ్మ విపరీతంగా ఏడ్చింది. గత మూడ్రోజుల నుంచే కాస్త రిలీఫ్ గా ఉంది.." అని చెప్పిన ఆ సందర్భం ఎంతగా భయమేసిందో చెప్పలేను. గండం నుంచి బయటపడిన తర్వాత మరెప్పుడూ నన్ను చూడకుండా నువ్వు.., నిన్ను చూడకుండా నేను గడిపిన సందర్భం లేదు. ఇదిగో ఇన్నాళ్లకు మళ్లీ నువ్వు నీ స్నేహితుడు చూసిన ఉద్యోగం చేస్తానని హైదరాబాద్‌కు వెళ్లిన తర్వాత దూరమైన అవడమే మన మధ్య సుదీర్ఘ విరామం.

■■■

సంక్రాంతికి ఊరొస్తావని చెప్పావు కాదా.. మరో నాలుగు దినాలైతే నువ్వొస్తావని తెలిసి భూమ్మీద కాలు ఆగడం లేదు. నా తొట్టి గ్యాంగ్ అయితే నన్ను ఆట పట్టించడానికి అవకాశం కోసం కాచుక్కూర్చున్నారు. నువ్వొస్తే నేను వాళ్లను పట్టించుకోనని., కనీసంగా కలిసే టైం ఇవ్వనని ఇప్పటి నుంచే నన్ను ఆడుకుంటున్నారు. ఇక నా క్లోజ్ ఫ్రెండ్ స్వప్న అయితే "వస్తాడు నీ రాజు ఈ రోజు.. రానే వస్తాడు నీ రాజు ఈ రోజు.." అని సినిమా పాటలతో పేరడీ కట్టి ఆట పట్టించేస్తోంది. వాళ్లు ఎంత ఆటపట్టిస్తుంటే నాకంత ఆనందంగా ఉంది.. పైకి మాత్రం ఏమీ లేదన్నట్టుగా నటిస్తున్నాను. ఒక్కటి మాత్రం నిజం.. నువ్వు వస్తావనే రోజు తెలిసిన నుంచి నాలో మాత్రం నేను లేను.. నా ఆత్మ మొత్తం నీచుట్టే ప్రదక్షిణం చేస్తుందంటే నమ్ము. ఎప్పుడెప్పుడు బస్సు ఎక్కుతాడా.., ఎప్పుడు మర్రి చెట్టు దగ్గర బస్సు దిగుతాడా.., ఎప్పుడు చూస్తానా.., వెళ్లినప్పటికి ఇప్పటికి ఎలా మారాడా.., ఇప్పుడు ఎలా ఉండి ఉంటాడో.." అనే ఆలోచనలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

■■■

అన్నట్టు చెప్పడం మరిచాను.. మొన్ననే మా సూడి గేదె పండంటి ఆడ పిల్లకు జన్మనిచ్చింది. రోజుకు ఆరు లీటర్లకు పైగా పాలు ఇస్తోంది. ఇప్పుడు ఈనిన (డెలివరీ) ఈ గేదె పాలు ఎంతో స్వచ్ఛంగా, రుచికరంగా ఉంటాయని ఊర్లో అందరికీ తెలిసిన విషయమే. నా రాజు వచ్చే సమయానికి పాలవెల్లువ లాంటి పలకరింపుతో నీకు స్వాగతం పలకడానికేనా అన్నట్టుగా ఈనడం నాకైతే మరింత ఆనందంగా ఉంది. సంక్రాంతి పండుక్కు నువ్వు రావడం.., పాల వంటి మన ప్రేమను ఇంట్లో వారితో చెప్పడం.., పాలపొంగులతో పాయసం చేసుకుని నీతో కలిసి భుజించడం.., అన్ని తల్చుకుంటుంటే నా మనసు పులకించిపోతోంది. త్వరగా రా.. నీ రాకకోసం ఏటి గట్టు మర్రి చెట్టు దగ్గర ఎదురు చూసే ...

నీ
**రాజేశ్వరీ**

■

**'వారానికి ఏడురోజులు...**
**రోజుకు ఇరవై నాలుగు**
**గంటలు.**
**వాడుకో.. మానుకో..**
**అంతే జీవితం'**
**- రష్యన్ కవి**
**వ్లాదిమిర్ మయకోవస్కీ**

# సీకటి ఆకాశం

సన్నిమెట్టల సంధిలో
తొలీత నిన్ను సూసిన్నాటికి
మంచినూని సుక్కంత తేటగా ఎలిగేవి నీ కళ్ళు
నీవు మేపుతున్న గొర్రి పిల్లల మధ్య
నీవు కూడా అచ్చం
గొర్రిపిల్లలాగే కనబడేవాడివి!

డొంకల మధ్య అణిగాసి
దొంగకళ్ళతో నీ మేక కుర్రల్ని సూసి
పెదాలు తడుపుకుంటున్న పెద్ద నక్కను
ఎలా పసిగట్టేవో..
బండి సెక్కరాల్లాటి నీ సురుకు కళ్ళు
ఎమ్మటే ఎంటబడి ఎంటబెట్టీవి!

నోరులేని మెతకబొమ్మల్ని
నోటెట్టుకోవాలని గొద్దవలొచ్చినపుడు
బడేగర్ర తిప్పి కళ్ళతో నీవు గగ్గలించిన సప్పుడుకి
ఎగిరిపడిన పొద్దు గాలికొండ సిగురు కంటేసింది

ముసుర్ల కాలాన మేకలరాయి పళ్ళంలోకి
మేతకని సొమ్ములు తోలుకెళ్ళినపుడు
నీవు వొదిలేసిన పాటలెన్నో జీబుగా ఎదిగి
అక్కడ సెయ్యెత్తు పొదుగు సెట్లవడం సూశేను!

నిండారా పచ్చదనమెరగని
ముళ్ళ దొంకలమీదికి
ముందరికాళ్ళతో దాపగర్రేసి
కొనతీగల్ని బద్దుల్ని నోటితో అందుకుని
కసకస నవిలే ఇతనాల పోతుల్ని
ఇచ్చిత్తరంగా సూశేను!
ఆటి సుట్టూ సూపుల కంపలు పాతి
నీవు కాపు కాసినప్పుడు సూత్తే
ఎల్ల మబ్బు దుప్పటి మీద గుర్రుగా కూకున్న
ఉడుకుడుకు సూరీడి ఒంటికన్నులా కనబడేవాడివి!

నడిమిన ఎన్ని పంటలు గడిసిపోనాయో..
సేనా యేళ్లు అగుపడలేదు నీవు
మల్ల ఇన్నాళ్ళకి ఎదురుపడ్డావు
బలుసు తాతా! నాను సూసింది కలా? నిజివా?
నాకు కళ్లు గట్రా పోనేదు గదా!

ఇప్పుడు నిన్ను ఇలగ సూత్తుంటే



తల్లిని కోల్పోయి అల్లల్లాడుతున్న
తొగలోని లేగబెయ్యలా
మనుసు ఎందుకో సివుక్కుమంతాంది
సూపులేని నీ కళ్ళను సూడగానే
సందమామ రాలిపోయిన సీకటి ఆకాశం
గురుతయ్యిందేటో..!

సన్నిమెట్టల సంధిలో
తొలీత నిన్ను సూసిన్నాటికి
మంచినూని సుక్కంత తేటగా ఎలిగే నీ కళ్ళు
ఇప్పుడు నల్లటి కళ్లజోడు మూతల కింద
ఆరిపోయిన కొవ్వొత్తుల్లా..!

**- కంచరాన భుజంగరావు**
**949415 89602**

# సాహితీ ప్రజ్ఞ

**నిర్వహణ : పిళ్లా కుమార స్వామి**

1. ప్రసిద్ధి పొందిన ఇతివృత్తంతో, అష్టాదశ వర్ణనలతో, శృంగారంతో ఉన్న కావ్యాన్ని ఏమంటారు?
   ఎ. ఖండకావ్యం  బి. గాథ  సి. మంజరి  డి. ప్రబంధం
2. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అన్న కవి ఎవరు?
   ఎ. గురజాడ  బి. సినారె  సి. రాయప్రోలు సుబ్బారావు  డి. బసవరాజు అప్పారావు
3 . 'కిన్నెరసాని' రచించిన కవి
   ఎ. నండూరి  బి. విశ్వనాథ  సి. గురజాడ  డి. రాయప్రోలు
4. 'శివభారతం' రచించిన కవి
   ఎ. గడియారం వెంకటశేషశాస్త్రి  బి. పుట్టపర్తి సత్యనారాయణాచార్యులు  సి. శివశంకరశాస్త్రి  డి. దేవులపల్లి కృష్ణశాస్త్రి
5. ట్రూత్ ఈజ్ బ్యూటీ అండ్ బ్యూటీ ఈజ్ ట్రూత్ అన్న ఆంగ్ల కవి
   ఎ. షెల్లీ  బి. కీట్స్  సి. స్టీవెన్సన్  డి. వర్డ్స్‌వర్త్
6. 'శృంగార రసమొకటే రసమని' చెప్పిన అలంకారికుడు
   ఎ. భోజుడు  బి. భవభూతి  సి. శ్రీనాథుడు  డి. భరతుడు
7. అలంకారాలన్నింటిలోకి ఏ అలంకారాన్ని మనోహరమైనదిగా అలంకారికులు భావించారు?
   ఎ. ఉపమాలంకారం  బి. వక్రోక్తి  సి. రూపకాలంకారం  డి. యమకము
8. 'కొంచెం నిజాయితీ, కొంచెం మానవతాదృష్టి, మరికొంత ఆధునిక విజ్ఞానం ఉండటమే అభ్యుదయ దృక్పథం' అన్నవారు
   ఎ. శ్రీశ్రీ  బి. కె.వి. రమణారెడ్డి  సి. రారా  డి. బాలగోపాల్
9. 'సాహిత్యం జీవిత వృక్షానికి పూచిన పువ్వు' అని పేర్కొన్న విమర్శకుడు
   ఎ. కె.వి.ఆర్  బి. కొ.కు.  సి. సింగమనేని  డి. రాచపాళెం
10. 'పరమేశా గంగ విడువు పార్వతి చాలున్' అన్న కవి ఎవరు?
   ఎ. పోతన  బి. శ్రీనాథుడు  సి. తెనాలి రామకృష్ణ  డి. పెద్దన
11. 'మంచి గతమున కొంచెమేనోయ్' అన్నదెవరు?
   ఎ. శ్రీశ్రీ  బి. దాశరథి  సి. గురజాడ  డి. చలం
12. 'గతకాలమే మేలు వచ్చు కాలము కంటెన్' అన్నదెవరు?
   ఎ. ఎర్రన  బి. తిక్కన  సి. తిమ్మన  డి. నన్నయ
13. 'జాబిల్లీ నువ్వు సముద్రంమీద సంతకం చేసేటప్పుడు గాలి దాన్ని చెరిపెయ్యకుండా కాలమే పహారా కాస్తుంది' అన్న కవి?
   ఎ. చెరబండరాజు  బి. అలిశెట్టి ప్రభాకర్  సి. శివసాగర్  డి. శ్రీశ్రీ
14. 'గోడలు అసలే లేవు. గోడలను కూల్చడమే మా పని' అని గర్జించిన కవి
   ఎ. జ్వాలాముఖి  బి. చెరబండరాజు  సి. శివారెడ్డి  డి. శ్రీశ్రీ
15. కవి బ్రహ్మ తిక్కన వలె తన కావ్యాన్ని హరిహరనాథునికి అంకితమిచ్చిన కవి ఎవరు?
   ఎ. నాచన సోమన  బి. ముక్కు తిమ్మన  సి. నంది తిమ్మన  డి. ఎర్రన
16. 'మార్గకు మార్గము దేశీయ మార్గము అని తొలుత మార్గ, దేశీ పదాలు వాడిన కవి ఎవరు?
   ఎ. నన్నయ్య  బి. నన్నె చోడుడు  సి. తిక్కన  డి. జానపదులు
17. 'కలకంఠి కన్నీరొలికిన సిరియింట నుండ నొల్లదు అన్ని కవి ఎవరు?
   ఎ. గురజాడ  బి. శ్రీశ్రీ  సి) బద్దెన  డి. తిక్కన
18. శ్రీ వీరబ్రహ్మం 'కాళికాంబ హంస కాళికాంబ' మకుటంతో రాసిన రచన ఏది?
   ఎ. శుకసప్తతి  బి. సప్తపది  సి. కాళీకాంబ సప్తశతి  డి. సప్తశతి

జవాబులు : **1. డి 2. సి 3. బి 4. ఎ 5. బి 6. ఎ 7. బి 8. సి 9. బి 10. బి 11. సి 12. డి 13. డి 14. డి 15. ఎ 16. బి 17. సి 18. సి**





# కవితావేశానికి ప్రతీక 'కాలం ఒడిలో ...'

- వికెఎం లక్ష్మణరావు
94417 49192

**కా**లం ప్రవాహానికి సూచిక. ఒడి ఓ దశకి సంకేతం. ఈ రెండింటి కలియకేరెడ్డి శంకర్రావు కవిత్వం. నడుస్తున్న కొద్దీ కొత్త కొత్త విషయాలు ఎదురుపడతాయి. సరికొత్త సమస్యలను సృష్టిస్తాయి. అనుక్షణం సవాళ్లు విసురుతాయి. ముందుకు మున్ముందుకు సాగే ప్రయాణాన్ని జటిలం చేస్తాయి. ఆ క్లిష్ట దశలను దాటుకుని గమ్యానికి చేరువవుతున్న కొద్దీ మనసు తేలిక పడుతుంది. ఊపిరి పీల్చుకునే స్థితి ఏర్పడుతుంది. ఆ స్థితిని కల్పించుకునేందుకు తగిన ప్రయత్నమే కీలకం. అందుకు గమనమే ఆధారం, ముఖ్యం. అలా వచ్చిన అనుభవ సారమే... అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రాతిపదిక. ఏ ప్రాతిపదికన వస్తువు స్వీకరణ ఉంటుందో, ఆ స్వీకరణకి తగ్గట్లుగానే నిర్మాణమూ ఉంటుంది. నడక సాగుతుంది. పడతూ లేవడాలూ ఉంటాయి. తప్పులూ ఒప్పులూ చోటుచేసుకుంటాయి. ఈ క్రమంలోనే మన దృక్కోణం బయటకి వస్తుంది. మనం ఏ కళ్లద్దాల్లోంచి చూస్తున్నామో కూడా తెలుస్తుంది. ఆ చూపులోంచే విషయ పరిశీలన జరుగుతుంది. అందులోంచే మన ఆలోచన ఏమిటో ఆవిష్కృతమవుతుంది. అలా రూపుదాల్చిందే ఈ కవితా సంకలనం. వివిధ సందర్భాల్లో, వివిధ సంఘటనల్లో తనని ఉద్వేగపరిచినవి, తాను ఉద్వేగపడినవే ఈ కవితలు. 88 కవితల కూర్పు ఇది. అగ్రస్థానం రైతుదే. ఆ తరువాత భాగం కరోనా విలయానికి. మిగిలినది మిత్రుల కోసం, కుటుంబీకుల కోసం, ఉద్యమ సహచరుల కోసం రచించినవి.

రైతుకి అత్యధిక సమయం, అత్యధిక స్థలం కేటాయించడం వెనుక కారణం కవిది గ్రామీణ నేపథ్యం కావడం. నోస్టాలజీగా అనిపించినా, గ్రామంతో, నేలతో, అందునా వ్యవసాయంతో ముడిపడిన జీవితం మరిచిపోలేనిది. కులాలకూ, తరతమ భేదాలకూ ప్రాంగణమే అయినా, 'ఆత్మగౌరవం' కాదనలేని పరిస్థితి. ఆ ఆత్మగౌరవం 'ఆస్తి' భావనతో ముడిపడి ఉండవచ్చు. ఎంతగా అంటే ఎంతటి కష్టకాలం దాపురించినా కూడా తననీ, తన ఆస్తినీ వదులుకోలేని తనం ఎక్కడో సలుపుతూనే ఉంటుంది. అంతగా గ్రామీణ జీవనం కవి మీద ప్రభావం చూపింది.

గ్రామం కూడా ఒకనాటి 'వలస' అనీ, 'వలస' ఓ మెరుగు అనీ అంగీకరించేందుకు, ఆమోదించేందుకు ఎందుకనో తెలుగు కవిత్వం ఇష్టపడడం లేదు. ఆ ప్రయాణంలోని కొత్త కష్టాలను (మెజార్టీ) ఎందుకనో చూడ నిరాకరిస్తోంది. ఆ ఆలోచన ధారా ప్రవాహం ఎక్కడ మొదలయ్యిందో, ఎవరు మొదలుపెట్టారో తెలియదు గాని, ఆ ప్రభావం నుంచి నేటికీ తెలుగు కవులూ, కవిత్వమూ బయటపడడం లేదు. కొత్త దృష్టి కోణాన్ని అందుకోవడం లేదు. అందువలనే కొన్ని వేల పేజీలు గ్రామం వలస మీద దు:ఖించాయి. ఇప్పటికీ దు:ఖిస్తూనే ఉన్నాయి. ఆ పేజీలకి చేర్పే 'ఊరు వలస వెళ్లింది' కవిత. ఇక గ్రామంలో మిగిలి ఉన్న రైతుల్లో సేద్యం చేసిన వారు పడుతున్న అవస్థలు, అగచాట్లు, అరుగాలం కష్టానికి అప్పే తినాల్సిన దుర్భర, దైనీయ పరిస్థితులే వర్తమానంలో కొనసాగుతున్న ఆందోళనల వెనుక గల ముఖ్య కారణం. వీటికి తోడు ఫ్రీ మార్కెట్ విధానానికి కేంద్రం తలుపు తెరవడం పంజాబీ రైతుల పోరుకు ప్రేరణ. ఈ రెండింటి ఫలితమే మహారాష్ట్రలో రైతుల పాదయాత్ర, హస్తినలో నడిరోడ్డు మీద పంజాబీ రైతుల నిరసన. ఈ సందర్భాలు కవిని నిలవనీయలేదు. ఆందోళనలు, నిరసనలు, వ్యతిరేకతలు అత్యంత సహజంగానే ఈ లెఫ్టిస్టు కవిని ఆకర్షిస్తాయి. ఆకర్షించడమే కాదు; 'తన వంతు' అన్న

ఆలోచనకి గురిచేశాయి. ఆ ఆలోచన భిన్న రూపాల్లో వ్యక్తపరిచేటట్లు ప్రేరేపించాయి. కవి తన కలంతోనే కాదు, కార్యాచరణ వాదిగా కూడా వారికి మద్దతుగా నిలిచేటట్లు చేశాయి. 'రైతు'నే ఎర్రకోటకి 'రాజు' అని అనేటట్లు అందరి తోనూ ఒప్పించే ప్రయత్నం చేయించాయి. నాగలి పట్టిన వాడు తలుచుకుంటే ఆ పీఠం తన పరం చేసుకోవడం ఏమంత కష్టతరం కాదన్న వాణిని వినిపించేటట్లు పురిగొల్పాయి. ఆ నమ్మకానికీ, ఆ విశ్వాసానికీ, ఆ లక్ష్యానికీ ఒకనాడు తాను గడిపిన వ్యవసాయ జీవితమే ఆలంబన అయ్యింది. 'కలుపు'ను తీయడం రైతుకి ఎవరూ నేర్పాల్సిన అవసరం లేదన్న వ్యక్తీకరణకి అక్షర రూపమయ్యింది. వెన్నుదన్నుగా నిలిచింది. కారణాలు ఏమైనా గాని పంజాబీ రైతు ప్రస్తుతానికి విజయం సాధించాడు. ఆ విజయోత్సాహాన్ని మరింత మందిలో నింపేందుకు తన కవిత్వాన్ని ఓ వాహికగా చేసేందుకు కవిని ఉత్సాహపరిచింది.

ఎవరైనా కష్టకాలంలో ఉన్నప్పుడు స్పందించడం మనుషులుగా అందరికీ అనుభవం. కొన్ని సార్లు అసంకల్పితం గానే కనులు చెమ్మగిల్లడమూ అత్యంత సహజం. నిజానికి, అటువంటి నిస్సహాయ స్థితిలో, అటువంటి కష్ట కాలంలో బాధిత కుటుంబానికీ, స్నేహితుడికీ, సహచరులకీ, అనుయాయుడికీ మనోధైర్యాన్ని ఇవ్వడం తక్షణ అవసరం. ఆ అవసరాన్ని కవి గుర్తించారు. ఈ మధ్య కాలంలో అందరినీ ఏకాకులను చేసిన విలయం... కరోనా. ఆ కరోనా కష్టాలను దృశ్యీకరిస్తూనే, ఆ కష్టాల వెనుక కుట్రలన్నాయన్నారు. ఆ కుట్రలను భగ్నం చేసేందుకు పోరుబాటే శరణ్యమని కవితాగ్నిని రగిలించారు. అందుకు అవసరమైన ఆలోచనా బీజాలను నాటేందుకు ప్రయత్నించారు. చివరికి అజేయుడు మానవుడేనన్న భరోసా ఇచ్చేందుకు బాధ్యత వహించారు.

వ్యక్తిగతంగా చూస్తే ఈ కరోనా వల్ల కవి తన సహచరులనూ, కుటుంబీకులనూ కోల్పోయిన విషాద సందర్భం. అంతటి ఉద్విగ్న స్థితిలో కూడా తనని తాను నిలబెట్టుకోవడమే కాకుండా, తన వాళ్లనీ నిలబెట్టేందుకు ఓ కార్యకర్తగా తాను పొందిన చైతన్యాన్ని దన్నుగా నిలబెట్టారు. వారికి కొండంత అండగా నిలిచారు. ఇక, మహిళల కోసమూ, మీడియా మిత్రులు కోసమూ, తెలుగు భాష కోసమూ, గిడుగు కోసమూ, చేగువేరా కోసమూ, సాహిత్య మిత్రులు రామతీర్థ, జగద్ధాత్రి కోసమూ ఆయన కనబరిచిన స్పందనలు ఎంతో ఆలోచనాత్మకంగానూ, ఆర్తితోనూ నిండిఉన్నాయి. వీటన్నింటిలోనూ సాధారణ కవిగానే ఈ కవి మనకి కనిపిస్తారు. వాటిని చదివినప్పుడు అనిపిస్తారు.

అక్కడికే కవి పరిమితం కాలేదు. ఆ పుస్తకాన్నీ పరిమితం చేయలేదు. ప్రభువుల విధానాల మీదకి దృష్టిని కేంద్రీకరించారు. ప్రశ్నించే గొంతులను బంధీలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ ఆగ్రహం చెందారు. రైళ్లను, ఉక్కు కర్మాగారాన్నీ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారంటూ కన్నెర్ర జేశారు. ఇక్కడే కవి తనలో ఉన్న రాజకీయ దృక్పథాన్ని ప్రదర్శించారు. ఇతర దేశాల్లో జరుగుతున్న పరిణామాల మీద తనదైన వాణిని వినిపించారు. ఈ కవితలన్నింటినీ మదిస్తే కవి శంకర్రావుని వ్యక్తిగతంగా ఎరగని వారికి సైతం ఆయనేమిటో ప్రస్ఫుటమవుతుంది. పట్టి చూపుతుంది.

ముఖచిత్రం, పుస్తక రూపకల్పన ఎంతో బాగా వచ్చింది. అందుకు తగ్గట్లుగా కవితా కూర్పు ఉంటే బాగుండేది అనిపించింది. కొన్ని కవితలు రీ డిజైన్ చేయాలనిపించింది. 'శ్రమ సౌందర్యం', 'మట్టి' వంటి కొన్ని పదాలు విరివిగా వాడడం కవితావేశానికి స్పీడ్ బ్రేకర్ అయ్యిందనిపించింది. కొన్ని పదాల కూర్పు అసందర్భోచితంగా తోచింది. ఇవన్నీ కూడా చిన్నచిన్న లోపాలే. ఆ లోపాలను తగ్గించుకోవడం కాలక్రమంలోనే ఎవరికైనా సాధ్యపడుతుంది. గతంతో పోల్చినప్పుడు కవి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. అదే సందర్భంలో స్వతహాగా రాజకీయ కార్యకర్త అయిన కవి ఈ పుస్తకంలో తన కార్య స్థలానికి వెలుపులే ఉండడం వెలితిగా అనిపించింది. 20 ఏళ్లకి పైగానే కార్మిక వర్గానికి నాయకత్వం వహిస్తున్న ఆయన ఆ స్థానం నుంచి తాను చూసిన కొత్త జీవితాలనూ, వాటి వెనుక గల కార్యకారణ సంబంధాల గురించి ఎవరూ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అంతటి అనుభవశాలి, ఆచరణ వాది అయిన కవి వ్యవసాయంలో 'కూలీ'ని, వలస వచ్చి వివిధ పనుల్లో జమ అయిన 'శ్రామికు'ల జీవితాలను తడిమేందుకు వీలు కల్పించుకోకపోవడం ఎందుకనో సముచితం కాదనిపించింది. అందరూ నడిచే దారిలోనే సంకలనం రూపకల్పన చేసే స్థితి నుంచి నిర్దిష్ట అంశాల మీద భిన్న కోణాలను దర్శించే స్థితికి, దర్శింపచేసే స్థితికి ఈ కవి చేరాల్సి ఉందనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న గీతల మధ్యన కాకుండా, ఆ గీతలను అధిగమించేందుకు చేయాల్సిన సాధనా, ప్రయత్నమూ ఇంకా మిగిలే ఉందనేది ఆయన సైతం కాదనరనిపిస్తుంది. ■


## సాహిత్యప్రస్థానం


విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**

**వివరాలకు 94900 99057 ను**

**సంప్రదించండి.**




# చదవాల్సిన కథలు 'షేమ్..షేమ్...'

- పి.సత్యవతి

రెండు కవితా సంకలనాలతో శక్తిమంతుడైన కవిగా గుర్తింపు తెచ్చుకున్న దేశరాజు రెండవ కథా సంకలనం 'షేమ్.. షేమ్.. పప్పీ షేమ్!'. బ్రేకింగ్ న్యూస్ పాఠకురాలిగా దేశరాజు కథా కౌశలం గురించి తెలుసు. కవిత్వం అంత పదునుగా కథ చెప్పడం కష్టం. కవిత్వం తాకినంత సూటిగా హృదయాన్ని కథ తాకడం కష్టం. అయితే రెండు ప్రక్రియల్లోనూ నైపుణ్యం సాధించినవారు లేకపోలేదు. అలా కవిగా కథకుడిగా తనకొక స్థానాన్ని దేశరాజు సాధించగలడని అతను ఎన్నుకున్న వస్తువులు, చూసే చూపు తెలుపుతున్నాయి. ఈ కథల్లో నాస్టాల్జియా పలవరింత, అప్పుడదొక స్వర్గం అనే కాలయంత్ర ప్రయాణం, ఆదర్శాల ఆకాశయానం, గంభీర వుపన్యాసాల వరదా లేవు. ఇది వర్తమాన సమాజ చిత్రపటం. రచయిత తరపున, మనం ఎలా వుండాలో చెప్పే తీర్పులూ వుంటూన్న పరిస్థితిపై ఘాటు విమర్శలు లేవు. "ఇలా వున్నాం కనుక ఎలా వుండాలో తేల్చుకోండి" అని పాఠకుల వివేకాన్ని గౌరవిస్తాడు. అది మంచి లక్షణం.

వ్యక్తిత్వ నిర్మాణకాలంలో ఏర్పడి నిలిచిపోయిన ఆదర్శ చట్రంలో ఇమిడి వుండడం వల్ల సమాజానికి చేయగల మేలు, కాలం తెచ్చిన మార్పులకు అనుగుణంగా జీవించడం వల్ల ఏమాత్రం చెయ్యలేమా? మధ్యేమార్గం లేదా? ఎవరి మటుకు వారు తమ తమ సుఖసౌధాలకు అలవాటు పడినప్పుడు సమాజాన్ని పట్టించుకునేదెవరు? మనమటుకు మనం మన సిద్ధాంతాలను అనుసరించే జీవనశైలి ఏర్పరుచుకుని బతికినంత మాత్రాన సమాజానికి వొరిగేది ఏమిటి? మన ఆచరణ కనీసం కొందరికైనా మార్గదర్శకం కావాలి కానీ మనని చూసి మెచ్చుకుంటే చాలా? లేదా మనకి మనం నిజాయితీగా వున్నామనే ఆత్మ సంతృప్తి చాలా? మారిన ప్రపంచ స్థితిగతుల వేగానికి కొట్టుకు పోకుండా నిలబడగల స్థిమితం ఎంతమందికి సాధ్యం? అరచేతిలోకొచ్చిన సాంకేతిక సౌకర్యాలు జీవిత గమనాన్ని సులభతరం చెయ్యడంతోపాటు అనేక చాపల్యాలకు దారితియ్యడాన్ని నిలువరించడం సాధ్యమా?

ఇంటిపని స్త్రీలదే అనే సంప్రదాయం ఇంకా చెల్లుబడి అవుతూ వుండగా, 'ఉద్యోగం పురుష లక్షణం' అనే నానుడిని ఆర్థిక స్థితి గతులు , స్త్రీల స్వాతంత్ర్య ఆకాంక్ష కలసి 'ఉద్యోగం మనిషి అవసరం'గా మార్చాయి. అయితే మనుషులందరికీ ఇంటా బయటా కనీస సౌకర్యాలు సమానంగా లేవు. ఇంట్లో శ్రమ విభజన సమానంగా లేదు. ఈ విషయాన్ని అర్థం చేసుకుని సహచరితో పని పంచుకునే పురుషులను ఎగతాళి చెయ్యడం విషయంలో స్త్రీలు కూడా మారకపోవడం ఆశ్చర్యం.

వయోభేదం లేకుండా స్త్రీలపై హత్యాచారాలు, ఆ విషయం లో సమాజం చేసే విక్టిమ్ బ్లేమింగ్ మనకి కొత్త కావు. ఈ భయానక బీభత్స స్థితిలో స్త్రీలే తమను తాము నిలబెట్టుకోడానికి సాంకేతికను ఉపయోగించుకోడం నేర్చుకోడమే కాదు, మగపిల్లల పెంపకంలో మార్పు రావాలి. ఇదంతా జరగాలంటే కుటుంబ సభ్యుల మధ్య సంభాషణకి సమయం వుండాలి. అది వుండాలంటే బతుకులో స్థిమితం వుండాలి. అది వుండాలంటే ఆర్థిక వెసులుబాటు వుండాలి. ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థలో ఇది ఎలా సాధ్యం? ఎప్పటికి సాధ్యం? ఎవరి వల్ల సాధ్యం?

అన్నీ అమరిన అరచేతిలోకి వయసుతో సంబంధం లేకుండా సౌకర్యాలతో పాటు చాపల్యాలు కూడా తెస్తున్న సంకేతిక పరిజ్ఞానిదా తప్పు? దాన్ని సరిగ్గా ఉపయోగించుకోలేని మూర్ఖ మానవులదా? యువతతో ఆడుకుంటున్న స్వార్థపరులదా? గంభీరమైన విషయాలతో పాటు హాస్యంతో కూడిన అవాస్తవ కథలు రెండింటితో పద్దెనిమిది కథల ఈ కదంబం సరళమైన శైలిలో వుండి చదివిస్తుంది, ఆలోచించమంటుంది. ■



# సాహిత్యం అనేది చాలా సీరియస్ మ్యాటర్!

- ప్రముఖ నవలా రచయిత డా. డి (అంపశయ్య) నవీన్

**"వర్ధమాన రచయితలు మొదట, సాహిత్య ప్రక్రియల గురించి బాగా అధ్యయనం చెయ్యాలి. రాసే విషయం ఏదైనా మీ అనుభవంలో నుంచి రావాలి. మీ అనుభవానికి సాహిత్యకతను తీసుకురావడం ఎలాగో తెలుసుకోవాలి. అధ్యయనం – ఆవేశం అనేవి రెండూ సమపాళ్ళలో కుదిరినప్పుడు మంచి రచనలు చెయ్యగలుగుతారని తెలుసుకోవాల"న్నారు ప్రముఖ రచయిత డా.డి.(అంపశయ్య) నవీన్. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరఫున నవీన్‌తో ముచ్చటించారు. ఆ ముఖాముఖి ఇదీ...**

**మొదటగా మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి క్లుప్తంగా చెప్పండి.**

(నవ్వుతూ) వీలయినంత క్లుప్తంగా చెప్తాను. నా బాల్యం ఎక్కువ జనగాం జిల్లా, పాలకుర్తి మండలంలోని వావిలాల అనే గ్రామంలోను, సూర్యాపేటకు దగ్గరగా ఉన్న మా అమ్మమ్మ గారి గ్రామం మద్దిరాలలోనూ జరిగింది. మాది వ్యవసాయ కుటుంబం. బాల్యం తోటి పిల్లలతో రకరకాల ఆటలతో హాయిగా సాగింది. చిన్న వయసు నుండి హరికథలు, బుర్రకథలు, వీధిభాగోతాలు చూడడం నాకు ఇష్టంగా ఉండేది. ఆరోజుల్లో ఇటు సూర్యాపేట కానీ అటు జనగాం కానీ భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా నడచిన పోరాటకేంద్రాలుగా ఉండేవి. ఈ పోరాటాలలో పాల్గొనే వాళ్ళను 'సంగపోళ్ళు' అనేవారు. వాళ్ళు చెప్పే బుర్రకథలు, పాడే పాటలు నాకెంతో ఉత్తేజంగా ఉండేవి. సంగపోళ్ళ గురించి మా ఊరి ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటూ ఉంటే సరదాగా వినేవాడిని.

మా ఊర్లో ఒక ప్రభుత్వ పాఠశాల ఉండేది. నేను రెండవ తరగతి చదువుతున్న రోజుల్లోనే తెలంగాణాలో రజాకార్ల ఆగడాలు ప్రారంభమయ్యాయి. వాళ్ళు గ్రామాలపై దాడి చేసి ఎంతో మందిని చంపేసి వెళ్ళిపోతూ ఉండేవాళ్ళు. వాళ్ళ వల్ల ప్రమాదం ఉందని భావించిన మా వాళ్ళు ఆంధ్రా ప్రాంతమైన కృష్ణా జిల్లా, బందరు దగ్గర ఒక పల్లెటూరులో కొంతకాలం ఉండిపోవలసి రావడంతో నా చదువుకు అంతరాయం కలిగింది. పరిస్థితులు చక్కబడ్డాక మేం మళ్ళీ మా ఊరు చేరుకున్నాం. 3, 4 తరగతులు కొడకండ్లలో, 5 కొరివి గ్రామంలో, 6,7 తరగతులు తిరుమలగిరి లో పూర్తిచేసి 8వ తరగతి నాటికి వరంగల్లు చేరుకున్నాను. అక్కడ ఏ.వి. హైస్కూల్లో నా సాహిత్య జీవితం ప్రారంభమైందని చెప్పాలి. అక్కడ విశ్వనాథ వెంకటేశ్వర్లు (విశ్వనాథ సత్యనారాయణ గారి తమ్ముడు) గారి శిష్యరికం ప్రారంభమయింది. ఆయనకు కొన్ని తేటగీతి పద్యాలు, కథలు రాసి చూపించే క్రమంలో ఆయన నీ కవిత్వం కంటే కథలే బాగున్నాయని చెప్పి కథలు రాసే దిశగా ప్రోత్సహించారు.

స్కూలు ఫైనల్ అయ్యాక మా కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల మా నాన్నగారు పై చదువులకు పంపలేదు. ఏదన్నా ఉద్యోగం చూసుకోమన్నాడు. ఒక చిన్న ఉద్యోగం కొంతకాలం చేసినా ఇష్టంలేక మధ్యలో వదిలేశాను. మరుసటి సంవత్సరం వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరాను. ఇక్కడ చదువు తున్నప్పుడే మేధోపరిధులు విస్తరించాయి. ఇరివెంటి కృష్ణమూర్తి, జి.వి.సుబ్రహ్మణ్యం, వేటూరి ఆనందమూర్తి లాంటి మహామహుల శిష్యరికం లభించింది. అక్కడ బి.ఎ పాసయ్యాక హైదరాబాదు ఉస్మానియాలో ఎం.ఎ చేరాను. ఆరోజుల్లోనే 'అంపశయ్య'కు బీజం పడింది.

**మీకు తెలుగు భాష, సాహిత్యం వేపు మక్కువ ఏ వయసులో కలిగింది?**

నాకు 14 ఏళ్ల వయస్సులో 1954లో వరంగల్లు ఏ.వి.హైస్కూల్లో చదువుతున్నప్పుడు తెలుగుభాష, సాహిత్యంపై మక్కువ ఏర్పడింది. 1958లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చదువుతున్న రోజుల్లో, ఆ కాలేజీలో జరిగిన కథల పోటీలో 'చితికిన జీవితం' అన్న నా కథకు మొదటి బహుమతి లభించింది. దాన్ని కాలేజీ వారు వార్షికోత్సవ సందర్భంగా

వెలువడే మ్యాగజైనులో ప్రచురించారు. అదే అచ్చులో వెలువడిన నా తొలి కథ.

**ఉన్నత పాఠశాలలో చదువుతున్నపుడు ఓ లిఖిత మాసపత్రికకు సంపాదకత్వం వహించారట? దాని వివరాలు ...**

8వ తరగతిలో వరంగల్లులో ఏ.వి. హైస్కూలు ఉపాధ్యాయులు విశ్వనాథ వెంకటేశ్వర్లు గారు ఒక లిఖిత మాసపత్రిక ప్రారంభించి, దానికి నన్ను ఎడిటరుగా నియమించారు. దానిలో విద్యార్థుల రచనలు ఉండేవి.

**మిమ్మల్ని ప్రభావితం చేసిన రచయితలు, కవులు ...**

నేను వరంగల్ కాలేజీలో చదువుతున్న రోజుల్లో శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు రచనలను బాగా చదివాను అనడంకంటే అధ్యయనం చేశానని చెప్పడం సబబు. ఈ ముగ్గురూ నన్ను ఎక్కువ ప్రభావితం చేశారు.

**1975లో వచ్చిన మీ 'విచలిత' నవల స్త్రీవాదాన్ని సమర్థించేదిగా ఉంది. అప్పటికి స్త్రీవాదం అంకురదశలో కూడా లేదనుకుంటాను.**

విచలిత నవలను నేనొక యదార్థ సంఘటన ఆధారంగా రాశాను. మీరన్నట్టు అప్పటికి స్త్రీవాదం అంకురదశలో కూడా లేదు కాని, నేను చలంగారి రచనల నుంచి స్త్రీలపట్ల గొప్ప సానుభూతిని అలవరచుకున్నాను. నా అనుభవంలో కొచ్చిన ఒక సంఘటన పట్ల స్పందించి మధ్య తరగతి కుటుంబాల్లో జరుగుతున్న అన్యాయాలను చిత్రిస్తూ ఆ నవల రాశాను.

**మీరు కథల కంటే నవలలే ఆసక్తికరంగా రాయగలరనీ, మీ కథల్లో వస్తువైవిధ్యం తక్కువనీ కొందరు పాఠకులు అనడం విన్నాను. దీనిపై మీ స్పందన?**

మీరనే పాఠకులెవరో నాకు తెలియదు. 'మీ కథలు చాలా బావుంటాయి' అని ప్రశంసించిన పాఠకులు ఎందరో ఉన్నారు. వస్తువైవిధ్యం ఉండదు అనే మాట అజ్ఞానంతో కూడుకున్నది. నా కథల్లో గాని, నవలల్లో గాని ప్రధానంగా ఉండేది పాత్రల మనస్సులను విశ్లేషించటం. ఈ తరహా సాహిత్యాన్ని మన తెలుగు విమర్శకులు గుర్తించారు. పాశ్చాత్యదేశాల సాహిత్యంలో ఈ తరహా రచనలకు చాలా ప్రాముఖ్యం ఉంది.

**అంపశయ్య, ముళ్ళపొదలు, అంతస్స్రవంతి ఈ మూడు నవలల్లోనూ 'రవి' కథానాయకుడు. ఆ పేరు యాదృచ్ఛికమా?**

ఆ మూడు నవలలు ఒకదానికొకటి సీక్వెల్స్. ఇంగ్లీషులో 'ట్రయోలజీ' అంటారు. తెలుగులో చెప్పాలంటే 'త్రయనవలలు' అనాలి. మూడు నవలలో ఉన్న కథానాయకుని పేరు సాధారణంగా ఒకటే ఉంటుంది. అలా ఉండకపోనూవచ్చు.

**మీ రచనల్లో హాస్యం పాళ్ళు తక్కువేనని పాఠకులు అంటారు. సీరియస్ రచనలే మీ ధ్యేయమా?**

నేను కావాలని పట్టుబట్టి ముళ్ళపూడి వెంకటరమణ గారిలా హాస్య రచనలు చేయలేదు. కానీ, అంపశయ్య, దాగుడుమూతలు, మనోరణ్యం, ప్రయాణంలో ప్రమదలు నవలలోని పాత్రల్లో బోలెడు హాస్యం ఉంది. 'సాహిత్యం అనేది చాలా సీరియస్ మ్యాటర్' అనుకునే వాళ్ళలో నేనొకణ్ణి.

**మీ అంపశయ్య నవల అచ్చుకాక మునుపే కాళోజీ లాంటి పెద్దల ప్రశంసలు పొందినా, చాలామంది పత్రికల వాళ్ళు ప్రచురించడం కుదరదన్నారట. నిజమేనా?**

నిజమే! ఆరోజుల్లో ప్రచురింపబడుతున్న నవలలకున్న లక్షణాలేవీ అంపశయ్యలో లేవు కదా! నాయికా నాయికలు ప్రేమించుకోవడం, వాళ్ళమధ్య అపార్థాలు తలెత్తి విడిపోవడం, మళ్ళీ కలుసుకోవడం, లాంటి వాతావరణం అసలు లేకపోవటం. అందుకనే కొందరు 'ఇదేం నవల?' అన్నారు.

**అస్తిత్వవాదానికి గానీ, అధివాస్తవిక వాదానికి గానీ, చైతన్య స్రవంతితో లింకుందంటారా?**

చాలా ఉంది. దాన్ని వివరించాలంటే ఒక పెద్ద వ్యాసమే రాయాల్సి ఉంటుంది. అది ఈ సందర్భంలో చెప్పడం కుదరదు.

**అంపశయ్యలో 'రవి' మధ్యతరగతికి చెందినవాడు. కానీ 'దూడ'ను అమ్ముకుంటే తప్ప ఫీజు కట్టలేని దుర్భర దారిద్ర్యం కల్పించాల్సినంత అవసరం ఉందంటారా?**

రవి వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. ఆ కుటుంబానికి భూములున్న మాట నిజమే. కానీ సాగుచేసుకోవాలంటే నీళు ్ళండాలి. రవి ఊర్లో చిన్నచిన్న చెరువులున్నాయి. వర్షాలు పుష్కలంగా కురిస్తే తప్ప ఆ చెరువులు నిండవు. వరుసగా మూడు సంవత్సరాలు సకాలంలో వర్షం కురియకపోతే వ్యవసాయదారులకు తీవ్రమైన దారిద్ర్యం వెంటాడుతుంది. తెలంగాణాలో ప్రధాన సమస్య నీళ్ళు లేకపోవడమే కదా! మా నాయనగారికి వ్యవసాయ భూములు చాలా ఉండేవి. కానీ ఆయనెప్పుడూ అప్పుల్లోనే ఉండేవాడు. నేను ఎం.ఎ పాసై ఉద్యోగం చేస్తున్నప్పుడు, మా తమ్ముడు కూడా ఉద్యోగం చేస్తున్నప్పుడు, కొంత పైకం ఇంటికి పంపే వాళ్ళం. తర్వాత మా ఆర్థిక పరిస్థితి కొంత మెరుగైంది. మీకొక విషయం చెప్పాలి. అంపశయ్య నవలలో కల్పనలు చాలా తక్కువ. దూడను అమ్మాల్సిన పరిస్థితి నిజంగా ఏర్పడింది.

**అంపశయ్యలో 'రత్తి' పాత్రకు గతంలో మీ ఊరులోని 'లక్ష్మి' అనే ఒక యువతి ప్రేరణని విన్నాను. రవికి సామాజిక స్పృహ ఉంది అనడానికి మాత్రమే రత్తిపాత్ర నవల్లో చోటుచేసుకున్నదని, రత్తి పాత్ర లేకపోయినా నవలకు వచ్చే నష్టం ఏమీ లేదని విమర్శకులు అనడంతో మీరు ఏకీభవిస్తారా?**

ఏకీభవించను. అంపశయ్యలోని పాత్రలన్నీ చాలా సహజంగా ఆ నవల్లో ఒదిగిపోయాయి. రవిలో అపరాధభావం అంత తీవ్రంగా ఎందుకేర్పడిందో చెప్పడానికే రత్తిపాత్ర అవసరమైంది. నవల రాస్తున్నప్పుడు ఈ పాత్ర అవసరమా? కాదా? అని నేను ఆలోచించలేదు. ఆయా పాత్రలన్నీ స్పాంటేనియస్‌గా అంటే అప్రయత్నంగా వచ్చినవే.

**జేమ్స్ జాయిస్ 'యులీసిస్' నవల్లో 18 గంటల కథాకాలాన్ని**

**తీసుకుంటే మీరు అంపశయ్యలో 16 గంటల కథాకాలాన్ని అనుసరించారు. జాయిస్ ప్రభావం మీ నవలపై ఉందనుకోవచ్చా?**

ఆ ప్రభావం ఇసుమంత మాత్రమే! అసలు అంపశయ్య సగం నవల రాసేవరకూ నాకు జేమ్స్ జాయిస్ గురించికానీ, ఆయన రాసిన యులీసెస్ గురించికానీ తెలీదు. జాయిస్ యులీసెస్ నవలలో చేసిన ప్రయోగం మహాద్భుతమైనది. దాన్నెవరూ అందుకోలేరు. అలాంటి రచన నభూతో న భవిష్యతి.

**గోపీచంద్, బుచ్చిబాబు, పరిమళా సోమేశ్వర్, రావి శాస్త్రి, వడ్డెర చండీదాస్ లాంటి రచయితలు చైతన్య స్రవంతి శిల్ప విషయంలో, అంత పరిణతి సాధించలేకపోయినా, అవన్నీ 'అంపశయ్య నవలకు వేసిన ప్రథమ సోపానాలు' అనుకోవొచ్చా?**

గోపీచంద్, బుచ్చిబాబు, రావి శాస్త్రి గార్లు పూర్తి చైతన్య స్రవంతి శిల్పాన్ని వాడకపోయినా, దాని లక్షణాలు కొన్ని వాళ్ళ నవలలో ఉన్నాయి. పరిమళా సోమేశ్వర్, వడ్డెర చండీదాస్ గార్ల రచనలు అంపశయ్య తర్వాతే వచ్చాయి. ఏ రచనయినా అంపశయ్యకు ప్రథమ సోపానం అని అనలేము.

**అరసం, విరసంలో ప్రముఖ పాత్ర పోషించిన త్రిపురనేని మధుసూదనరావు 'ప్రయోగం ఒక పిచ్చి' అనడంపై మీరెలా ఫీలయ్యారు?**

ఆయనలా అనడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఎందుకంటే చైతన్యస్రవంతి శిల్పానికి సామాజిక ప్రయోజనం లేదన్నది ఆయన అభిప్రాయం. కానీ, ఆ శిల్పంలో కూడా సామాజిక ప్రయోజనం ఉంటుందన్న సత్యాన్ని నేను అంపశయ్య ద్వారా రుజువు చేశాను.

**'చైతన్యస్రవంతి' లాంటి, ప్రయోగాల విషయంలో కథ పూర్తిచేసిన తర్వాత పాఠకునిలో ఒక ఎపిఫనీ (సాక్షాత్కారం) ఉండాలన్న జేమ్స్ జాయిస్ మాట సాధ్యం కాదేమో!**

ఎందుకు సాధ్యం కాదు? సాధ్యమౌతుందనడానికి నా రచనలే కొన్ని ఉదాహరణలు.

**అంపశయ్య నవలకు బహుళ ప్రాచుర్యానికి కారణం విమర్శకులా? పాఠకులా?**

నిస్సందేహంగా పాఠకులే! నన్ను రచయితగా బతికించడానికి కారణం పాఠకులే.

**వర్ధమాన రచయితలకు మీరిచ్చే సూచనలు/ సలహాలు ఏమిటి?**

రాయాలన్న ఉత్సాహం వున్న ఉన్న వర్ధమాన రచయితలు మొదట, సాహిత్య ప్రక్రియల గురించి బాగా అధ్యయనం చెయ్యాలి. రాసే విషయం ఏదైనా మీ అనుభవంలో నుంచి రావాలి. మీ అనుభవానికి సాహిత్యకతను తీసుకురావడం ఎలాగో తెలుసుకోవాలి. రాసేది ఏదైనా మీ హృదయంలోనుంచీ సహజంగా రావాలి. అధ్యయనం– ఆవేశం అనేవి రెండూ సమపాళ్ళలో కుదిరినప్పుడు మంచి రచనలు చెయ్యగలుగుతారని తెలుసుకోవాలి. ■



## కైతా ... శత్రువే!

రెప్పలను కళ్ళకు బిగించి తాళం వేసినా
నిద్ర రానీయని ఆలోచనా శబ్దాలు
నిశాచరులై తిరుగుతూనే ఉంటాయి!
నిండా మునిగిపోయి
రేపటి వెలుతురుని దిగులు కళ్ళు వేసుకొని
చూసే స్థితి తూగుకి అడ్డు తగులుతూనే ఉంటుంది.

ఎండిన కాయాన్ని ఈడ్చుకుంటూ
దుఃఖపు వలలో చిక్కి ఇంకిపోయిన మనిషికి
కునుకు ఆమడ దూరంలోనే
దోబూచులాడుతూ ఉంటుంది ...

ఇప్పుడిది సహజమే అయినా
నమ్మి మోసపోయిన మనసు కుతకుత ఉడికిపోయి
మూసిన రెప్పలకు నిదురపూత పూయదు.

బాధే కాదు; నెమరేసుకునే
ఆనంద క్షణాలు సైతం కన్మోద్పుకు శత్రువే..!

అవేనా...
మండే కవి సూర్యుడు ఒంపిన అక్షర కిరణాలు
కళ్లలోనుంచి పయనమై మెదడు పొరలను
ధీ కొట్టిన్నప్పుడు కూడా...
నిద్రాదేవి అభయమియ్యదు ..!

**- అవ్వారు శ్రీధర్‌బాబు**

**85001 30770**



# నిర్ణయం

- భమిడిపాటి గౌరీశంకర్
94928 58395

**"జీవితం సుఖమయం కానీయండి, దు:ఖపూరితం కానీయండి. జీవితం ఒక అద్భుతమైన వ్యాపకం. ఇది నిత్యనూతనమైన వ్యాపకం".**

**రా**త్రి పది గంటల సమయం. జనవరి నెల.. చలి ఎక్కువగానే ఉంది. ఫోన్ మోగింది. రామలక్ష్మి. రాజమండ్రి ఓ డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా చేస్తోంది. నేనూ, రామలక్ష్మి, శుభ, కోదండ రామయ్య మేమంతా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తొంబైలో విద్యార్థులం.

"చెప్పు" అన్నాను ఆనందంగా.

"ఏముందీ... మా కళాశాలలో దళిత సాహిత్యంపైన ఓ జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నాం. నువ్వో సెషన్ తీసుకోవాలి. మా ఇంట్లోనే ఉండాలి సుమా.. అభ్యంతరం లేదుగా..." అంది గొంతులో ఏదో తెలియని సందిగ్ధత... వారి 'కులం' నాకు గుర్తు చేస్తూ.

"మన స్నేహంలో ఏనాడైనా నేనలా ప్రవర్తించానా... ఇప్పుడు కొత్తగా అడుగుతున్నావేమీ?" అన్నాను.. కాస్త కోపంగానే.

"ఆ.. కోపగించుకోకే తల్లి... అలా అలవాటు చేసింది నా చుట్టూ ఉన్న వ్యక్తుల సమూహం..." అంది.. తన గొంతులో ఏదో తెలియని నిస్సహాయత.

"నేను వచ్చి మీ ఇంట్లోనే రెండు రోజులుంటాను సరేనా.." అన్నాను. తరువాత ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. శుభ, కొమరయ్య కూడా రాజమండ్రిలో ఉన్నారని చెప్పింది. నాకు ఎంతో సంతోషమనిపించింది. అందరం దాదాపు పాతికేళ్ళ అనంతరం కలుస్తున్నాం.

■■■

రాజమండ్రి.. గోదావరి గాలి.. ఒకానొక సాహిత్యపు తాత్వికత... గోదావరి నదిలో నుంచి వినవచ్చు.. నీటి ప్రవాహపు జీవన విధానపు ఔన్నత్యపు పాఠం. ఏదో చెవిలో గుసగుసలు పోతున్నట్టుగా నాకు ఉంటుంది.

శీతాకాలపు తడిలో.. ఆ తల్లి ఒడిలో... మంచు దుప్పటి అంచున... ఆ రాత్రి ఎనిమిది గంటల వేళ... నా ఒడిలో తలపెట్టి పడుకున్న రామలక్ష్మి పసితనం.. నా పెద్దరికాన్ని మరింతగా పెంచింది.

"అవును... వెన్నెల ఎవరు? నన్ను బాగా కుదిపింది.. ఆమె పత్రసమర్పణ పద్ధతి. తనను నేను ఎక్కడో చూసాను. గుర్తుకు రావటం లేదు..." అని అడిగాను. వెన్నెల ఉదయం నా సెషన్‌లోనే ముల్కరాజ్ ఆనంద్ రాసిన తొలి దళిత నవల 'అన్ టచ్‌బుల్' పైన అద్భుతంగా మాట్లాడింది. ఆమెను చూస్తే.. నన్ను నేను చూసుకున్నట్టనిపించింది.

"రేపు రాత్రికి మనం. ఒకరింటికి వెళదాం. అప్పుడన్నీ నీకు తెలుస్తాయి. ఇప్పుడు నీ సంగతులు చెప్పు" అంది. తన గురించి మధ్యాహ్నం లంచ్ టైమ్‌లోనే మాట్లాడుకున్నాం. భర్త.. ఇద్దరు పిల్లలు... ఇద్దరూ అమ్మాయిలే.. హేపీగా ఉన్నానంది. కానీ, కాస్త నల్లగా, సన్నగా అయిపోయింది. ఏంటీ ఈ అవతారం అన్నాను" చూడగానే.

"తన స్వేచ్ఛను పణంగా పెట్టి కుటుంబ సంబంధమైన ఆనందాన్ని పొందడంలో స్త్రీ సౌందర్యం ఆవిరైపోతుంది. సరే కానీ, ఏభైలో కూడా నీలో ఇంతందం ఎలా సాధ్యం? సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే ఇద్దరు పిల్లలను పెట్టుకొని. నాకూ చెబుదూ, నీ గ్లామర్ రహస్యం..." అంది నా బుగ్గ మీద ముద్దు పెడుతూ.

"నీవేమీ మారలేదు. అదే అల్లరి. మీ ఆయన ఎలా వేగుతున్నారే తల్లీ" అన్నాను టీజింగ్‌గా. ఇంతలో వేడి వేడి జొన్నపొత్తుల వాసన వచ్చింది. అమ్ముతున్న పిల్లాడిని పిలిచి, రెండు తీసుకున్నాను. ఇద్దరం తింటున్నాం. దూరంగా పడవల అలికిడి... ఇస్కాన్ టెంపుల్ నుంచి వస్తున్న చిరుగంటల శబ్దం... రైలు కమ్ రోడ్డు బ్రిడ్జి నుంచి రైలు వెళుతున్న అలికిడి... వాహనాల హారన్స్ అలజడి...

"అవును.. నీకేదో సమస్య అన్నావు. భర్త చనిపోయిన, పిల్లలు లేని ఇంట్లో ఒంటరి ఆడది... అదీ ఉద్యోగం చేస్తున్నదంటే.. అందరూ ఆశగా చూస్తారే...!? అదేనా నీ సమస్య.. లేక శుభ మాదిరి ఏమైనా కొమరయ్యలా మా కులం వారు ఎవరైనా..." అంది అర్థోక్తిగా, ఒక్క నిముషం ఆగి .. "జోసఫ్ అని ఎవరి గురించో చెప్పావు. ఏమా కథ..." అనడిగింది. ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"రేపు బయల్దేరే ముందు చెబుతానులే. ఇప్పుడు జొన్నపొత్తులు పూర్తి చేద్దాం" అని దాట వేశాను.

కొన్ని వైవాహిక జీవితాలు విఫలం కావటానికి ప్రధాన కారణం... భార్యాభర్తల మధ్య ప్రేమలేకపోవటం కాదు; స్నేహం లేకపోవటం. అదే నాకూ నా భర్తకు మధ్య దూరాన్ని పెంచింది. జోసఫ్‌ను నాకు పరిచయం చేసింది. ఇది మా ఇంట్లో అందరికీ తెలిసింది. కానీ అందరం.. పరువు మర్యాదల ముసుగులో ఆనందంగా బతికినట్లు నటించాం. హఠాత్తుగా నా భర్తమరణం దు:ఖాన్ని మిగిల్చింది. పిల్లలు చేతకంది వచ్చారు. నేను నా రాబడి కన్నా కాస్త రిచ్‌గానే బతకాలను కున్నాను. కానీ, తగిన ఆర్థిక వనరులు భర్త దగ్గర లేవు. ఎన్నో వ్యాపారాలు చేశాడు.. కానీ, నష్టమే మిగిలింది. ఆ సమయంలోనే 'జోసఫ్' పరిచయమయ్యాడు. కలక్టరాఫీసులో సీనియర్ అసిస్టెంటుగా చేసేవాడు. ప్రస్తుతం రిటైరయ్యాడు. అతనికి భార్యా పిల్లలున్నారు. అతను నా కుటుంబ స్నేహితుడుగా ఉన్నాడు." చెప్పటం ఆపాను.

అర్థం చేసుకొంది. "సరే పద.. వెళదాం... వండుకొని తినాలి కదా" అంది. ఇంటికి చేరుకొని.. వేణ్ణీళ్ల స్నానం చేశాక మనసును ప్రశాంతంగా చేసుకొన్నాను.

■■■

మరుసటి రోజు సాయంత్రం నాలుగ్గంటలకే సదస్సు ముగిసింది. ఆరు గంటల సమయంలో రామలక్ష్మి భర్తకు ఫోన్ చేసి తను రాత్రికి రానని చెప్పింది. తరువాత దేవి చౌక్ మీదుగా జైలు రోడ్డు వైపు బండిని స్పీడ్‌గా పోనిచ్చింది. శీతకాలపు చలిగాలి రివ్వున తగులుతున్నది.

అరగంట తరువాత... ఓ ఇంటి ముందు ఆగింది. ఇంటి ప్రాంగణం చాలా బాగుంది. ఎక్కడి నుంచో సన్నజాజి, నైట్‌క్వీన్ వాసనలు.. మనసున మల్లెలు మాలలూగేనే... దేవులపల్లి వారు గుర్తుకొచ్చారు. రామలక్ష్మి డోర్‌బెల్ కొట్టింది.

'ఆ.. వస్తున్నా' అని స్త్రీ గొంతు. తలుపు తెరుచుకుంది. ఎదురుగా నా బాల్య స్నేహితురాలు .. శుభ. ఇద్దరికీ ఆశ్చర్యం.. ఆనందం. నన్ను గాఢంగా హత్తుకుంది. హృదయం చేసే కరచాలనమే కౌగిలింత.

ఆ రాత్రి భోజనాల దగ్గర శుభ మాట్లాడుతూ "నేను.. కొమరయ్యను పెళ్ళి చేసుకోవటం ఎవరికీ ఇష్టం లేదు.. కారణం మా కులాలని మీకు తెలుసు. కొమరయ్య పేదవాడు.. దళితుడు..." కాస్త ఆగి.. అతని ముఖంలోకి చూసింది. అతను చిరునవ్వుతో అన్నం తింటున్నాడు.

శుభ చెబుతోంది... : "ఆ తరువాత అతనికి మొదట గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం వచ్చింది.. పేదవాడి సంపద సమర్థతే మరి. ఇహ అక్కడి నుంచి ఒక్కొక్కరూ మా ఇంటికి రావటం ప్రారంభించారు. అతనిని నన్నూ వేరు చేయాలని చూసారు. ఈలోగా నా పి.హెచ్‌డి అయిపోవటం.. ఓ యూనివర్సిటీలో తాత్కాలిక ప్రాతిపదిక పైన ఉద్యోగం రావటం జరిగిపోయాయి. మాకు ఒక్క పాపే..." "ఇంతకీ... నీకేదో సమస్య అని రామలక్ష్మి ఫోన్ చేసింది.." అంది, కంచంలో చేతులు కడుగుకుంటూ.

ఇంతలో ఆమె ఫోన్ రింగయింది.

మాట్లాడింది.

"మా పాపే... వచ్చేసరికి ఆలస్యమవుతుందిట.." అంది.

అందరం డైనింగ్ టేబుల్ దగ్గర నుంచి లేచి పడక గదికి చేరాము. నేను, రామలక్ష్మి, శుభ ఒక గదిలో.

"నేను... ఓ సమస్యలో ఉన్నాను. సమస్యతో పాటు సహాయం కూడా కలిసే ఉంది మరి" అన్నాను నెమ్మదిగా.

ఇద్దరూ వైపు ఓసారి చూసి.. "నా భర్త మరణం.. పిల్లలు వారి దారి వారు చూసుకోవటం.. ఎందుకో ఒంటరితనం... భయం... దాదాపు పదేళ్లు కుటుంబ స్నేహితుడుగా ఉన్న జోసఫ్ సహజీవనం చేద్దామంటున్నాడు. భర్త ఉన్న సమయంలో మంచి మనిషిగా తెలుసు. కష్టానికి ఆదుకున్నాడు.. కానీ, ఈ ప్రపోజల్ ఎందుకో నన్ను భయపెడుతుంది.." అన్నాను. అలా అంటున్నపుడు నా గొంతులో సన్నని వణుకు నాకు

తెలుస్తోంది.

సన్నగా.. ఒ కన్నీటి తెర..

శుభ దగ్గరగా వచ్చి... మెల్లగా కౌగిలించుకుంది. వీపున మెల్లగా తట్టింది.. ఓ తల్లి స్పర్శ. ఒక మౌన ఆలింగనం విచార హృదయానికి వెయ్యి పదాల సాంత్వన.

శుభ మెల్లగా... "తమ బలహీనతలనే తమ ఆయుధంగా మలుచుకోనంతకాలం స్త్రీలు శక్తిమంతులు కాలేరు. తనకు లేని వాటి గురించి చింతించకుండా ఉన్నవాటిని గుర్తించి ఆనందించటమే తెలివైనవారు చేయాల్సిన పని... ఇది నీ జీవితం.. పిల్లలు వెళ్ళిళ్లు... మిగిలిన కర్తవ్యాలు కూడా నీకున్నాయి. ఆలోచించు. మేము చెప్పినంత తేలిక కాదు, నీవు ఆచరించటం. సహజీవనం తప్పా ఒప్పా అనే సందిగ్ధత నీది.. ఇంతకాలం మీరు చేస్తున్నదేమిటో నీవే ప్రశ్నించుకో.. పరస్పర వ్యక్తిత్వాల ఎదుగుదల మీద, మార్పుల మీద ప్రేమను వ్యక్తపరచే విధానాల మీద గౌరవమున్నప్పుడే ఇటువంటివి ముందుకు కొనసాగుతాయి. మనమంతా చివరి మజిలీ బాటసారులం. ఏది ఏమైనా.. నిన్ను నిరంతరం రక్షించుకోవటానికి... సహాయమందించటానికి.. ఇక్కడ మేమిద్దరం ఉన్నామనే విషయం మరిచిపోకు. ఇక్కడికి వచ్చేయి. ఆపాటి ప్రయివేటు ఉద్యోగం ఇక్కడ మేము చూసి పెడతాం. ఓకేనా.. ప్రశాంతంగా ఉండు. నీకు నచ్చిన నిర్ణయం తీసుకో.. దేనికైనా మా ఇద్దరి ఆమోదం ఉంటుంది. సరేనా..." అంది.

"దా... పడుకుందాం..." అంది.

ముగ్గురం ఒకే మంచం పైన. రామలక్ష్మి, శుభల మధ్య నేను. వారిద్దరి చేతులు నా మీద... దాదాపు రెండున్నర దశాబ్దాల తరువాత... ఇలా.. ఒకే మంచం మీద ముగ్గురం...

ఇంతలో తలుపు చప్పుడైంది.

పాప వచ్చినట్టుంది అంది శుభ.

'తనది నా పోలిక. నాలాగే పెంచాను' అని తలుపు తీసింది.

ఎదురుగా... వెన్నెల... చిరునవ్వుతో "ఆంటీ" అని నా దగ్గర కూర్చుంది.

నా కూతురిని చూసినట్టనిపించింది.

నా మనసులో సందేహాలు తీరిపోయాయి.

రేపు ఏమిటో... నిర్ణయించుకుంటాను. ■

> **"సమాజాన్ని అప్రతిష్ట పాలు చేసే పరిస్థితిని కళ్ల ముందర పెట్టి, నైతిక భావాల్ని, ఉన్నత ప్రమాణాల్ని ప్రాచుర్యంలోకి తేవడం కంటే– సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేమీ లేదు. "**
>
> **– గురజాడ**

## ఎత్తుకుపోయారా?

**మీ** తోటలోని పూలను
ఎవరో కోసుకుపోయారా
మీ అందమైన కలలను
ఎవరో కొల్లగొట్టారా?

అయినా కునుకు పట్టగానే
రెప్పలు కుప్పలు కుప్పలుగా
కమ్మని కలనేతల స్వప్నాలను
ప్రసవించడం మానవు కదా!
దృశ్యాలు హరివిల్లులై
హృదయంలో హోలీలాడడం ఆపవు కదా ...

ఓ కలమా, నీ సిరాచుక్కలు
పూలగుత్తులై అక్షయమై పూస్తూనే ఉంటాయి
అక్షరాల నెమళ్ళు
అనంత ఆకాశంలో పురివిప్పి ఆడుతుంటే
భూమి తనువంతా కళ్ళు మొలిపించుకుని
విభ్రాంతితో చూస్తుంది!

ధగధగలాడుతూ
లోకాన్ని శాసించే శక్తిమంతుడైన సూర్యుడు సైతం
ఆకుపచ్చని వాక్యాలకు కనబడితే
కిరణాల చేతులతో సెల్యూట్ చెయ్యక మానడు

చెమ్మగిల్లిన మనసు మబ్బులు
నిత్యం కురుస్తూనే ఉంటాయి
గుండెకొలనులో తేనె ఊట ఊరుతూనే ఉంటుంది!
కొన్ని చచ్చువిత్తులు మొలకెత్తలేవు
కొన్ని నేలలను ఎంత తడిపినా
కలుపే మొలుస్తుంది!

అందుకే
ఊరించే వస్తువులను చూడగానే
ఆశగా పెదవులు తడుపుకుని
కొందరు ఎత్తుకుపోతారు
అపార సంపద ఉన్నచోటే కదా దొంగలు పడతారు
అద్భుతాల వైపే కదా అందరూ కళ్ళు తిప్పుతారు!

**- పద్మావతి రాంభక్త**
**99663 07777**






# భిన్న అస్తిత్వ వేదనల 'అవస్థ'

- పుష్యమీ సాగర్
79970 72896

Postmodern literature is a form of literature that is characterizedby the use of metafiction, unreliable narration, self-reflexivity, intertextuality, and which often thematizes both historical and political issues

**"సంప్రదాయం, ఆధునికత రెండు పరస్పర విరుద్ధమైన భావనలు కావు. సాంప్రదాయ పునాది లేని ఆధునికత కుప్పకూలుతుంది. ఆధునికతలోనికి పరిణామం చెందినది, సాంప్రదాయ సర్జక స్వభావాన్ని పోగొట్టుతుంది.**

**– సూర్య భాస్కర్**

**ఈ** ఉపోద్ఘాతం అంతా కూడా మార్మిక కవి అయిన శ్రీరామా కవచం సాగర్ గారు రాసిన 'అవస్థ' నవల గురించే, ఒక భిన్నమైన అభివ్యక్తి ని సాధించాలన్న తపనతో ఆధునికత కు అనంతరమైన దశలోకి నడిపించారు. అసలు ఏ నిర్మాణమూ లేకుండా రచనలు చేయలేమా? అని ప్రశ్నిచుకున్నారు. రచనా నిర్మాణాన్ని ధ్వంసం చేస్తూ అంటే ఇతివృత్తాన్ని రచనగా నిర్మించే ఏ సూత్రాల్ని పాటించకుండా రచనా క్రమాన్ని సాగించారు. సన్నివేశాల్లో క్రమబద్ధత గాని సహేతుకత గాని ఏ క్రమం గాని, భాషలో, భావనలో స్పష్టత గాని లేకుండా రాయడం మొదలు పెట్టారు. ఇలా రాసే విధానాన్ని రెండో ప్రపంచ యుద్ధం తరువాత దోస్థవిస్కీ, బోరిస్ పాస్టర్, కాఫ్కా గాబ్రియేల్ గార్సియా తదితరులు దీన్నే స్థూలంగా 'వినిర్మాణం' అంటున్నారు . ఈ ఆధునికాంతరతను భారతీయ సాహిత్యంలో అందిపుచ్చుకున్న వారు salmaan rishdi and arundhathi roy

**– సూర్య భాస్కర్**

ఈ పోస్ట్ మోడర్నిజం అనేది సారూప్య సూత్రాలపై ఖచ్చితమైన అనుభవాన్ని నిర్మిస్తుంది, వ్యక్తిగత అనుభవం యొక్క ఫలితం ఖచ్చితంగా,సార్వత్రికమైనది కాకుండా తప్పనిసరిగా తప్పుగా, సాపేక్షంగా ఉంటుందని ఎల్లప్పుడూ తెలుసుకోవడం. ముందుమాటలో భాస్కర్ గారు ఉటంకించినట్టు వర్తమాన సమకాలీనతలే పోస్ట్ మోడర్నిజం కాలం మనం గుర్తించేలోగా నే జారిపోతూ కనుమరుగు అయిపోయే వర్తమానాన్ని పట్టుకునే పట్టి నిలిపే ప్రయత్నం వర్తమానాన్ని వర్తమానం లోనే గుర్తించగలిగే ప్రయోగాత్మకత ఈ నవల అంతా కూడా. "అలా ఎంత దూరం పరిగెట్టానో తెలియదు" అని ఆన్ గోయింగ్‌గా మొదలై ముందుకి వెనక్కి కదలాడే కాలం, దానితో పాటు సంఘటనలు, సంఘర్షణలు, సన్నివేశాలు కూడా ముందు వెనకాల కావడం గొప్ప విభ్రమ శిల్పంగా తోస్తుంది అంటారు.

ఈ పోస్ట్ మోడ్రనిజంలో రెండు రకాల భావధారలు ఉంటాయి. నేటివ్ భావజాలం ఒక్కటైతే, వలసవాద, నయా వలసవాదుల భావజాలం రెండోది. ఈ నవలలో నేటివ్ ఇండియా భావజాలంతో స్వాతంత్ర్య పోరాటం నేపధ్యంగానే సాగుతుంది. సామ్రాజ్య వాద వ్యతిరేకత, గ్లోబలీకరణ ప్రభావంగా ఏర్పడిన ఏకధ్రువాధిపత్య సంస్కరణల్ని, సంఘర్షణలని కాకుండా దాని మలి స్థాయిలో ఏర్పడ్డ పరాయీకరణ అస్తిత్వ లేమిని, ఉనికి రీత్యా కలుగుతున్న అస్థిత్వ ధోరణిని ప్రతిఫలిస్తుంది. గతించిన చరిత్రకి వర్తమానానికి జరిగిన, జరుగుతున్న సంఘర్షణ ఈ 'అవస్థ'.

ప్రతి మనిషిలో ఇద్దరు ఉంటారు. సందర్భానుసారంగా చెడు/ మంచి బయటపడుతుంది. 'అవస్థ' అనే ఈ నవల ఇతివృత్తం అంతా 'పిచ్చి పంతులు' అలియాస్ దత్తుడు చుట్టూ

తిరుగుతుంది. నవల కాలం స్వాతంత్ర్య ఉద్యమ సమయం లోనిది. అవస్థ అనే ఓడ చుట్టూ తిరుగుతుంది. మొత్తం నాలుగు అధ్యయాలుగా ఒక ముగింపుగా సాగిన ఈ నవల చిత్రకారుడు పిచ్చి పంతులు మధ్య నడుస్తుంది. చాలా భాగం మార్మికత కలిగిన మాటలు అర్ధం చేసుకొని ముందుకు పోతుంటే అబ్బా అద్భుతం అనిపిస్తుంది.

ఉద్వేగాత్మకత (Emotivity) ఉద్దీపన పట్ల తగిన ప్రతిస్పందన చూపడం. ఈ నవలలో దిగంబర శాస్త్రికి జరిగిన, జరుగుతున్న సంఘటనల పట్ల ఉద్వేగాలు, ఎమోషన్స్ మారుతూ ఉంటాయి. తను ఇలా కావడానికి గల స్థితికి అనుక్షణం కుమిలిపోతూ తనని తానూ తిట్టుకుంటాడు. ఇది ఒక పెట్టుబడిదారునికి ప్రజాస్వామ్యానికి మధ్య జరిగిన యుద్ధం. గతం పొరలు పొరలు గా మెదడు లో విచిలితాలు అయ్యి పిచ్చి పంతులు అనేక చిత్త భ్రమలలో ఉంటాడు ఏది వాస్తవం, ఏది అవాస్తవం, మీమాంసలో అవస్థ స్థితిని అనుభవిస్తాడు. నవల మొదటలో చిత్రకారుని చిత్రపటంలో ఏది గీసిన తన బొమ్మే రావడం జీర్ణించుకోలేకపోతాడు. అండమాన్ ఆదిమ జాతిని అంతం చేసిన హంతకుడిగా లోకం తనని ప్రోజెక్ట్ చేస్తున్నప్పుడు బాధకి గురి అవుతాడు.

నగ్నత్వం, ఇందులో దిగంబర శాస్త్రి నవల అంతా నగ్నంగానే తిరుగుతాడు అసలు నగ్నత్వానికి మనిషి అంతరంగానికి గల సంబంధం ఏమిటి? అనేక సందర్భాల్లో నగ్నత్వం సామాజికంగా ఆమోదయోగ్యంగా లేదు, ధిక్కరిస్తుంది, మతాలు – ఒప్పుకోలుతో సంబంధం లేకుండా – దానిని పాపంగా పరిగణించబడింది అదే సమయంలో, ఇది ఆదర్శంగా ఉంది, దాదాపు కళ ద్వారా దైవీకరించబడింది. ఈ వైరుధ్యాలు, వ్యక్తిగత అనుభవాల నుండి, తల్లిదండ్రుల పెంపకం, శరీరంతో మన స్వంత సంబంధంతో సహా, నగ్నత్వం గురించి మన అవగాహన – మన స్వంత లేదా మరొకరిదా అన్నది పక్కన పెడితే మనం మనసులో ఏమి అనుకుంటామో హిపోక్రసీ లేకుండా చెప్పడమే.. ఈ నవలలో పిచ్చి పంతులు చాలాసార్లు ఊహల్లో బతుకుతుంటాడు. గతంలో జరిగినదాన్ని నెమరు వేసుకుంటాడు. నిజానికి నవలలో అతని వయసు డెబ్బై ఏళ్ళకి పైగానే కల వాస్తవికతలో, కాని గతంలో మాత్రం యువకుడిగానే ఉంటాడు. తాను ప్రేమించిన ఓ జి కోసం జీవితాంతం తిరుగుతూనే ఉంటాడు. తన పుట్టుక, పెంపకం ... బాబాయి స్వార్ధం ఇవన్ని అతన్ని (Detachment) నిరాసక్తత పెంచుకోవడానికి తోడ్పతుంది. వాస్తవానికి దూరంగా నిర్లిప్తతతో కూడిన వైఖరితో ఉంటాడు దిగంబర శాస్త్రీ అలియాస్ పిచ్చి పంతులు. ఎప్పుడు తన కలలో కనిపించే ఓ జి అలియాస్ భగవతి కోసం వెతుకుతూ ఉంటాడు. జీవిత లక్ష్యం ఆమెని చేరుకోవడమే. అయితే ప్రతి ఒక్కరిని భగవతి అని భావిస్తూ ఉంటాడు కానీ ఎప్పుడైతే అది అబద్ధం అని తెలిసిన మరుక్షణమే నిరాసక్త మూడ్‌లోకి వెళ్ళిపోతాడు.

పిచ్చి పంతులు తన ప్రవర్తనా చిహ్నాలు (Behavior Sign) కలిగిన వ్యక్తిగా భిన్న హావభావాలని కలిగి ఉంటాడు. గతంలో ఉన్నప్పుడు ఎలా, వర్తమానంలో ఎలాంటి ప్రవర్తన శైలిని కలిగి ఉంటాడో, మనిషిలో ఉన్న అన్ని షేడ్స్‌ని చూపిస్తాడు. ముందే చెప్పుకున్నట్టు పిచ్చి పంతులు మొత్తం కథలో భ్రమలు (Illusions)ను కలిగి ఉంటాడు. గతానికి, వర్తమానానికి వేలాడుతూ ఉంటాడు. 'అవస్థ' అనే ఓడకి యజమాని అని , తాను ప్రేమించిన ఓ జిని ప్రతి ఒక్కరిలోతన ప్రేయసి ని చూసుకుంటూ ఆనందం పొందుతాడు. కానీ అది కాదని తెలిసిన మరుక్షణం ఏడుస్తూ తాగుతుంటాడు.

దిగంబర శాస్త్రి చిన్నతనం లోనే నాన్న చనిపోవడంతో బాబాయి సంరక్షణలోనే పెరుగుతాడు. చిన్నప్పటి నుంచి సరిగ్గా చదివించకపోవడం, తనని పశువు కంటే హీనంగా చూడటం, అన్ని రకాలా హింసకి, అణిచివేతకు గురి కావడం మూలాన తాను మనిషిగా కాక జంతు ప్రవృత్తిని అలవర్చుకుంటాడు. తన జంతు ప్రవర్తన, మృగత్వానికి కారణం కేవలం బాబాయి అణిచివేత అని నమ్మి చాలాచోట్ల బాధపడతాడు. బాబాయి తనని అందరిలా చదివించకుండా నిర్లక్ష్యానికి గురి చేసి ఒక జంతువుగా మార్చాడని ఏడుస్తాడు. అలాంటి ఒక స్థితిలోనే మద్దతు అవసరం (Succorance Need), According to Murray సహాయం, మద్దతు, రక్షణ, ప్రేమ సాంత్వన వేరొకరి నుంచి వెతుకులాట. అది ఓ జి కావొచ్చు, స్వరాజ్యం కావొచ్చు. తనని లోకం ముందు నిలబెట్టిన చిత్రకారుడు కావొచ్చు. వీళ్ళ నుంచి మద్దుతు అవసరాన్ని కోరతాడు. కానీ పరిస్థితులు అతనికి సహకరించవు.

ఇందులో ప్రతి పాత్రా సందోర్భచితమే. సమయపాలన అనేది సమయానుకూలంగా వివిధ పాత్రల్లో ఒదిగి పోతుంది. స్వాతంత్ర్య పోరాట యోధుడుగా ఆరంభించి, న్యాయమూర్తి గా, ప్రవక్తగా, న్యాయవాది గానూ వివిధ దశల్లోని Transformation of Charecter ని చూడొచ్చు. అధికారం కోసం, కీర్తి కోసం, వ్యక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యం హరించేవారిపై పెత్తనం చెలాయించిన వ్యవస్థ తన చేతుల్లోకి తీసుకోవడం ఈ అవస్థలో చూడవచ్చు. పిచ్చి పంతులు స్వేచ్ఛా సంసర్గం (Free Association) తనలోని అచేతన స్థితిలోని సంఘర్షణలో మెదిలిన వాస్తవాల్ని చేతనంలో అంటే వర్తమానంలో చెప్పడానికి ట్రై చేస్తుంటాడు. ఎప్పుడో నలభైల్లో జరిగిన స్వాతంత్ర్య పోరాట

కాలానికి ఇప్పటి కాలానికి లింకు పెడుతూ బేరీజు వేసుకుంటాడు. స్వరాజ్యం పాత్ర పిచ్చి పంతులుని అభిమానిస్తూనే భర్త మాట జవదాటను అంటుంది. విశృంఖలంగా ప్రవర్తించే ఆవిడ ప్రవర్తన వెనుక ఒక గొప్ప లక్ష్యం ఉంటుంది. అంతరించిపోతున్న అండమాన్ సెంటినల్ ఆదిమ జాతి పట్ల కన్సర్న్ ఉంటుంది. ఇదే సమయంలో పిచ్చి పంతులు స్మృతి ప్రతిమ (Memory Image)ని తలచుకుంటూ ఆనందిస్తూ ఉంటుంది. ప్రవర్తనా వంచన ( Behavior Feint) ప్రవర్తనా సర్దుబాటు. అవస్థలో పిచ్చి పంతులు అలియాస్ దత్తుడు చాలా సందర్భాల్లో తన ప్రవర్తన ని మార్చుకుంటూ ఉంటాడు. అది భగవతిని వెతకడంలో కావొచ్చు, హంతకుడిని కనిపెట్టడంలో కావొచ్చు. అన్ని పాత్రల్లో ఈ concern ఉంటుంది. అవస్థలో అన్ని అధ్యాయాలు ఓడ చుట్టూనే తిరుగుతాయి. ఇండియా నుంచి వలస వెళ్లి బానిస సంకెళ్ళ నుంచి విముక్తి పోరాటం. దత్తుడు తండ్రి, బాబాయి వ్యాపారంలో కోట్లు సంపాదించి ఓడకి యజమాని అవుతాడు. అవస్థ ఓడని దక్కించుకోవడానికి ఎందరో ప్రయత్నం చేస్తారు. చివరికి దత్తుడే యజమాని అవుతాడు. స్వప్నంలో అనేక అంశాలను వాస్తవంలో కనిపెట్టాలి అనుకుంటాడు. dream Realityలో బతుకుతుంటాడు. భగవతి అలియాస్ ఓ జి కోసం చివరిదాకా ఎదురు చూస్తాడు. ముసలి వయసులో నుంచి యుక్త వయసు వాడిలా చిత్త భ్రమల్లో, భ్రాంతి లో ముందుకు సాగుతాడు. ఇది చాలా సార్లు అద్దంలో చూసుకొని వాపోతాడు. నిద్రోన్మాదం (Narcomania) బాధ నుంచి అసౌకర్యం నుంచి విముక్తి కోసం పడే రోగగ్రస్త వాంఛ. దత్తుడు భిన్న రకాల అవస్థల్లో పడి బాధపడుతూ తప్పించుకోలేక ఏడుస్తూ... ప్రవర్తన శైలిలో మార్పులు.. ఇవన్నీ అతన్ని ఒకలాంటి నరకంలోకి తోస్తాయి విముక్తి పొందాని తద్వారా శాంతిని కోరుకుంటాడు. అయితే ఎప్పటికి అలానే ఉండాలని కోరుకోడు. చైతన్య స్థితి (consciousness) నిద్రావస్థ మత్తు, కోమా స్థితి నుంచి భిన్నంగా ఉండే జాగురక స్థితికి చాలా లేట్‌గా చేరుకుంటాడు అప్పటికే నష్టం జరిగి పోతుంది. తానూ హంతకుడిగా, ఆదిమ జాతి చివరి నలుసుని చంపిన హంతకుడిగా చిత్రీకరిస్తే అది స్వానురాగ గాయం (Narcissistic Wound) గా మారితే ఏమి చెయ్యలేక పోతాడు. నవలలో దత్తుడు నగ్న దేహంతో విహరిస్తూ గాలిలో తెలియాడేలా, అదృశ్యమైపోయే శక్తి కలిగి ఒక చిత్రపటంలో ఇమిడి అప్పుడప్పుడు బయటకు వచ్చి అనేక ఆలోచనలతో ఎన్నో అవస్థల్లోకి నిరంతరం పయనించే సహజ భావోద్వేగ పరంపరని చూడొచ్చు. ఇందులో బాబాయి పాత్ర చెప్పిన మాటలు ఆలోచింపచేస్తాయి : "స్వేచ్ఛ అనేది మనిషికి ఏ వ్యవస్థలో ఉండదు. స్వేచ్ఛ కోసం పోరాడిన వర్గాలే స్వేచ్ఛ పొందిన తరువాత అడ్డంగా మారవచ్చు. నియంతలు కావొచ్చు"

ఈ నవలలో అంతరించిపోతున్న ఆదిమ జాతి పట్ల సహానుభూతి, నాగరికత పేరుతో ఆ జాతిని విధ్వంసం చేసిన నయా వలసవాదుల స్వార్ధం, ఇంకా సామ్రాజ్యవాదుల పట్ల నిరసనని చాలా కోణాల్ని ఆవిష్కరించారు. మార్మికత అణువణువూ ఉండినా కొంచెం కష్టపడితే అద్భుతంగా అనిపిస్తుంది. సాధారణంగా నవలలు అనేక మలుపులతో కూడి ఉంటాయి. ఒకే థీమ్‌ని నవల మొత్తం కొనసాగించడం చేయి తిరిగిన రచయతకే సాధ్యం.

ఈ నవలలో ఒక పదం ఉంది. అది : Dream Reality. Dream Reality is a confusion, it is a difficulty or inability to determine whether an event or experience occurred during the walking state or whether it was part of a dream. .. B. S. M Kumar ఇదొక విరుద్ధ విముఖ అంశాలపై మోగే రంగుల విశ్రాంతి కాష్టం. పాత్రలకు తగ్గట్టుగా భాషను పలికించడం ఈ నవల ప్రత్యేకత. పిచ్చిపంతులు జన్మతః అబ్బిన వైదిక భాషను పలుకుతాడు. మాండలిక సొగసుని అద్భుతంగా పలికిస్తాడు. ఈ నవలలో ఈ ఒక్కడే వాస్తవ పాత్ర. మిగతావి స్వప్న జగత్తునుంచి వచ్చినవే. ఇవన్నీ కలలు మాత్రమే. కథలు కథలుగా చెబుతాడు రచయత! వాస్తవమే కలల రూపంలోకి జారిపోయి కనిపిస్తుంది. వీటికి రచయత పెట్టిన పేరు 'డ్రీం రియాలిటీ'.

జీవితానికి వాస్తవానికి వ్యతిరేక దశలో కళల వాస్తవికత ఉంటుందన్నది రచయత అభిప్రాయం, నిర్వచనం. కవి, కథకుడు, నవలాకారుడు, విమర్శకుడు అయిన సాగర్ శ్రీరామ కవచం ఎన్నో ప్రయోగాలు చేశారు. అందులో అవస్థ ఒకటి. ఈ రచయిత రాసిన 'ప్రచ్ఛన్న వస్తు శిల్పాలు' అనే విమర్శ గ్రంథం సాహిత్యంలో నూతనమైనది. ఎప్పటికప్పుడు ప్రయోగాలతో విభిన్న అభివ్యక్తితో ముందుకు సాగుతున్న సాగర్ గారికి 'అవస్థ' మరో మైలురాయి. ఈ నవల మనల్ని ఆలోచింపచేస్తుంది. సాగర్ రచనల మీద విస్తృతమైన చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ■

'కాలం అద్దం లాంటిది..
అంధయుగమైనా స్వర్ణయుగమైనా
అది మన ప్రతిబింబం'

\- తిలక్




# సవాళ్లకు సిద్ధం చేసిన 2022

**- తెలకపల్లి రవి**

**కొ**త్త సంవత్సరం 2023లోకి ప్రవేశించాం. అది ఎన్నికల సంవత్సరం కూడా అవుతుంది. లోక్‌సభ ఎన్నికలూ 2024 మొదట్లోనే పూర్తి కావాలి. పాలక పార్టీలన్నీ ఎన్నికల జ్వరంలో మునిగిపోయాయి. నిజానికి ఇప్పటికే ఆ వాతావరణం చూస్తున్నాం. వివాదాలు పరాకాష్టకు చేరాయి. రాజకీయ సామాజిక జీవితంలోని ప్రతిరంగమూ ప్రకంపనలకు గురయింది. గతంలో ఎంత చెప్పినా అర్థం కాని అంశాలు ఇప్పుడు కొంత బోధపడుతున్నాయి. కోల్‌కతాలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో బిగ్ బి అమితాబ్ బచన్ దేశంలో ప్రాథమిక హక్కుల పరిస్థితి గురించి, భావస్వేచ్ఛ గురించి ఆవేదన ప్రకటించడం అందులో ఒకటి. గోవా చిత్రోత్సవంలో జ్యూరీ చైర్మన్ ఇజ్రాయిలీ దర్శకుడు లిపిడ్ 'కాశ్మీర్ ఫైల్స్' కేవలం చవకరకం ప్రచార చిత్రమని ధైర్యంగా కొట్టిపారేయడం మరొకటి. అత్యున్నత న్యాయస్థానం పౌరహక్కుల రక్షణ చేయలేకపోతే మేమెందుకని కేంద్రాన్ని ప్రశ్నించడం ఇంకోటి. ఈ మూడు సందర్భాలు కూడా దేశం ముందున్న ప్రధాన సవాలును సూటిగా చెబుతున్నాయి.

తెలుగునాట చూస్తే గురజాడ పురస్కారాన్ని ఛాందస ప్రవచన కారులకు ఇవ్వడంపై విస్తృత స్థాయిలో నిరసన వ్యక్తం కావడం పునరుద్ధరణవాద శక్తులపై ప్రగతివాదుల కదలికను చెబుతుంది. ఇదే సమయంలో సినిమా రంగంలో మతతత్వ భావాలతో కూడిన పునరుద్ధరణవాద సినిమా ప్రపంచ స్థాయికి చేరడం అందోళనా పెంచుతున్నది. మీడియా మోడియాగా మారే క్రమం కొనసాగింది. ప్రత్యామ్నాయంగా ఉండాల్సిన సోషల్ మీడియాను కూడా పెద్ద పార్టీలు, వ్యాపార శక్తులు పక్కదోవ పట్టిస్తున్నాయి.

మార్కెట్ శక్తుల చెలగాటం ప్రపంచ కుబేరుల జాబితాలోని భారతీయ మహా సంపన్నులు లక్షల కోట్లకు ఎగబాకడం శరవేగంగా జరిగింది. బ్యాంకులు వారికి 13 లక్షల కోట్లకు పైగా కట్టబెట్టిన ఉదంతం అధికారికంగానే వెల్లడైంది. ఇక విశాఖ ఉక్కు బేరం కొనసాగుతున్నది. స్వయంగా కేంద్ర నేతలు ఖండించినా సింగరేణి గనులలో కొంత భాగం వేలానికి పెట్టడం ఈ కాలంలోనే జరిగింది. ఓడరేవులు, గనులు, విమానా శ్రయాలు అన్నీ ప్రయివేటు చేతుల్లోకి వెళుతున్నాయి. సంఘ పరివార్ మతతత్వం మార్కెట్ శక్తుల విశృంఖలత కలగలసిన మోడీ పాలన ఈ ఏడాది మరింత వెర్రితలలు వేసింది.

### ఎన్నికలలో కొత్త పరిణామాలు

దేశం వివిధ ప్రాంతాలలో ఏడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బిజెపి అయిదు తెచ్చుకుంది. గుజరాత్‌లో కాంగ్రెస్ బలం మూడో వంతుకు పడిపోతే బిజెపి బలం బాగా పెంచు కొంది. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం కొంత ఊరట, ఢిల్లీ మునిసిపల్ ఎన్నికలలో విజయం, అంతకు ముందు పంజాబ్‌లోనూ అధికారం చేపట్టి గుజరాత్‌లో 13 శాతం ఓట్లు తెచ్చుకోవడంతో ఆప్‌కు జాతీయ హోదా లభించింది. బిజెపిని ప్రధాన ప్రత్యర్థిగా ప్రకటించకుండా మామూలు మాటలకే ఆప్ రాజకీయ విధానం పరిమితమవడం సందేహాలు కలిగించింది. కేరళలో సిపిఎం రెండోసారి విజయం సాధించి సుదీర్ఘకాల వరవడిని మార్చింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ ఏడాదిలో బిజెపితో తెగతెంపులు చేసుకుని మళ్లీ తేజస్వి యాదవ్ ఆర్జేడీతో కలిశారు. బిజెపిపై తీవ్ర విమర్శలు చేయడం మొదలెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చి మోడీ విధానాలపై విరుచుకుపడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ బీహార్ వెళ్లినపుడు కూడా ఈ ప్రసక్తి రాగా ఆయన దాటవేశారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి కెసిఆర్‌తో నడుస్తున్నారు. బిఆర్ఎస్ ఏపికి విస్తరించాలని చూస్తోంది.

## ప్రాంతీయ పార్టీల పాట్లు

మరో వంక తెలంగాణలో అస్త్ర సన్యాసం చేసి ఎ.పి కే పరిమితమైన చంద్రబాబు తెలుగుదేశం పార్టీ ఖమ్మం సభతో పున:ప్రారంభం చేశారు. ఆరెస్సెస్ బాధ్యులొకరు ఇచ్చిన సలహా మేరకే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది ఎ.పి ఎన్నికల్లో బిజెపితో మెప్పు కోసమేనని కూడా చెబుతున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌తో కలిస్తేనే తమకు గట్టి మెజార్టీ వస్తుందని టిడిపి అంతర్గత సర్వే తేల్చిందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఏమైనా టిడిపి రాజకీయం అక్కడే పరిభ్రమిస్తోంది. మరోవైపున వైఎస్ షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం కూడా రాజకీయ ప్రశ్నలకు దారితీసింది. వైసీపీ ప్రభుత్వం బిజెపికి కేంద్రంలో అనుకూలంగా వుంటూనే తెలంగాణపై ఆసక్తి లేదని ప్రకటించింది. జనసేన పవన్ కల్యాణ్ ఇప్పటికీ ఓట్లు చీలనివ్వబోనని ఒకసారి, ప్రజల మద్దతు వుంటే తనే ముఖ్యమంత్రి అవుతానని మరోసారి రకరకాలుగా మాట్లాడుతూ తమ శ్రేణులనూ ఇతరులనూ కూడా తికమక పెట్టారు. ప్రధానంగా కాపులను తమ వైపు తిప్పుకోవడానికి వివిధ రాజకీయ పార్టీలు తమతమ వ్యూహాలతో హంగామా చేస్తున్నాయి. ఇతరత్రా కూడా కుల రాజకీయాలు బాగా పెరిగాయి. తెలంగాణ, ఎ.పి మళ్లీ కలిసే అవకాశముంటే తాము ముందుంటామని వైసీపీ చేసిన ప్రకటన, దానిపై తెలంగాణ నేతల దాడి మరోసారి విభజన రోజులను గుర్తు చేసింది. ఎ.పి ప్రభుత్వం విభజన సమస్యల పరిష్కారంలో జాప్యంపై సుప్రీం కోర్టులో తెలంగాణపై కేసు వేసింది. మూడు రాజధానుల బిల్లు ఉపసంహరణ ఆరు నెలల గడువు లోపు అమరావతినే కట్టాలంటూ ఎ.పి హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు ఆ మేరకు నిలిపేసింది. మార్గదర్శికీ వైసీపీకి ఘర్షణ పునరావృతమైంది. తెలంగాణలో బిఆర్ఎస్ ఎంఎల్ఎల కొనుగోల్లుకై బిజెపి దళారులు దిగిపోవడం సంచలనం సృష్టించింది. మునుగోడు ఉప ఎన్నికలలో కమ్యూనిస్టుల మద్దతుతో బిఆర్ఎస్ గట్టెక్కడమే గాక భవిష్యత్ సమీకరణాలను గురించి ప్రశ్నలు లేవనెత్తింది. కెసిఆర్ కుమార్తె కవితను ఢిల్లీ ఉప ముఖ్యమంత్రితో పాటు లిక్కర్ స్కామ్ ఛార్జిషీట్‌లో చేర్చడం, వైసీపీ ఎం.పి విజయసాయి రెడ్డి దగ్గర బంధువులను దాంట్లో ముద్దాయిలుగా చేర్చడం దేశం దృష్టిని ఆకర్షించింది.

## అంతర్జాతీయ రంగంలో..

అంతర్జాతీయంగా ఫిబ్రవరిలో మొదలైన రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతూనే వుంది. భారతదేశం యుద్ధ విరమణ జరగాలంటూనే రష్యా దగ్గర చమురు కొనే హక్కును నిలబెట్టుకుంది. జి20 నాయకత్వం దేశానికి రావడం, దానిపై ప్రధాని అఖిలపక్ష చర్చ నిర్వహించడం బట్టి చూస్తే ఎన్నికల్లో దీన్ని ప్రధాన ప్రచారాస్త్రంగా చేసుకోవడం తథ్యమని స్పష్టమైంది. భారత చైనా సరిహద్దుల్లో కొన్ని ఘర్షణలు పునరావృతమైనా రెండు దేశాలు వాటిని శ్రుతి మించకుండా జాగ్రత్త పడ్డాయి. ఈ విషయంలో బిజెపి దాగుడుమూతలు ఒకవైపు, కమ్యూనిస్టేతర ప్రతిపక్షాల అతి స్పందన మరోవైపు, మీడియా అత్యుత్సాహం ఇంకోవైపు వివాదాన్ని పెద్దగా చూపుతున్నా అదే సమయంలో ఇరుదేశాల సంప్రదింపులు కూడా కొనసాగుతున్నాయి. చైనా అధ్యక్షుడుగా సీ జిన్ పింగ్ మరోసారి ఎన్నిక కావడం గురించి బడా మీడియా ఉద్ధృత కథలు వదలినా చైనా కమ్యూనిస్టు పార్టీ మహాసభ వాటిని వమ్ము చేసింది. ఇప్పుడు మళ్లీ కరోనా ఆంక్షలపై తిరుగుబాటు అనీ, వాటిని సడలించిన తర్వాత విచ్చలవిడిగా కరోనా విజృంభణ అని గతంలో లాగే విపరీత ప్రచారం కొనసాగుతోంది. గొప్ప సంపదగా ప్రచారమైన క్రిప్టో కరెన్సీ ఇంతలోనే కూలిపోయింది. రిజర్వు బ్యాంకు భారతీయ డిజిటల్ నోట్‌ను లాంఛనంగా విడుదల చేసింది. కరోనా కాలంలో ఎన్నో ఒడుదుడుకులు చూసిన ఐటి రంగంలో 2008 మాంద్యాన్ని మించిన తొలగింపులు ఖాయమంటున్నారు. దేశంలో కోవిడ్ వేరియంట్ ప్రవేశం ఘటనలు పెరగడంతో గతానుభవాల నేపథ్యంలో తీవ్రమైన సందేహాలు అలుముకుంటున్నాయి. ప్రధాని మోడీ తనదైన శైలిలో భిన్న సంకేతాలు ఇస్తూ ఉత్కంఠ పెంచుతున్నారు.

## వివిధ రంగాల పరిస్థితి

మత సామరస్యంపైనా లౌకిక వాదుల పైన దాడులు 2022లో పెరిగాయి. ప్రార్థనా స్థలాల చట్టం-1991 వున్నా కాశీ, మధుర మందిరాలపై కోర్టులు విచారణ చేశాయి. కాశ్మీర్‌లో 370 రద్దు, పౌరసత్వ సవరణచట్టం సమీక్ష, ఎన్నికల బాండ్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంలో లొసుగులు, నగదు రద్దు నిర్ణయం సమీక్ష వంటి కేసులన్నీ ఇంకా విచారణలోనే వున్నాయి. బిజెపి యేతర పార్టీలపై ఇ.డి, ఐ.టి, సిబిఐలను ప్రయోగించే త్రిశూల వ్యూహం తీవ్రంగానే అమలైంది. రాష్ట్రాలకు నిధుల కోత, హక్కులపై కేంద్రం దాడి మరింత ఉధృతమైంది. గవర్నర్ల జోక్యం పరాకాష్టకు చేరింది. న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బ తీసే ప్రయత్నం పెద్ద ఎత్తున సాగుతోంది. సుప్రీం కోర్టు ఈ ఏడాదిలో ముగ్గురు ప్రధాన న్యాయమూర్తులను చూసింది. ప్రజల తరపున పోరాడే కొద్దిమందికి ఉపశమనం లభించినా అనేక మంది నిర్బంధం లోనే వున్నారు.

భారతీయ సినిమా రంగం కరోనా దెబ్బ నుంచి కోలుకుని మళ్లీ ఉత్సాహం పుంజుకోవడమేగాక ఓటిటి ప్రభావం పెరిగింది.

సినిమా రంగంలో ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప, కెజిఎఫ్2, కాంతార... వంటివి అంతర్జాతీయ రికార్డులు సాధించి బాలీవుడ్‌నే గాక హాలీవుడ్‌ను కూడా కుదిపేశాయి. కాకుంటే మొదట ప్రస్తావించుకున్నట్టు వీటిలో పునరుద్ధరణవాద ధోరణులూ పెరిగాయి. కొద్దో గొప్పో సామాజిక న్యాయ భావనను, దిగువ వర్గాల అభ్యున్నతిని చెప్పిన దర్శకులు కూడా వ్యాపార అవసరాల కోసం వాతావరణంలో ఇమిడిపోవడం కోసం ఇలాటి సినిమాలకు పట్టం కట్టడం ఆందోళనకరం. కృష్ణ, కృష్ణంరాజు, సత్యనారాయణ, చలపతిరావు వంటి దిగ్గజాలు ఈ ఏడాది దూరమయ్యారు. మధురాంతకం నరేంద్ర నవలకూ, వారాల ఆనంద్ అనువాదానికి, బాల సాహిత్యంలో పత్తిపాక మోహన్‌కు, యువ పురస్కారంగా పల్లిపట్టు నాగరాజుకూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు దక్కడం హర్షం కలిగించింది. వివిధ రంగాల్లో ప్రతిభావంతులు, యవశక్తులు ప్రతికూల పరిస్థితుల్లోనూ పలు విజయాలు సాధించారు.

విపరీతంగా పెరిగిన నిరుద్యోగం, పెరిగే ద్రవ్యోల్బణం, అధిక ధరల పోటు వీటి మధ్య మోడీ సర్కారు గొప్పలు కుప్పకూలుతున్నాయి. పాలక వర్గాలు తమ జీతభత్యాలపైనా గతంలో సాధించుకున్న హక్కులపైనా ఉపాధి, ఉద్యోగ భద్రతలపైనా చేస్తున్న దాడులను కార్మికవర్గం గట్టిగా ప్రతిఘటించింది. గత ఏడాది మోడీ హామీలతో తీవ్ర ఆందోళన విరమించిన రైతాంగం హామీలు వమ్ము చేసిన కేంద్రంపై మరోసారి పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. మహిళలు తమపై కొనసాగుతున్న దాడులనూ అవకాశాల నిరాకరణనూ నిరసిస్తూ ఆందోళన బాట పడుతున్నారు. చివరగా ముంచుకొస్తున్న కరోనా ముప్పును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధమవుతున్నారు. అందుకే అనేక విధాల 2022 కొత్త సవాళ్లకు సమాయత్తం చేసిన కాలంగా మిగిలిపోయింది. ■

'ఈ నూతన సంవత్సరము
నవ చేతన సంపత్కరము
యువజీవన
శోభావహము
కవితామయ
బృందావనము'
- శ్రీశ్రీ



## మరో ప్రపంచానికీ అమ్మ ఆమె

ఆమె నడుస్తూ వుంది ప్రపంచం జనిస్తూ వుంది
నడకను లెక్కిస్తూ పోతే
ఎన్ని లక్షల మైళ్ళ నేది పక్కన పెడితే
అన్ని యుగాల్లోనూ అన్ని కాలాల్లోనూ
ఆమె నడుస్తూ వస్తూంది!
అంగడి వస్తువులా అమ్ముడై
బార్డరు పద్ధతిలో మారకమై బలత్కారానికి బందీయై
ఇచ్ఛలేని బొమ్మై ఉచ్ఛరించని స్వేచ్ఛయై
అస్తిత్వంలేని అమ్మై ప్రపంచాన్ని ప్రసవిస్తూ వుంది!
ఆకాశంలో సముద్రాల్లో కొండల్లో కోనల్లో లోయల్లో
నడచి వచ్చిన ఆమె సతీసహగమనంలో కాలిపోయింది!
కన్యాశుల్కం వరకట్నాల్లో సమిధైంది!
అన్ని యుగాల్లోనూ చిరంజీవి ఆమె!
భర్త ఉగ్రుడై భార్యను రాయి చేస్తే
పుణ్యమూర్తి పాద స్పర్శకోసం తపస్విని ఐన ఆమె
ఆయువు తీరిందంటూ అసువులు తీసిన యుముణ్ణి నిలేసి
పతికి ప్రాణం పోసిన ఆమె
పురుషుడి గీటు దాటక మట్టికి ఓర్పు నేర్పింది
ఓర్పుకు ఉగ్గుపోసింది!


శీల పరీక్షకై రాజు అగ్ని ప్రవేశం చెయ్యమన్నా
నగ్నంగా వడ్డించమని పుణ్యమూర్తులు కోరినా
మండే నూనెలో చేతులు ముంచి నైర్మల్యానికి ఆదేశించినా
క్రియలు పూర్తై కర్తలకు కనువిప్పయ్యాయి!

ఆమె నడుస్తూ వుంది
ప్రపంచం ఆమెను పాలిస్తూ వుంది!

అందరూ కలగనే మరో ప్రపంచానికీ
ఊపిరిలూదే శ్వాస ఆమె !

**- అడిగోపుల వెంకటరత్నం**

**98482 52946**




# పల్లె పదాల కవితా పరిమళం

# చింతల తొవ్వ

- డాక్టర్ మహ్మద్ హసన్

99080 59234

కవి హృదయం ప్రపంచమంత విశాలం భౌతికంగా కనిపించే ఈ ప్రపంచంలో ప్రతి వస్తువు కవితా వస్తువే అందుకే శ్రీశ్రీ అన్నట్లుగా 'కాదేది కవితకు అనర్హం'. ఏదైనా మనిషిని స్పందింపజేసే కవితా వస్తువువే అయినప్పుడు కవితా ప్రవాహం ధారలై ప్రవహిస్తుంది. మనస్సు అలజడిగా వున్నప్పుడో లేదా ప్రశాంతంగా ఉన్నప్పుడో, కవి సంచరించే పరిసరాలో లేదా ప్రపంచంలో ఏదో ఒక మూల మనసుకు బాధకలిగే సంఘటన జరిగినప్పుడు కవి హృదయం వెంటనే స్పందిస్తుంది. అది కవితా రూపమైన కావచ్చు. మరే ఇతర సాహిత్య ప్రక్రియ ఐనా కావచ్చు. కవుల సున్నితత్త్వమే వారిని ముందుకు నడిపిస్తుంది.

కవిమిత్రుడు తులా శ్రీనివాస్‌తో నాకు మూడేళ్లుగా పరిచయం వుంది. వివిధ వాట్సాప్ సమూహాల్లో కవితల్ని పోస్టు చేసినప్పుడు చదివి స్పందించిన సందర్భంలో కల్గిన పరిచయం స్నేహంగా మారింది. ఇటీవల తను 'చింతల తొవ్వ' పేరుతో కవితా సంపుటి తెచ్చారు. ఒకసారి ఆ కవిత్వంలోకి వెళ్ళి పరికిద్దాం.

"ఎన్నివేల బతుకుల్ని/ కన్నదో నా నేల ...
ఎన్ని కన్నీళ్ళు దిగమింగి
ఎన్ని చరిత్రలకు వేదికై నిలిచిందో ...
ఈ నేలమీద నా తాతల/ పాదముద్రలున్నవి
ఈ గాలినిండా వారి ఊపిరి /జాడలున్నవి

ఆ సంపుటిలోని 'పురిటి మట్టి' కవితలోని వాక్యాలు ఇవి. ఇది చదవగానే శ్రీశ్రీ 'దేశ చరిత్రలు'లోని 'చారిత్రక విభాత సంధ్యల మానవకథా వికాసమెట్టిది? ఏ దేశం ఏ కాలంలో సాధించినదే పరమార్థం?' అన్న వాక్యాలు గుర్తొచ్చాయి. 'ఎన్ని చరిత్రలకు వేదికై నిలిచిందో' అన్న వాక్యంతో దాశరథి 'ఈ మానవ రూపం కోసం జరిగిన/ పరిణామాలెన్నో' వాక్యాలు గుర్తుకు వచ్చాయి. 'ఈ నేల మీద నా తాతల/ పాదముద్ర లున్నవి, ఈ గాలి నిండా వారి ఊపిరి జాడలున్నవి' అన్న వాక్యాల్లో భౌతికమైన తార్కికవాదం కనిపిస్తుంది.

"పసులకాడిసుక్క మొలవడానికిముందే
సందుచివర తోర్నపాకయ్యేది నా సూపు
గుల్లె ముత్యాలమ్మ కదిలొచ్చినట్టు
సద్ది గంపెత్తుకొని అమ్మ సందుమల్లంగనే
అన్నకూ, నాకు ఉరుకుడు పోటీ మొదలయ్యేది
అమ్మను ముట్టుకోంగనే పానం
ఎగిరిగంతేసే లేగదూడయ్యేది
గోలెంకాడి గుల్మాల మొగ్గలన్నీ
అమ్మరాంగనే కల్లిప్పి నవ్వేవి
అమ్మను జూసినంకనే తల్లికోడి
పిల్లల్ని గూట్లోకి పిలిచి ఆర్తిగా
రెక్కల కింద పొదువుకునేది"

'అనురాగపు జల్లు' కవితలోనివి ఈ వాక్యాలు. ఆర్ధ్రతవున్న భావోద్వేగపు కవిత ఇది. బాల్యం బాల్యపు జ్ఞాపకాలు, అమ్మతో పెనువేసుకొని వుండే ఆప్యాయతలని చక్కగా కళ్ళముందు ఉంచారు. ఇది చదివాక నా బాల్యం ఓ మధురమైన జ్ఞాపకంగా

గుర్తుకు వచ్చింది. పొలం దగ్గరికెళ్ళిన అమ్మ కోసం అమాయకత్వపు నిరీక్షణ, సాయంత్రాలవేళ సందు నుండి వస్తున్నట్లు గంప నెత్తిన పెట్టుకొని ముత్యాలమ్మ నడిచి వస్తున్నట్లుగా చెప్పటం అద్భుతం. 'అమ్మను చూడగానే గోలెంకాడి గుల్మాల మొగ్గలన్ని కల్లిప్పినవ్వేవి.' ఎంత సహజమైన వర్ణన ఇది. తల్లి కోడి, లేగ దూడ, ముత్యాలమ్మ, చక్కని గ్రామీణ పదాలను పేర్చి గొప్ప కవితగా తీర్చిదిద్దిండు శ్రీనివాస్. 'ఏ మజ్జెరాత్రో నిద్రలో ఉలికిపడితే అంతలోనే అందరి దేవుళ్ళను తలుసుకునే యాయమ్మ తలుపుగూట్లే ఆటాన దెచ్చి మీదంగ దిప్పి ముడుపు గట్టేది.' ఈ వాక్యాలు చదివితే నా కళ్ల వెంట జ్ఞాపకాల నీటిసుడలు పొరలు పొరలుగా కదిలాయి.

పదిమంది కలిసే పండుగ చూద్దామని
పొద్దుగూకేవేళ పొల్లగాల్లమందరం
గూడెపుబాయి తాళ్ళల్లకు గుంపులై పోయేటోల్లం
చేదునాదెక్కిన తాటికల్లు నెమ్మదిగా తలకెక్కుతుంటే
చేదు నిజాలాన్నీ ఒక్కొక్కటిగా బయటకు పొక్కేవి

ఈ వాక్యాలు 'అలా తాటివనంలో' కవితలోనివి. తన సావాసగాల్ల కథలను గాథలను చక్కగా వర్ణించాడు. వారి నైపుణ్యాలను, చీకటి పడితే మారే మనస్తత్వం ఒకడిది, తెల్లారితే మారే విచిత్రమైన మనస్తత్వం మరొకరిది ఇలా ఎన్ని విధాలుగా రాసిన ముగింపు ఉండకపోవచ్చు. 'పావనగంగ' కవిత అభాగ్య మహిళల ఆవేదనకు అద్దం పట్టింది.

'చీకటి పరదా కప్పుకున్న ఆ జీవితం సాయంత్రానికి
జాతీయ రహదారివెంట కదిలే విగ్రహమౌతుంది
ఓ రాత్రి తనకు తనువిచ్చిన తల్లికిస్తుంది
మరోసారి మనువాడినోడి మందుల లెక్కవుతుంది
పిల్లవాడి పాలడబ్బో పిల్లకు రెండో జత బట్టలో...
రూపేదైతేనేం? చీకటిని ఆయుధంగా చేసుకుని
దారిద్ర్యంపై తీవ్రమైన దాడిచేసే తాను
మలినాలన్నీ కలుపుకుని ముందుకుసాగే పావనగంగే...'

ఇది చదివాక అలిశెట్టి ప్రభాకర్ 'తను శవమై మరొకరికి వశమై తనువు పుండై మరొకరికి పండై, తను ఏడారై మరొకరికి ఒయసిస్సై' అన్న కవిత గుర్తొచ్చింది.

'పిన్నీసు / ఐదేళ్లప్పుడు అమ్మ
నాకిచ్చిన అపురూప బహుమతి
ఎందుకో .../ నాలుగు దశాబ్దాలైనా అది
నా గుండెనింకా గుచ్చుతూనే ఉంది
ఎడతెరిపిలేని అమ్మ జ్ఞాపకంలా ...
బడికెళ్ళేవేళ ...
గుండీలూడిన నిక్కరుకో/ కుట్టు పిగిలిన చొక్కాకో
పిన్నీసుపెట్టి బుగ్గను ముద్దాడి
అమ్మ కళ్ళుతుడుచుకున్న క్షణం
ఇప్పటికీ వెంటాడి గుచ్చుతూనే ఉంది.
అమ్మ రవిక చినిగినప్పుడు/ అక్క లంగాబొందె ఊడినప్పుడు
'మానాన్ని కాపాడి/ దారిద్ర్యాన్ని దాచిందీ ఈ పిన్నీసే'

అని 'పిన్నీసు' కవితలో అద్భుతంగా చెప్పారు. 'పిన్నీసు'తో ముడిపడని జీవితాలు ఎవరికి ఉండకపోవచ్చు కానీ పేదరికానికి చాలా దగ్గరి సంబంధం 'పిన్నీసు'తో వుంటుంది. చెప్పు తెగినప్పుడు, లంగా బొందె ఊడినప్పుడు, జడలో మల్లెలు తురుముకోవాలన్నప్పుడు, గుండీలూడిన చొక్కాకో, నిక్కరుకో ఆధారం అయ్యేది ఈ పిన్నీసే. నేను ఇప్పటికీ తరగతి గదిలో చాలామంది పిల్లల్ని ఈ సన్నివేశంలో చూస్తూనే ఉంటాను. హృదయం ద్రవించిపోతుంది.

ఈ పుస్తకానికి ముందుమాటలో ఆచార్య ఎన్.గోపి "పిన్నీసు' లాంటి కవితను వారు కూడా రాసినట్టు తన కన్నా శ్రీనివాస్ బాగా రాసినట్టు చెప్పారు. 'పిన్నీసు' తక్కువ వెలతో కూడుకున్నది కానీ దాని అవసరం వెల కట్టలేనిది. ఈ కవితా సంపుటిలో మొత్తం 45 కవితలు ఉన్నాయి. వస్తు వైవిధ్యంతో అన్నీ పాఠకులను అలరిస్తాయి. ఆచార్య ఎన్.గోపి చెప్పినట్లుగా ఈ కవితా సంపుటి 'మానవ సంబంధాల వారధి'. చదివిన ప్రతి ఒక్కరూ తమ బాల్యంలోకి లేదా జీవితంలోకి తరచి చూసుకోవటం మాత్రం మరువలేరు. ఎంతో ఆర్ధ్రతతో అనుభవంతో, రసానుభూతిని మిగిల్చే కవితలు ఇందులో పొందుపర్చారు. ఒక అక్షరాల మాలను కూర్చి పుస్తకానికి రూపం ఇవ్వటం గొప్ప ప్రయత్నం. నందిని సిద్ధారెడ్డి, జీవకవి మునాసు వెంకట్ ముందుమాటలు రాశారు. 'చింతల తొవ్వ' గుండా వెళ్తే బాల్యపు జ్ఞాపకాలు, అమ్మతో పెనువేసుకునే అనుబంధాలు, నాన్నతో ముడిపడి వుండే ప్రేమలు, అన్నయ్యతో మమతలు ... ఇలా అన్ని రకాల భావోద్వేగాల నెలవు ఈ సంపుటి. ఈ కవిత్వంలో పల్లె పదాలు, మాండలికాలు, దేశ్య పదాలు పుష్కలంగా దొరుకుతాయి. అద్భుతమైన రచనా కూర్పుతో మొదటి కవితా సంపుటితోనే బలమైన ముద్ర వేశాడు మిత్రుడు శ్రీనివాస్. భవిష్యత్తులో మరిన్ని కవిత సంపుటాలు వెలువరించాలని ఆశిద్దాం. ■

# అంట్లు తోమే చేతులు



ఎనభైయేండ్ల వయసులో
వృద్ధాప్యపు చీర
అంట్లు తోమే చేతులతో
గుండెలోకి
ఊపిరిని నెట్టుకొస్తున్నది!

బాల్యంలో
పలక పట్టుకోలేదు
ఆమె తండ్రి మరణం
ఆమెను రేవులో ఉతుకుని చేసింది

అమ్మతో కలసి కొన్నాళ్లు
అప్పులతో పోరాటం చేసింది
వడ్డీలపై వడ్డీలు
ఎముకల సత్వాన్నీ హరించాయి

నెత్తిన మూటలు మోసి
యవ్వనం ఖర్చయిపోయింది
తాళి కట్టినోడు
సారాసీసాను మింగొచ్చి
కొట్టినా కూడా
ఎన్ని బాధలు బరువెక్కినా
గాయాలకు వెన్నపూస రాసుకుని
నవ్వుని మాత్రం చెరగనీయలేదు

తన తిండికి
ఎవరి ముందూ యాచన చేయలేదు
తినేవి నూకలన్నమే అయినా
స్వార్జితమే అదంతా ..
కోట్లు దోచుకునే దొంగలు
ఆమె పాదధూళికి సరితూగరు

ఇపుడు
చేదుగాలిని పీల్చుతున్నది
ఒంట్లో రోగం తాండవించింది
గట్టి శ్రమ కాలేక
పదిళ్లకు అంట్ల తోమే పనయ్యింది!

కోడికూత కన్నా ముందే
ఆమె అంట్లు తోమే శబ్దమే మేల్కొంటుంది
ఆమె తోమిన గిన్నెల మెరుపుకి
అద్దాల తళుకు వెలవెల
చేతుల సత్తువనంతా కూడగట్టి
అంట్లుతోమే ఆమె నా కావ్యనాయిక!

ఎంత దుఃఖాన్నయినా
అదిమిపట్టగల విద్య ఆమె
తనను చూసి
జాలిపడేవాళ్లను చూసి
జాలిపడుతుంది!

ఓపికున్నంత వరకు
ధర మీద
ఏ చెరనైనా ఎదుర్కొంటాననే
ఆ ముదిమి తల్లి
నాకంటికెపుడూ మహాధీర!

ఆమె చేతులను
బతిమాలుకుంటాను
నాలోని
పిరికితనాన్ని తోమేసి
దిటవు మెరుగుని దిద్దమనీ!

- మెట్టా నాగేశ్వరరావు
99510 85760



# కాలమే మళ్లీ అక్షరాభ్యాసం చేయిస్తోంది!

- మాడభూషి శ్రీధర్

:: ప్రముఖ న్యాయకోవిదుడు, న్యాయశాస్త్ర ఆచార్యుడు మాడభూషి శ్రీధర్ ఆరు నెలల క్రితం ఆకస్మికంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. జ్ఞాపకశక్తిని కోల్పోయారు. చికిత్స అనంతరం క్రమేణా కోలుకుంటున్న దశలో తన జ్ఞాపకాలను ఒక్కొక్కటిగా ఇలా నెమరు వేసుకున్నారు. ::

**మా** అమ్మ, తమ్ముడు, అక్కయ్య, మేము, (హైదరాబాద్, చార్మినార్ సమీపాన) ఆ చంద్రాయణ గుట్టలో హాయిగా జీవితం సాగుతున్నది. తమ్ముడిని 'బాబు' అని పిలిచేది, అమ్మ. ఉన్నట్టుండి మంచం దిగి, సంచి వేసుకుని ఇంటి బయటకు నడుస్తోంది. అమ్మను, తమ్ముడిని, అక్కను కలవడానికి వెళుతున్నానని అనుకుంటున్నది. మనవరాలు అడిగింది : "తాతమ్మ ఎక్కడికి పోతున్నావే?" అని.

తాతమ్మ అంది : "ఇంటికి వెళుతున్నానే.మా అమ్మ పిలుస్తున్నది. అక్కడ అక్క, బాబు, మాతో వస్తున్నాడు. మాట్లాడుకోవాలె." మనవరాలు ప్రశ్నిస్తూ.. "హయ్యో ఎక్కడున్నావు నువ్వు. వెనుక నాటి రోజుల్లో లేవే. బాగనే ఉంది.".

తాతమ్మ మళ్లీ అంది: "అదేం కాదు. మా అమ్మ పిలుస్తున్నది." మనవరాలు మరోసారి చెప్పింది.. "హయ్యో... తాతమ్మ.. మీ అమ్మ ఇప్పుడు లేనే లేదు. ఎప్పుడో పోయిందే"

ఇంకా మాట పూర్తి కాకముందే మనవరాలిని చళ్లున చెంపదెబ్బ కొట్టింది. "ఏమే నా కన్నతల్లిని పోయిందంటావా" అని కోప్పడింది.

తరువాత అమ్మను జాగ్రత్తగా మంచానికి చేర్చారు.

■■■

అమ్మకు ముగ్గురు సంతానం. మా అన్నయ్య, నేనూ (కేశవ్), చెల్లి. అమ్మ.. ఒక పెద్ద చెట్టు. 92 ఏళ్లున్న నీడిచ్చే, వెచ్చదనం ఇచ్చే, ఆప్యాయతకు పెద్ద చెట్టు. నాకు, అన్నకు, చెల్లికి, కోడళ్లు, మనవలు, మనవరాళ్లు, అందరికీ ప్రేమను పంచే పచ్చని చెట్టు. అమ్మకు ఇప్పుడు ఏ అవసరమూ లేదు. జ్ఞానంతో అసలే అవసరమే లేదు. ఆనందిని.

అమ్మకు నేను 66 సంవత్సరాలున్న కొడుకునని కూడా తెలియదు. జ్ఞాపకం రావడం లేదు. విచిత్రం. తుంటి ఎముక విరిగిందని, ఆ దెబ్బలు, బాధలు ఆమెకు తెలియదు. ఆపరేషన్లు చేసారని తెలియదు. తుంటి ఎముకని అతికించి, విరిచి, కొన్ని తీసేసి, మరి కొత్త నట్లు ఇనుపముక్కలతో బిగించారు. ఆ కాలు వల్ల ఈ కొత్త అతుకులతో నిలువగలిగింది, అయినా తెలియదు. అంత ఆలోచనే లేదు. ఆ అవసరమే లేదు. దీన్ని హాయి అనాలో లేదో? కాకపోతే మరేమని అనాలి? మరిచిపోయిందా, బాధంతా తెలియకుండా భరించిన అమ్మ స్థిత ప్రజ్ఞురాలు కదా?

అమ్మకు 92 సంవత్సరాలని ఆ జ్ఞాపకాలు కరిగిపోతున్నాయి. శ్రీకృష్ణుడు పుట్టిన అష్టమికి ఒక రోజు ముందు అమ్మ పుట్టినారు. గోకుల అష్టమి ముందు రోజును అమ్మ పుట్టినరోజు అని గోకుల సప్తమి అని అంటూ ఉంటాను, సులువుగా గుర్తుంటుందని.

ఇప్పుడు ఏమీ పూర్తిగా జ్ఞాపకం లేదు. కనుక అమ్మ ఇప్పుడొక యోగిని. మౌని, హాయిగా ఆనందంగా అమ్మ నవ్వుకో కలిగిన యోగిని, ఆనందిని అమ్మ. జ్ఞాన రాహిత్యాన్ని ఆమె ప్రస్తుతం ఆనందిస్తున్నది. అమ్మ ఎన్నో కష్టాలు భరించింది. అయిదుగురు అన్నదమ్ములు కలిసి ఉండేవారు. పెదనాన్న సంగీతం పాఠాలు నేర్పేవారు. నాన్న ఆంధ్రపత్రిక ఏజెన్సీకి పనిచేసేవారు. తన మూడో సోదరుడు నాన్నకు సాయంచేసేవారు. ఇద్దరు తమ్ముళ్లు చదువుకునే వారు. చిన్న తమ్ముడు హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుకునే వారు. ప్రతి నెల మొదట హాస్టల్‌కి డబ్బు ఇచ్చేవారు.

ఆంధ్రపత్రికలు 1200 కాపీలు అమ్మేవారు నాన్నగారు. సైకిల్‌కు కట్టుకుని తెల్లవారుజామున ప్రతి ఇంటికి దినపత్రికను విసిరేవారు. రోజూ కొనుక్కునే వారు నెలరోజుల తరువాత డబ్బు ఇస్తారు. కొందరు ఎగవేసేవారు. చందాలు వసూలై వస్తే గిస్తే డబ్బులో అయిదుగురి కుటుంబం బతకాలి. నాన్నగారు ఆవిధంగా మొదట అంది వచ్చే వంద రూపాయలను ముందు తన తమ్ముడికి (చిన్నాయినకు) పంపాలి. అమ్మ (అంటే అమ్మ అక్క) అమ్మ, ముగ్గురు తోడికోడళ్లు (చెల్లెలు) సామగ్రి వచ్చేకోసం ఎదురుచూస్తూ ఉంటారు. అందాకా వంటింటి పొయ్యిలో పిల్లి లేవదు. మా పెద్దన్నయ్య, అన్నయ్య ఇద్దరూ కలిసి రోజూ పప్పు ఉప్పులు పొట్లాలు సిద్ధం చెయ్యాలి. నాన్న గారు పైసలు ఇస్తే, కిరాణ

సరుకు కొనుక్కొంటేనే పప్పులు ఉప్పులు తరువాత వండుకోవడం ప్రారంభం.

తెల్లవారుజామున నాలుగింటికి వరంగల్లు రైల్వేస్టేషన్‌కి వచ్చే మద్రాస్ ఎడిషన్ పత్రికల కట్టలు విసిరేసి వెళ్లిపోయేవారు. అందులో విజయవాడ నుంచి చేరిన పత్రికల కట్టలను నాన్న వెతుక్కోవాలి. స్టేషన్ బయట చీకటిలో ఆ కట్టల్లో కొన్ని కరపత్రాలు కనపడేవి. వెల్లడిచేయడానికి ప్రభువులకు వీల్లేని పోరాడే అంశాలు ఉండేవి. నిజాం ప్రభుత్వం పైన జనం పోరాడే వాళ్లు. పత్రికల కట్టలలో మధ్యలో అవి కనబడకుండా కాపాడేవాళ్లు. నిజాం పోలీసులు, బ్రిటిష్ ఆంగ్లేయ పాలకుల పోలీసులకు దొరికితే చంపేయడమే కాక ఇంకేమిటి?

పత్రికలు నడుపుకుంటూ, సైకిల్ తొక్కుకోవలసిందే. నా చిన్నప్పుడు సైకిల్ తొక్కడమే జీవితం. నాన్నకు కడుపులో విపరీతంగా నొప్పి వచ్చేది. కడుపు పట్టుకుని పక్క అరుగు మీద పడి నొప్పి ఆగేదాక నిలబడేది. నొప్పి తగ్గిన తరువాత కాస్సేపు సైకిల్ నడిపేది. నాన్నను తలుచుకోగానే నాకు కళ్లు పొంగేవి.

తరువాత ఏజన్సీతోపాటు వారపత్రిక నడపడం మొదలు పెట్టారు. 22 ఏళ్లు తరువాత దినపత్రికగా మార్చారు. పొద్దున 9 నుంచి రాత్రి 11 గంటలదాకా, చాలాసార్లు అర్ధరాత్రి దాకా పనిచేసుకునే వారు నాన్న. పత్రిక నడపడం అంత సులువు కాదు, ఎన్నడూ లాభం అని లెక్కించేదే లేదు. వారపత్రిక కాదు పెళ్లి పత్రికలు ప్రింట్ చేస్తేనే బాగుండేది అని బంధువులు అనేవారు నాన్న గారితో. పత్రిక వ్యాసాలు, రచించి, ప్రచురించి అందరితో అద్భుతంగా పత్రికను నడిపించే శక్తి తనకే తెలుసునని అనుకునేవాడు. అంతకు ముందు అనేకానేక పనులు చేసుకుంటే తప్ప జీవిక సాగి ఉండేది కాదు. రచయితగా పాత్రికేయుడిగా, స్వాతంత్ర్య సమర వీరుడని ప్రభుత్వం గుర్తించింది.

అమ్మకు ముగ్గురు సంతానం. చాలీచాలని జీవనం, అమ్మకు, నాన్నకు రకరకాల ఇంటి కష్టాలు. ఇద్దరూ కష్టజీవులు. నాన్న గుండె అలిసిపోయి ఆగింది, 70 సంవత్సరాలు పని చేసిన తరువాత. అంతకుముందే పత్రిక ఆగిపోయింది. నాన్న వెళ్లిపోయి ముప్పయ్ ఏళ్లు గడిచాయి.

■■■

మరపు వరమా శాపమా అని నేను ఎప్పుడూ ఆలోచించే వాడిని. ఒక్కోసారి శాపమో అంటే, మరోసారి కాదనే వారు నాన్న. నాన్న లేకుండా దాదాపు 28 సంవత్సరాలు. మా నాన్న గారు పరమపదించడానికి ముందు అమ్మకు అన్నీ తెలుసు, అందుకే బాధపడింది ఆ కష్టాలకు.

నాకు స్ట్రోక్ వల్ల గుర్తురావడం లేదు. ఆర్నెల్ల తరువాత కొన్ని విషయాలు గుర్తొస్తున్నాయి. 92 ఏళ్ల వయసులో అమ్మ చాలా మరిచిపోతున్నది. **ఓ సాయంత్రం ప్రసంగం తరువాత మరిచిపోవడం ప్రారంభమైంది, తెలియకపోడం మొదలైంది. ఒకరు ఫోన్ నెంబర్ అడిగారు. చెప్పలేకపోతున్నాను. కల్యాణిని అడిగి నా నెంబర్ చెప్పమన్నాను. ఇంటి చేర్చారు. కాని నాకేమీ తెలియదు.** ఏదైనా కానీ అని కల్యాణి తన కొడుకుని తీసుకుని ఆరు గంటలకు న్యూరోలిజీ యువ వైద్యుడు సాయి కల్యాణ్‌కి ఫోన్ చేస్తే అందు కున్నాడు. నాకు దేవుడే. వెంటనే ఎమ్మార్ఐ చేయించమన్నారు. కిమ్స్– కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పంపించారు. స్ట్రోక్ వచ్చింది. నా కొడుకు ఏడుస్తున్నాడు. తట్టుకోలేకపోయాడు. కల్యాణి ధైర్యం ఇచ్చింది. కొడుకు నిలదొక్కుకోవాల్సిందని చెప్పింది. అదే నీ కర్తవ్యం" అని చెప్పింది. కొడుకు పడిపోకుండా నన్ను పట్టుకున్నారు. ఎవరూ ఆపలేకపోతున్నారు. స్కాన్ చేయించడానికి సాధ్యం కావడం లేదు. కళ్లు ముందున్నా చూడడం లేదు. నొప్పులు, కష్టాలు, దెబ్బలు తెలియదు. ఇంజక్షన్లు తెలియదు. కడుపులో సూదులు పొడిచారని తెలియదు. కాస్సేపు కాళ్లు పడిపోవడం, వంకరం అవడం.. అమ్మకి తన కొడుకు (కేశవ్) అని ఇప్పుడు తెలియదు. నాకు ఏమీ తెలియడం లేదు. జీవితంలో ఒక నెలరోజులు శూన్యం. కడుపులో గుచ్చినది ఏమిటో, ఎక్కడుందో, ఏం చేసారో, చేయలేదో... హాస్పిటల్, డాక్టర్లు, మందులు ఏమీ తెలియదు.

పదిరోజుల తరువాత దాకా నాకేమీ తెలియదు. పూజ గదికి వెళితే ఏం చేయాలి? దేవుడి ముందు నిలబడ్డాను. ఏం చేయాలక్కడ? దేవుడు తెలియదు. పూజ తెలియదు. అడియేన్ అంటూ సాలంగ్రామ ముందు భక్తితో మొక్కి నమస్కరించవలసిన నేను, పిచ్చిగా చూస్తున్నాను. కాస్సేపయిన తరువాత సాపాటు, అదే భోజనం చేద్దాం రండి అంది. ఏమిటా పని? అదేమటని కూడా తెలియదు. అన్నం కావాలని కూడా అనడం రావడం లేదు. అన్నం కావాలని కూడా అడగకపోతే ఎవ్వడిస్తాడురా నీకు తిండి అని అమ్మ ఎన్నో సార్లు అనేది.

స్ట్రోక్ వల్ల నిద్ర రాదు. తలనొప్పి తీవ్రంగా ఉంటుంది. తల అంతా తిరిగిపోతూ ఉంటున్నది. 'ఏంరా బాగుంటున్నావా' అని అడిగితే అవునంటున్నానట. కాని ఎవరు అది, నాతో ఏం చెబుతున్నారని అర్థం కాదు. అక్కడ భగవద్గీత గురించి టిటిడి టివిలో రోజూ ప్రసంగం వినేవాడిని. భగవద్గీతలో ఓ దశలో జ్ఞాపకాలు, జ్ఞానం, మరుపు కృష్ణుడు తానే అందరికీ ఇస్తాడు అని చెప్పినట్టు లీలగా గుర్తుంది. తిరు అధ్యయనం అంటే ఏమిటి. ఆర్ఘ్యాలు, ఆచమనాలు, భగవంతుడెవరు? పెదాలు పంటి దాటనంత లోపునే అన్నీ ఆలోచనలే, మాటలు మంత్రాలు. చదువేమిటి? కాని అతనికి ఇంకా ఆ నాలుగో అయిదో అక్షరాలు మాత్రమే తెలుసు. నోరు లోలోపలే చదివే శక్తి రెండు నెలలు దాటిన తరువాత కూడా కొన్ని చిన్న అక్షరాలు కూడా అర్థం కావడం లేదే! వేలాది వ్యాసాలు, ఎన్నో పుస్తకాలు రాసిన నాకు ఎందుకో గుర్తు రావడంలేదు. అర్థం కావడం లేదు.

ఇప్పుడు అదంటే ఏమిటి? ఒక్క అక్షరం కూడా తెలియదు. అక్కడ నేను ఉన్నచోట ఏ ధ్వనిని కూడా తట్టుకుని నిలువలేను. టివిలో సినిమా చప్పుడు వినలేను. పుస్తకం చదవాలని ఉంది

కాని అర్థం కాదు. ఒక్క పేజీ కూడా నోటితో చెప్పలేను. మొదట్లో పదాలు కూడా అర్థం కాలేదు. చాలా సేపు ప్రయత్నం చేస్తే ఒక లైన్ తెలిసేది. కాని అంతలో తలనొప్పి. ఏ పనీ చేయకుండా, వినకుండా, చదవకుండా, భోజనం, మందులు కావాలని కూడా అడగడం రాకపోయేది. ఎటు నడవాలో తెలియదు.

**నిదానంగా కొత్తగా పాత సినిమాల ద్వారా జ్ఞాపకాలు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాను. ఆ సినిమాలతో నవ్వుకోగలిగాను. బ్రహ్మానందం, రాజేంద్ర ప్రసాద్, బిత్తిరి సత్తి, వేణుమాధవ్, ధర్మవరపు గార్లు (చాలామంది ఉన్నారు. నేను అందరూ మహాను భావులు హాస్య రచయితలు ఎందరో గురించి చెప్పలేకపోతున్నాను క్షమించండి.) మేలు చేసిన మీ వంటి వారిని ఎప్పుడూ మరిచిపోలేను. నవ్వించి నేర్పారు. నవ్వించి బతికించారు.**

**కంటి రెప్పవలె కల్యాణి హర్ష... వాళ్లు**

కంటి రెప్పవలె కల్యాణి, హర్ష జాగ్రత్తగా ఎప్పుడు చూస్తూ ఉంటున్నారు. ఒక రోజు మధ్యాహ్నం వాన పడుతూ ఉంది. స్ట్రోక్ సమస్య వల్ల వర్షంలో నిలబడాలని నడిచిపోవాలని హాయిగా ఉంది. మెదడు పైన నీళ్లు చిందుతూ ఉంటే కొత్తగా ఆనందంగా ఉంది. నడిచిపోతున్నాను. దారిలో ఒక మిత్రుడి ఇల్లు నాకు గుర్తొచ్చింది. కాని ఎక్కడికో అని చెప్పలేను. అదెవరూ కూడా తెలియదు. ఇంట్లోకి వెళ్లాను. అక్కడున్న పత్రిక మేనేజర్ నన్ను గుర్తించాడు. సార్ మీరు మాడభూషి కదూ అంటూ వారు నన్ను పై అంతస్తునుంచి పిలిచారు. పాత్రికేయుడు బైస దేవదాస్ నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. స్ట్రోక్ ఇబ్బందుల ఉందని ఆయనకు తెలియదు. మాట్లాడలేకపోతున్నాను. తెలిసినంత చెప్పడానికి ప్రయత్నం చేసాను. బైస సతీమణి నన్ను చూసి కన్నీరు పెట్టుకున్నారు. లేదమ్మా ఇప్పుడు ఫరవాలేదని అన్నాను. జాగ్రత్తగా కారులో తీసుకువచ్చారు.

అన్నయ్య ఇంట్లో మా అమ్మగారిని చూడడానికి వెళ్లాలని పించింది. అమ్మ నాకు కళ్లతో చెబుతున్నారు. మాటలు తెలుసు కాని నేనెవరో తెలియదు. నాకు తెలుసు కాని అన్ని మాటలు చెప్పలేను. తెలియకపోయినా నన్ను ఆప్యాయతతో చూస్తున్నారు. ఆ అమ్మకు ఇతడు తన కన్నకొడుకు అని, ఓ రెండు మూడు నెలల నుంచి అమ్మవలెనే కొడుక్కి కూడా ఏమీ తెలియదు.

కొన్నినెలల తరువాత కూడా తన కుమారుడికి జ్ఞాపకం, జ్ఞానం లేదు. ఇద్దరికి ఒకరి గురించి మరొకరికి తెలియదు. ఏ బాధా లేదు. కుమారునికి అయితే కొన్ని కొన్ని జ్ఞాపకాలు వస్తున్నాయని అమ్మకు ఇంకా జ్ఞాపకం రావడంలేదు. ఇప్పుడేవీ తెలియదు. వరమో శాపమో. తనకి తెలియదు. నేను కూడా, మా అమ్మ అన్నట్టు ఆనందంగా నవ్వుతూ ఉన్నాను. ఏదో చెప్పినట్టు, అన్నట్టు. నేను చదవి చదవలేని మధ్య, మా అమ్మకి పూర్తిగా తెలియకపోయినా, ఆప్యాయతతో చేతి వేళ్లు జొప్పిస్తూ నా తలకి నూనె రాస్తున్నది.

ఒకే ఒక్క పదం, అది 'మార్చు'.

ఒకే ఒక్క పదం, అది 'మార్చు'. 'మార్చు' అంటే దీపం ఆర్పాలన్నా, దీపాలు వెలిగించాలన్నా మళ్లీ అదే అంటే మళ్లీ వేయడం. ఆమె నాకు భార్య కావచ్చు. కాని నాకు ఆమే తల్లి, మరిచిపోయిన నా మాతృదేవత కావచ్చు. కాని కల్యాణి నాకు మాతృదేవత. నా అమ్మే ఆమే. కల్యాణికి కేశవ్‌కు వచ్చిన రెండో మాట. నాకు ఏమని, తెలుసా.. 'నవనీతం'. ఏది అడిగినా అదే మాట.

ఎంత వింత! నా చదువు, యాభై పుస్తకాలు రచించానని ఎంత అహంకారమో కదూ. అన్నీ మరిచిపోయిన తరువాత ఎన్ని రచనలు రాసి చేసేదేమిటి? నా ఇంట్లో మొదట కనిపించేవి పుస్తకాలే, నేను నాకు వచ్చిన ఫలకాలు, జ్ఞాపికలు! ఇక్కడున్నాయి, ఏమిటవి, జ్ఞాపకం జ్ఞానం మరిచిపోయినవి. కొన్ని వారాల దాకా నాకు చాలా తెలియదు. అంతకుముందు చేసే మంత్రాలు, పూజలు, స్తోత్రాలు ఏమో ఎక్కడికి పోయాయో. పెద్ద అక్షరాలు ఒకటో రెండో గుర్తొస్తున్నాయి. కాని చదవలేను. తెలిసినా మాట్లాడలేని శక్తి. ఓ నాలుగు నెలల నాటికి మరికొన్ని అక్షరాలు, పలికిన పదాలు. ఓ రోజు విష్ణు సహస్ర నామాలు చెప్పించడం చూసిన వారు ఆశ్చర్యపోయారు. కొన్నిపదాలు సొంతంగా నేనే చెప్పలేను.

సైనికాధికారుడి కుమార్తె, (నా కుమార్తె కూతురు) అంటే నాకు మనవరాలు విష్ణు. అంతకుముందు కరోనా కాలంలో కంప్యూటర్‌లో వీడియోల ద్వారా విష్ణు చదువుకున్నది. ఇక్కడికి వచ్చినప్పుడు నాకు ఏబిసిడి నేర్పేది. అప్పుడు స్ట్రోక్ బాధల మధ్యలో చదువు నాకు అభ్యాసం నేర్పింది విష్ణు. 'ఆల్ఫాబెట్ ట్రైన్', ఫోనిక్స్ సాంగ్, ఈ పాఠాలతో పాటు, యూట్యూబ్ ద్వారా 'హనుమాన్ చాలీసా, అయిగిరినందిని' అనే మహిషాసుర మర్ధని పాటలు నేర్పింది. నాతో పాటు శ్రీ కృష్ణుని హిందీ భజన్, 'జేసుదాస్ స్వాగతం కృష్ణా' అనే పాటలు, 'ఓం నమో వేంకటేశా' అని నాలుగేళ్ల విష్ణు మాతో నాతో కలిపి జపమాల తిప్పుతూ చదివేది. తెలుగు రైమ్స్ చదివేది. చదువుల తల్లి చెప్పిన మాటలు ఇవి. అప్పుడు రకరకాల చదువులను నాకు అభ్యాసం చేసింది విష్ణు. సైనికాధికారి అల్లుడు గారు పనులెన్నో ఉన్నా ఒకటో క్లాస్ ఇంగ్లీష్, లెక్కలు యూట్యూబ్ ద్వారా నాకు చేర్పేవారు.

నా బతుకు జీవనంలో ఆర్నెల్ల కాలం ఆగిపోయింది. అమ్మకు తెలియదు. మనం లేకపోయినా కాలం ఆగిపోదు కదా. కల్యాణికి కాలం ఆగిపోలేదు. మరిచీ మరవని, చెప్పలేనివి, చెప్పగలిగినవి, చెప్పడానికి ఇంకా కాలం కావాలనడం అన్నీ నాకు తెలియనివి, తెలుస్తున్నవి. ఒక్క క్షణం ఆగిన కాలం మళ్లీ నెమ్మదిగా సాగుతూ నాకు నేర్పుతుంది. ఏప్రిల్ నుంచి కాలం ఆగి సాగుతోంది. కొత్త సంవత్సరం వస్తున్నది. కాలం మహానదియై ప్రవహిస్తూ ఉంటుంది. కాలమే నాకు మళ్లీ అక్షరాభ్యాసం చేస్తున్నది. ■

(1970-2020)

# బరంపురంలో వికాసం స్వర్ణోత్సవాలు

– విజయ చంద్ర
94387 20409

**బ**రంపురంలోని సాహిత్య సాంస్కృతిక సంస్థ **వికాసం** 2022 డిసెంబరు 24, 25 తేదీల్లో స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకొంది. బరంపురం భౌగోళికంగా ఇప్పుడు ఒడిశా రాష్ట్రంలో భాగమైనప్పటికీ– తెలుగు భాషా సాహిత్య సంస్కృతులు గొప్పగా విలసిల్లిన నేల. ప్రవాసాంధ్రులు అని మా గురించి వ్యాఖ్యానించినప్పుడల్లా మాకేదో తెలియని వేదన కలుగుతుంది. నిజానికి బరంపురం అవిభక్త మద్రాసు రాష్ట్రంలో ఒక విఖ్యాత సాంస్కృతిక కేంద్రం. సినిమాల్లో సైతం పౌరాణిక పాత్రలకు వ్యవహారిక సంభాషణలు రాసిన కళా ప్రపూర్ణ తాపీ ధర్మారావు; అతడు ఆమె, బతుకు పుస్తకం స్వీయ చరిత్ర రాసి తెలుగు సాహిత్యంలో అత్యంత కీర్తి ప్రతిష్టలు ఆర్జించిన సామ్యవాది ఉప్పల లక్ష్మణరావు; వాత్స్యాయన కామసూత్రాల గ్రంథం రాసిన పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి; భారత పూర్వ రాష్ట్రపతి వివి గిరి పుట్టి జీవించిన ధన్యభూమి బరంపురం. రాజా రామ్మోహన్ రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్ లాంటి ఆధునిక సంఘ సంస్కర్తల ప్రభావం బెంగాలు మీదుగా ఒక గాలిలా వీచి బరంపురం పట్టణాన్ని స్పృశించినప్పుడు మొదటి అంతర్వర్ణ సహ పంక్తి భోజనాలు ఇక్కడే జరిగాయి. దీనికి మహాకవి గురజాడ హాజరయ్యారు. విందు ఆరగించి వచ్చిన గురజాడను ఆయన భార్య ఇంట్లోకి రానివ్వకుండా వీధి వరండాలో కూర్చోమంది. అంతటి కఠినమైన నిరంకుశ దినాలు అవి. ఈ పరిస్థితులకు ఎదురొడ్డి అభ్యుదయ వాదులు ముందుకు నడిచారు. బరంపురంలో కవులు, సాహితీ వేత్తలు ఒక సభ జరిపి సాహిత్యంలో కొత్త పోకడ కోసం తపన పడ్డారు. శ్రీశ్రీ తన మిత్రుడు కొంపెల్లతో కలిసి బరంపురం సభకు విచ్చేసి ఉత్తేజితుడయ్యాడు. నవ్య సాహిత్య పరిషత్తు ఆవిర్భావం తరువాత మహా ప్రస్థానం గేయాలు రాశాడు. ఇదంతా చరిత్ర. ఎవరూ మార్చలేని, ఏమార్చలేని చరిత్ర.

1970 ప్రాంతంలో అవసరాల రామక్రిష్ణారావు ఉద్యోగరీత్యా బరంపురంలో ఉండేవారు. ఆయన ఆ యేడాది నవంబరులో 14వ తేదీన కొందరు సాహితీ మిత్రులను కలుపుకొని 'వికాసం' అనే ఒక సాహిత్య సంస్థను ఏర్పాటు చేశారు. ఈ వికాసం సాహితీ సాంస్కృతిక సంవేదిక 50 సంవత్సరాలు 2020లోనే పూర్తి చేసుకుంది. కోవిడ్ కారణంగా ఆ ఏడాది స్వర్ణోత్సవాలు జరపలేకపోయాం. డిసెంబర్ 24, 25 తేదీల్లో బరంపురం ప్రకాశం హాల్లో ఈ చారిత్రిక స్వర్ణోత్సవాలు జరుపుకున్నాం. అనేక మంది మిత్రులు, మూడు తరాల సభ్యులు పూర్వ సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. అయిదు దశాబ్దాల్లో తాము కోల్పోయిన సహచర సభ్యులకు నివాళినర్పించడానికి, కొత్త నిర్ణయాలతో మరింత ముందుకు సాగడానికి ఈ సందర్భం ఉపయోగపడింది.

అవసరాల తరువాత మాస్కో నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన ఉప్పల లక్ష్మణరావు గారిని ఒరిస్సా హైకోర్టు న్యాయవాది వై.ఎస్.ఎన్.మూర్తి వికాసానికి పరిచయం చేశారు. అది వికాసం తీరుతెన్నులను అద్భుతంగా ప్రభావితం చేసింది. ముక్కాకలు తీరిన ఉప్పల గారి సారధ్యంలో వికాసం ఒక దశాబ్ద కాలానికి పైగా నడిచింది. దేవి బచ్చు సుభద్రామణి, ఆదినారాయణ, కె.ఎల్.ప్రసాద్, బి.ఎల్.ఎన్ స్వామి, తాతిరాజు, మురళి మోహన్, వై.ఎన్ జగదీష్, ఉమాదేవి, సుశీల, పుష్పలత, పొట్నూరు శంకర్ రావు, మాచిరాజు, నిర్మలరావు, గరికిపాటి దేవదాసు, జె.వి. రవణమూర్తి, వై.ఎస్.ఎన్ మూర్తి, ఏకాంబరం, బీనారావు, చిట్టిబాబు, కేదారినాథ్, మండపాక కామేశ్వరరావు, మల్లాప్రగడ రామారావు, దేవరకొండ సహదేవరావు, ఈపరి జయంతి రావు, ప్రత్తి ప్రకాశ రావు ప్రభృతులు మొదటితరం అయితే; కవి విజయచంద్ర, రొక్కం కామేశ్వరరావు, కిషోర్ దాస్, రమేష్ రాజు, రఘు, అగ్ని ఆవేశ్, వి.వి.రామనర్సింగరావు, రమాదేవి, కన్నతల్లి, క్రుప, కోకా సావిత్రి, కెనారా, పన్యాల జగన్నాధ దాస్, పార్ధ సారధి, భీమసేనరావు, పద్మలత, రవిశర్మ, దినకర్ తదితరులు నవతరం సభ్యులు. మధ్యలో పెద్దలు కొత్త రఘురామయ్య, ధర్మపురి క్రిష్ణమూర్తి మాష్టారు, యువర్ బుక్‌షాప్ అధినేత పి.వి,రాజు వికాసంలో సముచిత పాత్ర పోషించారు. ఇంకా ఎందరో వికాసంలో పాల్గని ప్రభావితులయ్యారు.

డాక్టర్ సి నారాయణ రెడ్డి, శివారెడ్డి, శీలా వీర్రాజు, ఎన్.గోపి, ఆత్రేయ, విద్వాన్ విశ్వం, మానేపల్లి, వాడ్రేవు చిన వీరభద్రుడు,

మహాకవి శ్రీ శ్రీ జ్వాలాముఖి, చెరబండరాజు, నిఖిలేశ్వర్, వరవర రావు, చలసాని ప్రసాద్, కాళీపట్నం, బెజవాడ గోపాలరెడ్డి, కుందుర్తి, పురిపండా, పెనుగొండ లక్ష్మీ నారాయణ, పాపినేని శివశంకర్, నందిని సిద్ధారెడ్డి, కొలకలూరి ఇనాక్, దివాకర్ల, ఏటూరి బలరామూర్తి, జి.లక్ష్మీనరసయ్య, అన్నవరం దేవేందర్, కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, చందు సుబ్బారావు, వాకాటి పాండు రంగారావు, అక్కిరాజు రమాపతిరావు, శివలెంక సంభు ప్రసాద్, మోహన్ ప్రసాద్, టి.ఎల్.కాంతారావు, రామకోటి, రోణంకి అప్పల స్వామి, మహీధర రామమోహనరావు, కె.వి.రమణా రెడ్డి, చాసో, తులసి, మధురాంతకం నరేంద్ర, కొప్పర్తి, గూడా శ్రీరాములు, నగ్నముని, సతీష్ చందర్, అట్టాడ అప్పలనాయుడు, కె.ఎన్.మల్లీశ్వరి, కె.వి.వి.ఎస్.మూర్తి, దుప్పల రవికుమార్, విద్యా సాగర్, ఎన్.వేణు గోపాల్, అరణ్య క్రిష్ణ, ఎం.కేశవరావు, సర్వ మంగళ, కె క్యూబ్ వర్మ, బాల సుధాకర మౌళి... ఇంకా ఎందరో సాహితీవేత్తలు వికాసానికి వచ్చి ఇక్కడి సాహిత్య కృషికి ముచ్చట పడ్డారు.

మనం మనం బరంపురం కథా సంపుటి, ఉండడుండండి వికాసం తొలి సమిష్టి ప్రచురణలు. ఈ సభల్లో మనం మనం బరంపురం రెండో ప్రచురణ ఆవిష్కృతం అయింది. అతడు – ఆమె నవల, బతుకు పుస్తకం స్వీయ చరిత్ర, ప్రాచీన భారత దేశంలో బానిసల స్థితిగతులు వాల్టేర్ రూబెన్ రచన అనువాదం, రష్యన్ తెలుగు నిఘంటువు, రష్యాలో జమిల్యా, తొలి ఉ పాధ్యాయుడు ఇంకా అశేష సోవియట్ సిద్ధాంత సాహిత్య గ్రంథాల అనువాదాలు, తెలంగాణా సాయుధ పోరాటం మీద రాసిన గెరిల్లా కథ, తెలుగు పలుకుబళ్ళు మీద రాసిన వ్యాసాలు ఉప్పల వారి కృతులు. ఆహ్వానం, మౌనలిపి, మహా ఘోష, నరకసృష్టి, ప్రేమిస్తూ, జై గంగే, అసంఖ్యాక నక్షత్రాలు ఒక ఆకాశం, నీలి లాంతరు, ఊదా రంగు కలలు విజయ చంద్ర కవితా సంపుటులు; ఒరియా, బెంగాలీ, హిందీ భాషల్లోకి అనువాదాలు వెలువడ్డాయి.ఈ స్వర్ణోత్సవాల్లో 'విండ్స్ ఆర్ అలివ్: ఆంగ్ల అనువాద కవితల సంపుటి; పన్యాల జగన్నాథ దాస్ మొదటి కవితా సంకలనం 'ఏడవ రుతువు కోసం' విడుదల అయ్యాయి.

రొక్కం కామేశ్వర రావు కవితా సంపుటులు బ్లో అవుట్, పదహారు, క్షత గాత్ర, అంతర్వీక్షణం, చిదాకాశం, జ్ఞానామృతం, అంతర్ముఖం ఇదివరలో వెలువడ్డాయి. ఈ ఉత్సవాల్లో అంతర్ముఖం తమిళ, హిందీ అనువాదాలు; ఇన్నర్ విజన్ ఆంగ్ల అనువాద కవితలు, ముఖారి స్వీయ వచన కవిత సంపుటి ఆవిష్కరించారు. ఉమాదేవి గారి సాహితీ సుమాలు 'కవితలు కథల సంకలనం, వరదా నరసింహారావు 'కన్యాశుల్కం స్త్రీల స్థితిగతులు' పుస్తకం కూడా ఆవిష్కరణ అయింది.


వికాసం పూర్వ అధ్యక్షులు దేవరకొండ సహదేవరావు 'మనస్సులోనే అంతా కథా సంపుటి, చు'రుక్కులు' కవితా సంపుటి, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి జీవితం, సాహిత్యం పరిశోధనా గ్రంథం, ధర్మపురి క్రిష్ణమూర్తి బహుముఖ ప్రజ్ఞాశాలి–జీవిత చరిత్ర –పుస్తకాలు ప్రచురించారు.

వికాసం సభ్యులు కె.ఎల్ ప్రసాద్ సినీ దర్శకులుగా రాణిస్తున్నారు. నగరాల్లో మహిళల మూత్ర విసర్జన సమస్య మీద ఒక లఘుచిత్రం, స్క్రీన్ ప్లే అనే ప్రేమ కథాచిత్రం నిర్మించి జాతీయ అంతర్జాతీయ ప్రశంసలు అందుకున్నారు. కిషోర్ దాస్ సినీ టీవీ రంగంలో ప్రముఖులు. స్వతంత్ర టీవీలో వారి ఎవరి గోల వారిది ప్రసారమవుతోంది. పన్యాల జగన్నాథ దాస్ జర్నలిస్టుగా ఉన్నారు.

వికాసంలో పుస్తక ప్రచురణ చేసిన కవులను మినహాయిస్తే అగ్ని ఆవేష్, దాసరి జీవన్ కుమార్, సేతుపతి ఆదినారాయణ, కొత్త కోట కేదారినాథ్, రవి శర్మ, మధులత మంచి కవిత్వం రాస్తూ ఉన్నారు. రవిశర్మ మంచి కార్టూనిస్టు. వివి రామ నరసింగరావు సంస్థ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. కోకా సావిత్రి ఇక్కడ ప్రసిద్ధి పొందిన డాక్టర్ కోకా సత్యనారాయణ గారి జీవిత చరిత్ర ఆంగ్లంలో రాసారు. గతంలో వికాసం కళింగాంధ్ర సాహితీ సదస్సు సాహిత్య అకాడెమీ సహకారంతో విజయవంతంగా ఆచార్య గోపి గారి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సభల్లో '21వ శతాబ్దం తెలుగు సాహిత్యం' శీర్షికపై అకాడెమీ సహకారంతో సాహిత్య సదస్సు నిర్వహించారు. కె.శివారెడ్డి అధ్యక్షతన కవిత్వం మీద ఖుసురపల్లి వెంకటేశ్వర్లు, కథ మీద వాసిరెడ్డి నవీన్, నవల మీద అట్టాడ అప్పలనాయుడు, అనువాదం మీద బంగాళీ నందా ప్రసంగించారు. సుప్రసిద్ధ ఒరియా కథా రచయత గౌరహరి దాస్ గౌరవ అతిధిగా హాజరై ఒరియా కథల్లో వర్తమాన ధోరణులపై ఉపన్యసించారు. ఆయన కథల తెలుగు అనువాదం ఆయన సమక్షంలోనే ఆవిష్కరణ జరిగింది.

వికాసంలో ఇప్పటికి 1000కి పైగా రచనలు వెలువడ్డాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అకాడెమీలు మా సారస్వతాన్ని గుర్తించ నిరాకరిస్తూ ఉన్నాయి. అపారంగా పోగుపడిన ఈ సారస్వత సంపదను చూడ నిరాకరించడం తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటు అని రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గతంలో వాపోయారు. సాహిత్యానికి ఎల్లలు లేవు అంటారు కానీ రాష్ట్ర సరిహద్దుల ప్రభావం తీవ్రంగా కనపడుతోంది. ఈ పరిస్థితి మారాలి. బరంపురంలో తెలుగు సాహిత్య పతాకం సమున్నతంగా ఎగురుతూ ఉంది. దానిని గుర్తించి, ప్రోత్సహించాలి. ■

'కొత్త నీటిని చేర్చుకుని
తరగెత్తు నది వలె
ఎట్టి జాతియు ముందుకేగిన
యంతకాలము
మూడు పువ్వులు ఆరు కాయలు'
- సినారె




# నాణ్యమైన పరిశోధన
# 'భావకవిత్వ విమర్శ వాఙ్మయ విచారం'

- డాక్టర్ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు
77991 11456

ఇది స్వాగతించదగ్గ సిద్ధాంత వ్యాసం. ఇటీవల ఇటువంటి స్థాయిలో పరిశోధనలు జరగడం లేదు. లోతులేని అంశాల మీద, అవ్యుత్పన్నతామయాలైన 'నిర్విశ్లేషణ'లతో వస్తున్నాయి సిద్ధాంత వ్యాసాలు. తీసుకుంటున్న అంశాలేకాక వాక్య రచన కూడా సరిగా లేని పరిశోధనలతో వాతావరణం బెంగ పుట్టిస్తోంది. పరిశోధన ముగించి చాలా కాలమయ్యాక, ఆలస్యంగా అచ్చులోకి వచ్చిన పుస్తకమే కావచ్చు గాక, ఇటువంటి సమయంలో కాందూరి సీతారామ చంద్రమూర్తి గారి 'భావ కవిత్వ విమర్శ వాఙ్మయ విచారం' అచ్చయి వచ్చి సంతోష పెడుతోంది.

భావ కవిత్వం ఏనాటి, దానిమీద పరిశోధన ఏమిటి? అనుకుంటే పొరపాటే. భావకవిత్వం అపోహలకీ, నిరాదరణకీ గురైన కవిత్వంగా మిగిలి ఉంది ఇవ్వాళ. చరిత్రలో దానికి తగ్గ స్థానం దానికి లభించిందనడానికి లేదు. అందుచేత భావకవిత్వ సంబంధి సమ్యగ్ పరిశోధన, పరిశీలనల అవసరం ఉంది. కాందూరి సీతారామచంద్రమూర్తి గారు భావకవిత్వం మీద వచ్చిన విమర్శను విశ్లేషించారు. విమర్శ మీద పరిశోధించిన పెద్దవాళ్లు కూడా తగినంతగా చూపు సారించని అంశం ఇది.

ఈ పుస్తక రచనలో అనవసరమైన ఉపోద్ఘాతాలు లేవు. సూటిగా అంశంలోకి ప్రవేశించారు రచయిత. 'భావ కవిత్వ విమర్శ వాఙ్మయ విచారం' పేరుతో తను ఏం చెయ్యదలుచుకున్నాడో చెప్పారు తొలి ప్రకరణంలో. అక్కడ ఆయన ఒక ప్రతిపాదన చేశారు. కాదు, ఒక నిశ్చయం ప్రకటించారు. సి.నారాయణ రెడ్డి గారు తమ సిద్ధాంత గ్రంథంలో ప్రతిపాదించిన ప్రణయ, ప్రకృతి, మార్మిక, దేశభక్తి, సంఘ సంస్కరణ, స్మృతి కవిత్వ శాఖలన్నీ భావకవిత్వంలో చేరవనీ, కేవలం ఆత్మాయత్రంగా సాగిన ప్రణయ కవిత్వం మాత్రమే భావకవిత్వం అవుతుందనీ తన వాదాన్ని వినిపించారు. ఇలా స్వీయ ప్రతిపాదనలున్న పరిశోధనలు చాలా అరుదైపోతున్నాయి.

రెండో ప్రకరణంలో భావ కవిత్వ విమర్శ విభాగాలేమిటో వివరించారు. అవి మూడన్నారు. నిరసన విమర్శ, సమర్థక విమర్శ, తటస్థ విమర్శ అని. వాటిని స్థూలంగా పరిచయం చేశారు.

మూడో ప్రకరణం చాలా పెద్దది. 170 పుటలకు పైగా విస్తరించింది. ఇందులో భావ కవిత్వ విమర్శ రచనల్ని ఒకటకటిగా పరిశీలించారు. (కానీ శీర్షికలో పొరపాటు దొర్లింది. రెండు మూడు ప్రకరణాలకు రెండింటికీ ఒకటే శీర్షిక ఉంచారు. 'భావ కవిత్వ విమర్శ వాఙ్మయ విభాగం' అనే పడింది.) ఈ ప్రకరణంలో కాందూరి వారు భావ కవిత్వ విమర్శగా వచ్చిన గ్రంథాల్ని, వ్యాసాల్ని, సమీక్షల్ని, పీఠికల్ని అనేక సంఖ్యకాల్ని పరామర్శించారు. అంతటితో ఆగక సృజనాత్మక రచనల్ని కూడా తీసుకున్నారు. అంటే శుక్లపక్షం, చాకిరేవు, దూదేకుడు, లాంటి పుస్తకాల్ని కూడా. అవి వ్యాస రూప రచనలు కావు. కవిత్వరూపంలోను, రూపక రూపంలోను వచ్చాయి. కానీ భావకవిత్వ విమర్శను గర్భీకరించుకున్న రచనలు కాబట్టి వాటిని కూడా స్వీకరించారన్నమాట. అలా సృజనాత్మక రచనల్ని కూడా పరిశీలనకు తీసుకోవడం బాగుంది. ఉపన్యాసాల్ని కూడా విడిచిపెట్టలేదు.

ఈ విభాగం కోసం చాలా శ్రమపడి ఉంటారు. ఎన్నెన్ని పత్రికల్ని తిరగేశారో. భారతి, కృష్ణాపత్రిక, వజ్రాయుధం, శారద, గృహలక్ష్మి, ప్రబుద్ధాంధ్ర, ప్రతిభ, వగైరాలు. అవి నిన్నమొన్నటివి కావు. 1930లలోవి. వాటిలో పడిన విమర్శ ప్రతి విమర్శల్ని చాలా శ్రద్ధగా పరిశీలించారు. ఆ రోజుల్లో

భావకవిత్వం డిఫెన్సులో ఉండేది కాబట్టి కవులు తమ పుస్తకాలను ప్రచురించినప్పుడు సాహితీ ప్రముఖుల చేత ముందు మాటలు రాయించుకుని ప్రకటించుకునే వారు. కాందూరికి ఆ పీఠికల విలువ తెలుసు. కనక వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ రోజుల్లో ఆంధ్రసారస్వత పరిషత్తు వార్షిక సభలు చాలా విలువైన సభలుగా నిర్వహింపబడేవి. ఆ సభల అధ్యక్షులు సామాన్యులు కారు. అందుచేత వాళ్లు తమ ఉపన్యాసాల్లో భావ కవిత్వ సంబంధంగా చేసిన వ్యాఖ్యల్ని, ప్రస్తావనల్ని కూడా పరిశీలించారు. ఈ సమాచార పౌష్కల్యం అభినందించదగ్గది. ఈ పుస్తకంలో చాలా విలువైన భాగం చివరి ప్రకరణం. చాలా మంది పరిశోధకులలాగా కాక తన పరిశీలన ఫలితంగా తేలిన విషయాలను నిగ్గుతేల్చారు. అందులో కొన్ని చెప్పుకోదగ్గవి.

తెలుగు విమర్శ అంతవరకూ పూర్వకాల సాహిత్యాన్ని మాత్రమే విశ్లేషిస్తూ పోయిందని తొలిసారిగా భావకవిత్వ విమర్శతోనే అది సమకాలికం అయిందని గుర్తించడం ఒకటో విషయం. వ్యాకరణ పద్ధతిలోనో, ఆలంకారిక ధోరణిలోనో సాగకుండా అనుభూతి కేంద్రంగా సాగే ఒక కొత్త పద్ధతి భావకవిత్వంతోనే మొదలయిందని గుర్తించడం రెండో విషయం. భావ కవిత్వ విమర్శ తెలుగులో కవిజీవిత విమర్శ (బయోగ్రాఫికల్ క్రిటిసిజం) అనే కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. పాశ్చాత్య సాహిత్య విమర్శ ప్రభావాన్ని కూడా గమనించి తులనాత్మకంగా పరిశీలించడం మొదలయిందని చెప్పారు.

భావ కవిత్వ విమర్శ పరిణామాన్ని కూడా గుర్తించడం ఒక ప్రత్యేకత. కృష్ణశాస్త్రిగారి 'ఆకులో ఆకునై' ఖండికను తీసుకుని దాన్ని ఎవరెవరు ఏ ఏ దశలో ఏ విధంగా అంచనా వేశారో చెప్పడం పరిశోధకుడి దృష్టి నైశిత్యానికి తార్కాణం. తల్లావర్జుల వారు ఆ కవితను స్వేచ్ఛాప్రియతా సూచిక అంటే, నిడమర్తి స.మూర్తిగారు సుకుమారత అంటే, ఆంద్ర శేషగారిరావు గారు ప్రకృతి తాదాత్మ్యత అంటే, కసిరెడ్డి వారు పర్యావరణ విజ్ఞానాన్వేషణ అన్నారట. వారి దృష్టికి రాలేదు కానీ ఇంతకన్న మంచి ఉదాహరణలున్నాయి. ఉదాహరణకు భావకవిత్వం తొలినాళ్ళలో అస్పష్టత వల్ల నిరాదరణకు గురైంది. అభ్యుదయ కవిత్వ కాలంనాటికి – ఊహాప్రేయసీ లోకంలో ఉండిపోయి వాస్తవికతను పట్టించుకోలేదంటూ ఖండనకు గురయింది. 'భావ కవిత్వంలో స్త్రీకి శరీరంలేదు ఆమెను శరీరంగా చూసిన ప్రాచీన కవులలాగానే దేవతగా చూసి వాస్తవాన్ని పట్టించుకోని భావకవులు కూడా తప్పే చేశా'రన్నారు స్త్రీవాదులు. భావ కవిత్వ భాష సాంకేతిక భాష అని విమర్శకుడొకరు అనడాన్ని మూర్తిగారు విస్మరించలేదు. మామూలుగా భాష అంతా సంకేతాలమయమే. అయితే భాష ద్వారా సూచితాలైన వస్తువుల్ని సంకేతాలుగా చేసుకుని రచన సాగించడం భావ కవిత్వ ప్రత్యేకత. ఆ విషయాన్ని గుర్తింప చెయ్యడం బాగుంది. ప్రతీకాత్మకత తెలుగు కవిత్వానికి భావకవిత్వం చేసిన చేర్పు. ఏ విధమైన శాఖా చంక్రమణా లేకపోవడం సూటిగా విల్లువిడిచిన బాణంగా ఆలోచన ఏక దిశాత్మకంగా సాగడం బాగుంది. అక్కిరాజు ఉమాకాన్తం గారు భావకవిత్వాన్ని తుత్తునియలుగా ఖండించారనే లోకంలో ఉన్న అభిప్రాయం. మూర్తిగారు మాత్రం ఆయన ఎక్కడెక్కడ భావకవిత్వాన్ని ప్రశంసించారో కూడా ఎత్తి చూపారు. కృ.శా.గారు రాసిన 'పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వం' అన్న వ్యాసంలో ఎక్కడా భావకవిత్వం అన్న మాటే లేదనడం పరిశోధకుడి జాగరూకతకి నిదర్శనం. ఆంధ్రసారస్వత పరిషత్తు వారు గ్రాంథిక భాష ఉన్న మేరకు భావకవిత్వాన్ని ఆదరించారు అనడం కొత్త విషయం. భాష, కేవలం భాష, కవిత్వ ఉత్తమాధమతల్ని నిర్ణయించడం ఒక విచిత్ర విషయమే!

అయితే 'భావ కవిత్వానికి తగిన భాష ఆనాటికి ఏర్పడలేదు అన్న వాదన ఈనాడు అంగీకార్యం అవుతుంది' అని పరిశోధకుడు అన్నప్పుడు ఏకీభవించడం కష్టం. వ్యాకరణ విరుద్ధత గురించి ఈ మాటలనడం లేదని మనకు తెలుస్తూనే ఉంది. మరి భావాన్ని వ్యక్తీకరించడంలో ఆ భాష విఫలమయిందన్నట్టు లెక్క. అసమర్థ కవుల్ని, పనికిమాలిన అనుసరణల్ని పక్కన బెట్టి మాట్లాడుకుంటాం కదా! అలా చూసినప్పుడు... అటువంటి కొరత ఏమీ కనబడదు మనకు. భావ కవిత్వం తన భాషను తను ఏర్పాటు చేసుకుంది. అది సమర్థ భాషే. ఆనాటికి తగిన భాష కూర్చుకోలేదు అంటే ... తర్వాత కూర్చుకుందన్న అర్థం వస్తుంది. భావకవిత్వానికి 'తర్వాత' అన్నది లేదు. మరో కవిత్వం వచ్చింది.

ఆత్మాశ్రయత్వం, ప్రణయ వస్తుకత ఈ రెండు మాత్రమే భావ కవిత్వ లక్షణాలంటే ఒప్పుకోవడం కష్టం. ఉదాహరణకు ఈ పరిశోధకుడి దృష్టిలో పింగళి కాటూరి కవులు రాసిన జొన్నచేను కవిత భావకవిత్వం కాజాలదు. ఎందుకంటే అది ఆత్మాశ్రయ రచన కాదు. ఒక యువకుడు ఒక యువతి ఉన్నారు అంటారు. ఆ మాటను ఒప్పుకోలేం. అది అచ్చమైన భావకవిత. అలాగే తృణకంకణం కూడా. అది కథాత్మకం కావచ్చు. కానీ పదలాలిత్యం, వర్ణనలు, ఆవిష్కరించిన భావాలు, అన్నీ భావకవిత్వ భాగాలే!

ఈ పరిశోధకుడు మరింత లోతుగా ఆలోచించిఉంటే పైవాటిని కూడా ఆమోదించి ఉండేవాడు. నారాయణరెడ్డి గారు చెప్పిన ఆరు శాఖల్నీ కాకపోయినా చాలా భాగాన్ని

భావకవిత్వంగా గుర్తించి ఉండేవాడు. అది లోపమే. సౌందర్యం, సౌకుమార్యం, ప్రేమ, పారవశ్యం, ఆరాధన, అద్భుతత్వం, ఆవేశం, తీయదనం, స్వేచ్ఛాప్రీతి, ఉదాత్తీకరణ, ప్రతీకాత్మకత మొదలైన లక్షణాలు భావకవిత్వాన్ని పట్టి ఇచ్చే ప్రత్యేక లక్షణాలు. పదంలో, అనుభూతిలో, చిత్రణలో సౌందర్య సౌకుమార్యాలు కొట్టొచ్చినట్టు కనబడతాయి. భావకవుల ప్రేమ కేవలం ప్రేయసికి పరిమితం అయింది కాదు. ప్రేమ జీవన సూత్రం అన్నంత వరకూ వెళ్ళాడు భావకవి. ప్రతిదాన్నీ ఉదాత్తీకరించడం అతని స్వభావం. అందుకే ఆ రైతులు అంత గొప్పవాళ్ళుగా కనిపిస్తారు. ఆ పల్లెపడుచులు అంత నిసర్గ నిష్కల్మత్వంతో గోచరిస్తారు. ఆ సంక్రాంతులు అంత అందంగా ఉంటాయి. వాళ్ళ ప్రేయసులు ఆరాధ్య దేవతలుగా సాక్షాత్కరిస్తారు. ఆ సెలయేళ్ళు, రాత్రుళ్ళు, పండుగలు పబ్బాలు అన్నీ గొప్పగానే ఉంటాయి. అంతకు ముందు ప్రబంధాలలో శ్లేష ఉంది కానీ ప్రతీకాత్మకత లేదు. భావకవిత్వం దాన్ని తీసుకొచ్చింది. బసవరాజు అప్పారావు గారు తాజమహల్ గురించి రాసిన పాట చాలు ఉదాహరణకి. దేశభక్తి కవిత్వం నిండా కాల్పనికత, ఆరాధన, ఆవేశం, తొణికిసలాడుతూ ఉంటాయి. అవి ఉన్న చోటల్లా అది భావ కవిత్వమే అవుతుంది. కాబట్టి పరిశోధకుడి పై నిర్ధారణను అంగీకరించలేం. అయితే చేసిన మేరకు చక్కగా నిర్దుష్టంగా ప్రణాళికా బద్ధంగా చేశారు. విభేదించాల్సిన చోట విభేదించారు. ఆమోదించాల్సిన చోట ఆమోదించారు. వస్తు సేకరణలో చూపిన శ్రద్ధ ప్రశంసనీయం. దీనికి తెలుగు విశ్వవిద్యాలయం వారు స్వర్ణపతకాన్ని ఇచ్చి మంచిపని చేశారు. ■

'వృద్ధ సంవత్సరం వెళ్లిపోయింది
పసి వత్సరం నేడు పల్లవించింది
పండుటాకుల తరం పవన ధాటికి పోయి
క్రొత్త చివురులు వేసి కోకిలమ్మలు కూసి
నూతనంగా యిలకు చేతనం వచ్చింది
జీవకాంతుల్లేని శిశిర శిథిలాంగాల
హిమ సమాధుల మీద సుమసమూహం
చల్లి
నవ వసంతోదయం నాట్యమాడింది'

\- గుంటూరు శేషేంద్రశర్మ

# భక్తి

ప్రభూ,
అంత ప్రియమైన నీకు ఇక్కడ చోటులేదు
దుమ్మూ ధూళీ మాత్రమే ఇక్కడ ఉండదగినవి
మధ్యలో కాస్త నేను.. నాలో నువ్వు ..

కొన్నైనా పువ్వుల్ని అయిననూ
తెంపలేని అసహాయిని
మన్నిస్తావు లే..
ఇక్కడ మొక్కే లేనప్పుడు..
పువ్వుల ఉనికి ఎక్కడిదీ!

ఆరాధనకీ అభిషేకానికీ
ఈ నామమాత్రపు చర్యలు నీకెందుకూ
నిన్ను పెంచే ఈ తంతులన్నీ
నిన్ను తగ్గించేవేనని నా నమ్మకం!


బుద్ధి భౌతికతని దాటేసింది
మనసు పరిసరాలు నిజాల్లోనే తేలుతున్నాయి
ఒకటి చెప్పనా..
నిన్ను మొయ్యడం బావుంది!

సమతుల్యం చేసే ప్రశ్నేముంటుంది?
తూకాన్ని తెంపేసేంతటి జవాబు నువ్వైపోయాకా..
అయినా, నిన్ను తూచే వయసుకి నేనింకా రాలేదులే.

తరచుగా లీలామాత్రం స్వరం అని
అభాండం వెయ్యాలనుకోకు
అణువణువూ నువ్వు కలగలిసిన గీతాన్ని మరి
ఇది నువ్వు నమ్మక తప్పదు
ఇక్కడ ఎవరి భక్తి నిజమంటే
నాకు చెప్పడం రాదు!

తెలుసు ...
నువ్వు నవ్వుకొనే విషయాలు మూడే మూడు కదా!
నిన్ను నమ్ముతున్నట్లు నటించేవారినీ
నిన్ను అడ్డుగా పెట్టి వ్యాపారం చేసేవారినీ
నిన్ను రాజకీయంగా మార్చేవారినీ
.. చూసినప్పుడే కదూ..!

**- బండి అనూరాధ**






# వికటిత జీవితాల హృదయ పరిమళం

- జంధ్యాల రఘుబాబు
98497 53298

తెలుగు సాహిత్యరంగంలో తండ్రీకొడుకులు ఇద్దరూ కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందటం ఓ అరుదైన సంగతి! మధురాంతకం రాజారాం 1993లో తన కథలకు కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందగా, ఆయన కుమారుడు నరేంద్ర 'మనోధర్మ పరాగం' నవలకుగానూ 2022లో ఈ పురస్కారం పొందారు. ఆధునిక సీమ కథకుల్లో ఒకరైన మధురాంతకం రాజారాం కుమారుడిగా నరేంద్ర తన సాహిత్య జీవితాన్ని ప్రారంభించడం సులభమే కావొచ్చు కానీ, దాన్ని కొనసాగించడం, నిలదొక్కుకోగలగడం, గుర్తింపు పొందటం ప్రత్యేక సాధన వల్లే సాధ్యం. ఆయన దాదాపు వంద కథలు రాశారు. నవలలూ రాశారు.

దేవదాసీల ఆత్మకథలు, జీవిత చరిత్రలు దక్షిణ భారతదేశంలో బాగా వచ్చాయి. వారి జీవితాల్లోకి తొంగి చూసి, పరిశోధించి, అర్థం చేసుకొని చేసిన రచనే మధురాంతకం నరేంద్ర గారి నవల మనోధర్మపరాగం. 30 మందికి పైగా దేవదాసీల జీవితాల్లో వారు నటీమణులుగా, గాయకులుగా, కళా ప్రదర్శకులుగా ఎలా ఎదిగారు అన్నది మనం చూడొచ్చు. వారి అనుభవాలనే ఈ నవలలో ఎంతో లయాత్మకంగా చూపించారని డా.కె.ఎస్.రావు అంటారు. ఈ నవలలో వారి అస్తిత్వ భారంతో పాటు, వారు దానిద్వారానే పేరు గడించడం, భవిష్యత్తును చూసుకోవడం చూస్తాం. సంగీతం పట్ల వారి నిబద్ధత అపూర్వం.

ఈ నవలలోని పాత్రలు తమను సంగీతానికి, నాట్యానికి ఉన్న సంబంధం రీత్యానే చూసుకుంటారు. ఎన్నో సంవత్సరాలు సమాజం వారిని అమానవీయంగా చూసిన విషయాన్ని నవల తెలియ జేస్తుంది. ఎంతో ఆవేశంతో రాసిన ఈ నవలలో వారి జీవితాల్లోకి సాగిన అన్వేషణ చూడొచ్చు. కర్నాటక సంగీతంలో వారు చేసిన ప్రయోగాలు మనల్ని ఆలోచింపచేస్తాయి. వారు సంకటస్థితిలో ఉన్నా తమ ఆత్మగౌరవానికి ఎలాంటి భంగం రాకుండా సంగీతంలోనే ఆనందాన్ని, ప్రేమను వెదుక్కోవడం చూస్తాం. నిజజీవితంలో ఆస్తులపైన, విలాసవంతమైన సౌకర్యాలపైన వారికి ధ్యాస ఉండదు. ఎక్కువ పాత్రలు తమ కథనే చెబుతాయి. బ్రాహ్మణ పోషకులకు తాము ఎలా ఉపుడుకత్తెలుగా ఉన్నామో తెలియజేస్తాయి. ప్రొ.తిరుమలరావు గారన్నట్టు ఈ నవలలో రచయిత ఎక్కడా నీతివాద స్థానాన్ని తీసుకోలేదు. సంఘటనల మధ్య లింకులను కల్పడంలో బాధ్యతాయుతంగా పనిచేసారు.

నవలలో ఉన్న పాత్రలను నిజజీవితంలో ఉన్నవారివేనని మనకు తెలిసిపోతుంది. శతాబ్దానికి పైగా దేవదాసీలుగా ముద్రపడి నిర్లక్ష్యం చేయబడ్డవారి జీవితాలను చూపుతారు రచయిత. పుస్తకానికి ముందు ఆయనే ఆ మాట చెప్పారు. ఐతే నవలగా మార్చే భాగంలో కొంత కల్పన చేయవలసి వస్తుంది. అప్పుడే నవలలో పట్టు పెరుగుతుంది. దేవదాసీలపై చాలామందికి ఎవరికి తోచిన అహగాహన వాళ్ళకు ఉంటుంది. వాటికి విరుద్ధంగా నవలలో వారిని కళాకారులుగా, వ్యక్తిత్వం కలవారుగా చూపుతారు. వారిపై గౌరవాన్ని కలిగిస్తారు. వారి చుట్టూ అల్లుకున్న పుకార్లు మొదలైనవాటి ప్రభావం తన పాత్రలపై పడకుండా జాగ్రత్తపడ్డారు రచయిత. నవలను చదివిన పాఠకులకు అందులోని కథనం, చిత్తూరు జిల్లా మాండలికంలో దేవదాసీల జీవిత చిత్రణ మనోహరంగా అనిపిస్తుంది. కొంత తమిళ భాష ప్రభావం కూడా కనిపిస్తుంది. ఈ సజీవ పాత్రలను చూస్తుంటే గురజాడ కన్యాశుల్కంలోని మధురవాణి మనకు గుర్తొస్తుంది.

దేవదాసీ నాగలక్ష్మి తల్లికంటే తన తల్లి గొంతు బాగుంటుందని, ఐతే వీళ్ళు పాడడం వల్లే మా అమ్మ ఉన్నత కులంలో పుట్టిన స్త్రీ ఐనందువల్లే కచేరీలలో పాడడం లేదని గాయత్రి పాత్ర అనుకోవడం రచయిత ఎంత సున్నితంగా సంఘటనల్ని చిత్రిస్తారో అర్థమవుతుంది. దేవదాసీల్లో కొందరు బలవంతం

గానే వేశ్యలుగా మారడం గురించి కూడా రచయిత పేర్కొంటారు. వాళ్ళు ఎందుకు ఎలా రాజీపడుతున్నారో ఒక పాత్ర ద్వారా చెబుతారు. కుటుంబ స్త్రీల జీవితాలకంటే దేవదాసీల జీవితాలే నయమని, అందుకే ఫలానా పోషకునితే వెళ్ళిపొమ్మని మూగాంబిక అనే దేవదాసీ అనడం కూడా పాఠకులను ఆలోచింపజేస్తుంది. నవలలో ఇతర ప్రాంతాలకు చెందిన దేవదాసీ గాయకుల గురించి గొప్పగా చెప్పడం చూడొచ్చు. మనుధర్మశాస్త్రం, కామశాస్త్రం కూడా దేవదాసీలు తెలుసుకొని తమ కళలపై వాటి ప్రభావం ఉందని ఒక పాత్ర చెబుతుంది. దేవదాసీల మధ్య ఉండే వైరుధ్యాలను కూడా కొన్ని పాత్రల సంభాషణల్లో చూస్తాము.


పాకుడురాళ్ళు నవల చదివితే ఆ కథ ఒక ప్రముఖ సినిమా నాయకి జీవిత చరిత్రలాగ అనిపించినట్టే, మనోధర్మపరాగం నవలలో కూడా మనకు కొందరు విదుషీమణులు పాత్రల్లో గుర్తొస్తారు. వాళ్ళ పేర్లను కూడా కొందరు విమర్శకులు పేర్కొన్నారు. నిజంగానే వారి జీవితాల్లోకి తొంగి చూసి, పరిశోధించి రాసిన నవల కాబట్టి ఆ గుర్తులు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆ పాత్రల బలం వాటి నడవడికలో, పట్టుదలలో, దీక్షలోనే ఉంది. ఒక పిచ్చివాడు వేసే కుప్పిగంతుల్లో కూడా తాను నాట్యాన్ని చూడగలిగానని, అతనే తన మొదటి గురువని ఒక పాత్రచేత చెప్పించడం మనసును తాకుతుంది. ఎన్ని మార్గాలు మూసేసినా ఆ పిచ్చివాడు ఏదో ఒక విధంగా వాళ్ళ ఇంటికి రావడం, ఎగరడం, అది చూసి తానూ ఎగిరి నృత్యం నేర్చుకున్నానని చెప్పడం, అందుకే వాడికుండే పిచ్చి తనకూ ఉందని చెప్పడం పాత్ర మలచిన తీరును తెలియజేస్తుంది.

పోషకుడెవరు, భర్త ఎవరు? పోషకుడు భర్త కాకుండా పోతాడా, భర్త పోషకుడు కాకుండా పోతాడా లాంటి ప్రశ్నల్ని కూడా రచయిత పాత్రలచేత చెప్పించి తనదైన సమధానాలను ఆ పాత్రలతోనే ఇప్పిస్తాడు. భార్యా భర్తల సంబంధాలు, తండ్రితో పిల్లల సంబంధం, ఆయన మీద ప్రేమ, వారిని ఆయన చూసుకునే విధానం పేగుబంధాన్ని చూపిస్తుంది. తండ్రి చని పోయినప్పుడు దేవదాసీ పెద్ద కుమారుడిని పంపడం మొదలైన బంధాలనూ చూస్తాం.

కచేరీలో తన కూతురు పాటకి మైమరచి, రోజూ గంటలు గంటలు తన కూతురితో సంగీత సంభాషణలు చేసే ఓ యువకుడు మీ అమ్మాయిని పోషకుడిగా కాదు, పెళ్ళి చేసుకుంటానంటే పెద్దవాళ్ళు ఏమంటారో కనుక్కోరమ్మంటుంది గాయని తల్లి. తిరిగి వచ్చి నాన్న వద్దన్నాడంటాడు. తల్లి మాటకు విలువలేదంటాడు. అమ్మ ఏమన్నదన్నది మాకు ముఖ్యం అని మళ్ళీ పంపిస్తుంది. ఆమె కూడా తండ్రి బాటలోనే సమాధానం చెప్పిందంటాడు. పెళ్ళి వద్దు పోషకుడిగా ఐతే తల్లి ఒప్పుకుందం టాడు. ఐతే తామూ అందుకు ఒప్పుకుంటామంటుంది. స్త్రీల మాటకు విలువనివ్వడం, మాతృస్వామ్య లక్షణాలనూ వీరిలో ఉందని చూపుతారు రచయిత.

"నాతో పాటు నా పాట వింటూనే" ఉండే శ్రోత కావాలని చెబుతుంది ఒక పాత్ర. "నన్ను విని, నన్ను జాగ్రత్తగా గమనించి, అవసరమైనప్పుడు సరిచేసి, బాగా పాడినప్పుడు మెచ్చుకునే ఒక శ్రోత కూడా ఉండేవాడు. నాలాగే ఆ శ్రోతకూ భౌతిక శరీరం కూడా ఉండేది. ఇది మనోధర్మసంగీతం" అని ఒకచోట, "శరీరం లేకుంటే మనస్సూ ఉండదు. సంగీతం అనేది శరీరానికి పూసే మనసు అనే పువ్వుకుండే పరాగం మాత్రమే. అది ఏ ఇద్దరికీ ఒకలా ఉండదు" పుస్తకం శీర్షిక గురించి చెబుతారు.

ఆ వికటిత జీవితాల చుట్టూ ఉండే సమాజం, సంబం ధాలు, మనుషుల ఆవేశాలు, ఆలోచనలు, ప్రవర్తనను ఎదుర్కొం టూనే తమ మనో నిబ్బరంతో వారు వెదజల్లే హృదయ పరిమళాలనే మనోధర్మ పరాగంగా రచయిత నవలీకరించడం విశేషం. ఈ నవలకు సాహిత్య అకాడమీ పురస్కారం రావడం సంతోషదాయకం. రచయితకు అభినందనలు. ■



**అ**నువాద రచనల విభాగంలో వారాల ఆనంద్ రాసిన 'ఆకుపచ్చ కవితలు' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం దక్కింది. ప్రముఖ కవి పద్మభూషణ్ గుల్జార్ రాసిన గ్రీన్‌పోయెమ్స్‌ని తెలుగులో 'ఆకుపచ్చ కవితలు' పేరుతో అనువదించారు వారాల ఆనంద్. ఈ పుస్తకంలో మొత్తం 58 కవితలు ప్రకృతికి సంబంధించినవి ఉంటాయి. మనిషి, ప్రకృతి మధ్య అనుబంధాన్ని ఈ కవితల ద్వారా ఎంతో అద్భుతంగా చెప్పారు రచయిత ఆనంద్. కేంద్ర సాహిత్య పురస్కారం కింద తామ్ర ఫలకం, రూ.లక్ష నగదు అందజేయ నున్నారు.

# సమాజాన్ని మార్చే కవిత్వం రాయాలి



పూలనిప్పులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సమాజాన్ని పురోగమన దిశలో నడిపించే కవిత్వం వర్తమాన సమాజానికి అవసరమని, ఈ దిశగా పయనిస్తున్న స్వయంప్రభ కవిత్వం కొత్తదారులు పరుచుకున్నదని ప్రజావైద్యులు డా.బ్రహ్మారెడ్డి అన్నారు. కర్నూలులోని లలితకళాసమితిలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో 18.12.2022వ తేదీ ఆదివారం స్వయంప్రభ రాసిన పూలనిప్పులు కవిత్వాన్ని ఆయన ఆవిష్కరించారు. యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి,రచయిత్రి ఎన్.నాగమణి సభాధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ కవులు తమ రచనలతో నిరంతరం సమాజాన్ని మార్చే కవిత్వం రాయాలని అన్నారు. కవిత్వం కంటే పాట జన బాహుళ్యంలోకి అతి త్వరగా వెళుతుందని, కవులు ప్రజాపాటలపై దృష్టిసారించాలన్నారు. సిల్వర్‌జూబిలీ కళాశాల అధ్యాపకురాలు రచయిత్రి డా.యం.వెంకటలక్ష్మమ్మ సమీక్షిస్తూ పూలనిప్పులు కవిత్వం ప్రాపంచిక దృక్పథం కలిగి అనేకానేక మానసిక సంఘర్షణలను కవిత్వంగా మలిచిందన్నారు. జీవితంలో జరిగే అనేకానేక అటుపోట్ల సమాహారమే ఈ కవిత్వమన్నారు. నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కవిత్వం జీవితానుభవంతో కవయిత్రి రాశారని ఇది సాహిత్యంలో కొత్త ఒరవడిని తీసుకువస్తుందన్నారు. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ కవిత్వం నిండా ఆవేదనా తరంగాలు పరుచుకున్నాయని, సగటు స్త్రీ మనోవేదనతో ఈ కవిత్వం నిండి ఉందని అన్నారు. సాహితీస్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల బసప్ప మాట్లాడుతూ కవిత్వం మనిషికి ఊరటనిస్తుందని, కవిత్వం సమాజాన్ని మార్చే ఆయుధమన్నారు. కర్నూలు నగర ఉపాధ్యక్షులు కవి డి.పార్వతయ్య మాట్లాడుతూ పూలనిప్పులు కవిత్వం అంతరంగాలను అన్వేషించిందన్నారు. ఈ సందర్భంగా కవయిత్రిపై రాసిన కవిత్వ జ్ఞాపికను అందించారు. సామాజికవేత్త పార్థసారథి రూపొందించిన ఛాయాచిత్ర జ్ఞాపికను సభలో ఆవిష్కరించారు. సభాధ్యక్షులు నాగమణి మాట్లాడుతూ వేదనకు అక్షర రూపమిస్తే కవిత్వమౌతుందని ఈ కవిత్వం నిరూపించిందన్నారు.

సభలో నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా ఆలపించిన ఉద్యమగీతాలు అలరించాయి. ఈ ఆవిష్కరణ సభలో సాహితీస్రవంతి నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయ్యన్న, చక్రపాణి యాదవ్, ప్రచార కార్యదర్శి పఠాన్ సుల్తాన్ ఖాన్, కవులు మారుతీ పౌరోహితం, సయ్యద్ జహీర్ అహ్మద్, డా.నాగమ్మ, కవితా వెంకటేశ్వర్లు, విద్యాసాగరానంద స్వామి తదితరులు పాల్గొన్నారు. ■




**కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో మారుతి పౌరోహితం గారి ఊరిమర్లు కథల సంపుటి ఆవిష్కరణ జరిగింది. రాయలసీమ ఉద్యమకారుడు భూమన్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఆచార్య కుసుమకుమారి పాల్గొని ప్రసంగించారు. ఆచార్య ఇ.వెంకటేష్ , జి.వెంకటకృష్ణ ప్రసంగించారు.**

**మహాకవి గురజాడ వర్థంతి సభ 30.11.2022వ తేదీన సత్యసాయి పుట్టపర్తి జిల్లా పెనుకొండ పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో జరిగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని, గురజాడ అప్పారావు స్మృతికి నివాళ్లు అర్పించారు.**



## ప్రముఖ రచయిత చావా శివకోటి కన్నుమూత



సుప్రసిద్ధ నవలా రచయిత, ఖమ్మం నగరానికి చెందిన చావా శివకోటి (82) డిసెంబరు 20వ తేదీన అనారోగ్యంతో మరణించారు. ముదిగొండ మండలం గోకినేపల్లిలో 1940 డిసెంబరు 14న జన్మించిన ఆయన ఖమ్మం మామిళ్లగూడెంలో స్థిరపడ్డారు. కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతూ స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు కుమారుడు పరీక్షిత్, కూతురు సౌరిస్ ఉన్నారు. శివకోటి 27 నవలలు, 120కి పైగా కథలు రాశారు. 82 ఏళ్ల వయసులోనూ 'అనుబంధ బంధాలు', 'గతించిన గతం' నవలలను విడుదల చేశారు. 'సాహితీ–హారతి' పేరుతో మిత్రుడు డాక్టర్ హరీశ్‌తో కలిసి సాంస్కృతిక వేదికను ఏర్పాటు చేసి ఎందరో సాహితీవేత్తలను సత్కరించారు. యువ రచయితలను ప్రోత్సహించారు. రావిశాస్త్రి, రచన మాస పత్రిక విశిష్టకథా పురస్కారం, త్రిపురనేని గోపీచంద్ స్మారక పురస్కారంతో పాటు ఎన్నో అవార్డులు అందుకున్నారు. చావా శివకోటి సాహిత్యరంగానికి విశేష సేవలందించారనీ, ఆయన ఆకస్మిక మృతితో సాహిత్యలోకం గొప్ప సాహితీవేత్తను కోల్పోయిందని తెలంగాణ సాహితి, సాహితీ స్రవంతి పేర్కొన్నాయి. ప్రజాసమస్యలపై ఆయన అనేక రచనలు చేశారని గుర్తు చేశాయి. దాశరథి రంగాచార్య సమకాలికుడిగా తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న వివక్షను శివకోటి తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటారని పేర్కొన్నాయి. ఈమేరకు బుధవారం తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల్లభాపురం జనార్ధన, కె ఆనందాచారి, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, కె.సత్యరంజన్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 'తెలంగాణ ఉద్యమాలు, గ్రామాల స్వరూపాల గురించి రచించారు. సాహిత్యంపై ఉన్న అభిరుచితో కథలు, కవితలు, కవితా సంపుటిలు, నవలలు రాసిన ఆయన 'అసురగణం'నవలతో తెలుగు సాహిత్యంలో సంచలనాన్ని సృష్టించింది. గోపీచంద్ శతజయంతి పేరుతో అప్పట్లోనే సాహిత్య సభలు నిర్వహించి సినారె, దాశరథి, వేటూరి, సిరివెన్నెల లాంటి ప్రసిద్ధ రచయితలను ఖమ్మం పిలిచి సన్మానించారు. సాహిత్యం రంగంలో ఆయన చేసిన కృషికిగాను 2020 డిసెంబరు 31న చివరిసారిగా గుడిపాటి వెంకటాచలం అవార్డును అందుకున్నారు. ■

## నాటకకర్త వారాల కృష్ణమూర్తి మృతి

ప్రముఖ సాహిత్యకారుడు, నాటకకర్త వారాల కృష్ణమూర్తి (72 ) 17-12-2022న హైదరాబాదులో మరణించారు. ఆయన రచయితగా, నాటకకర్తగా సాహితీలోకానికి, కళారంగానికి చిరపరిచితులే. చిత్తూరు జిల్లాను వదిలి హైదరాబాద్ ఆడిటర్ జెనరల్ (ఎజి) ఆఫీసులో ఉద్యోగంలో చేరినప్పటినుంచి మరణించేవరకు ప్రజాపక్ష రచయితగా, ప్రజలను చైతన్యవంతం చేసే వివిధ సాహితీ సాంస్కృతిక రూపాల్లో కృషిచేస్తూ రాజీపడకుండా జీవించారు. 'దేవరదున్న' (కథల సంపుటి ఈ పేరుతోనే వెలువరించారు), 'యాది' వంటి ఎన్నో మంచి కథలు రాసారు. కారా గారి చావు , గోపీచంద్ గారి పతితులు వంటి కథల్ని నాటకాలుగా మలిచి వివిధ యూనివర్సిటీలలో ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. మాయ, ఎలా బతకాలి, నగరం ప్రశాంతంగా ఉంది, గోడలు మింగిన ఊరు వంటి అనేక నాటకాలు రాసారు. నాటకరంగంపై పరిశోధనా వ్యాసాలు రాసారు. శ్రీకాకుళ ఉద్యమ సమయంలో ఇతర గిరిజన ప్రాంతాల పరిస్థితిని ప్రతిబింబిస్తూ ఒక నవల రాశారు. ఎజి ఆఫీసు వారి ఆధ్వర్యంలో నడిచే 'రంజని'తో అనేక సంవత్సరాలు ముడిపడి సాహిత్య కృషి చేశారు. నిర్బంధ కష్టకాలంలో సైతం శ్రీశ్రీని 'రంజని' వేదికలపై ఆహ్వానించి ఉపన్యాసాలు ఇప్పించారు. ఎక్కడ నాటకరంగంపై చర్చ జరుగుతున్నా అక్కడ కనిపించేవారు. ■

## మేఘనాథరెడ్డికి విమలాశాంతి కథాసాహిత్య పురస్కారం

**2022**వ సంవత్సరాంతపు కానుకగా 'కలుంకూరి గుట్ట 'కథా సంపుటి యువ రచయిత కె.వి. మేఘనాథ రెడ్డికి విమలాశాంతి కథాసాహిత్య ప్రత్యేక పురస్కారం ప్రకటిస్తున్నాం. రాయలసీమ కథా సాహిత్యంలో కొంత స్తబ్దత నెలకొన్న సమయంలో ఎంతో ఆశాజనకంగా ముందుకొచ్చిన ఐదారు మంది కథకులలో మేఘనాథరెడ్డి చెప్పుకోదగినవాడు. రాయలసీమ కథకు మళ్లీ మంచి రోజులు వస్తున్నాయన్న ఆనందంతో, కొంతమంది సీనియర్ రచయితల సూచన ప్రకారం, యువ కథారచయితలకు స్ఫూర్తిదాయకంగా, విమలాశాంతి సాహిత్యసేవా సమితి కార్యవర్గం ఏకగ్రీవంగా ఈ పురస్కారాన్ని మేఘనాథరెడ్డి కథల సంపుటికి అందించాలని నిర్ణయించింది. 2023 జనవరి మొదటి ఆదివారం నాడు అనంతపురంలో ఒక సభావేదిక మీద రచయితకు రు.5000 లు నగదుతోపాటు పురస్కార జ్ఞాపికను అందించి, సత్కరించనున్నాం.

**– శాంతి నారాయణ,**

**చైర్మన్, విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి,**

**అనంతపురం.**

# త్రిపురనేని రామస్వామి చౌదరి

జననం : 15.01.1887 మరణం : 16.01.1943



హేతువాద ఉద్యమానికి ఊపిరి పోశారు. వైదిక ప్రాబల్యాన్ని సవాలు చేసే 'ఖూనీ', 'శంబుక వధ' వంటి నాటకాలు రాశారు. 'సూతపురాణం' తదితర కావ్యాలు వెలువరించి సంచలనం కలిగించారు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 4 ▪ SANCHIKA - 4 ▪ KRISHNA ▪ January 2023
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.12.2022

